اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 4 సంచిక 8 మార్చి 2013 రూ. 17/-



## سِحْرٌ
magic

## బయటపడిన కుట్ర

## ఇమామ్ బాధ్యతలు

## విశ్వాసుల మధ్య సంప్రదింపులు

هُوَ اللّٰهُ الَّذِىْ لَآ اِلٰهَ اِلَّا هُوَ اَلْمَلِكُ الْقُدُّوْسُ السَّلٰمُ الْمُؤْمِنُ الْمُهَيْمِنُ
الْعَزِيْزُ الْجَبَّارُ الْمُتَكَبِّرُ سُبْحٰنَ اللّٰهِ عَمَّا يُشْرِكُوْنَ

ఆయనే అల్లాహ్! ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయన విశ్వ సార్వభౌముడు,
పరమ పవిత్రుడు, బలహీనతలకు అతీతుడు, శాంతిప్రదాత, సంరక్షకుడు,
సర్వశక్తివంతుడు, గొప్ప ప్రాబల్యం గలవాడు, సర్వాధికుడు,
వారు కల్పించే భాగస్వాములకు అల్లాహ్ అతీతుడు. (ఖుర్ఆన్ 59:23)

సృష్టికర్త

الله

అల్లాహ్

అల్-ముతకబ్బిరు

الْمُتَكَبِّرُ

సర్వాధికారి

THE SUPERIOR

అల్-జబ్బారు

الْجَبَّارُ

గొప్ప ప్రాబల్యం
గలవాడు

THE COMPELLER

**He is ALLAH, other than whom there is no deity, the Sovereign, the Pure, the Perfect, the Bestower of Faith, the Overseer, the Exalted in Might, the Compeller, the Superior, Exalted is ALLAH above whatever they associate with Him (Qur'an 59:23)**

**ముఖ్య గమనిక : శాంతిబాట లోగో రిజిష్టర్ చేయబడింది.** *శాంతిబాట పేరుకు దగ్గరగా ఉండే విధంగా శాంతిబాటను అనుకరిస్తూ, శాంతిబాటతో సంబంధం ఉందని ప్రజలు బావించే విధంగా ఎవరైనా శాంతిబాట వ్యాసాలను గాని, మా సొసైటీచే ప్రచురించబడిన పుస్తకాలలోని విషయాలను గాని పబ్లిష్ చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.* ***మా దగ్గర నుండి వ్రాతపూర్వకంగా అనుమతి లేకుండా, వీటిలోని ఏదైనా భాగాన్ని ఎవరైనా ప్రచురించడం లేదా జెరాక్స్ కాపీలు తీసి అమ్మడం చేస్తే ఇన్షా అల్లాహ్ వారిపైకూడా చట్టపరంగా ప్రొసీడ్ కావడం జరుగుతుంది.*** *మా వెబ్‌సైట్ నుండి శాంతిబాట సంచికలు ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకుని ఎవరైనా చదువుకునే అవకాశాన్ని మాత్రమే కల్పించాముగాని, వీటిలోని విషయాలను* ***ప్రచురించు కోవడానికి ఎవరికీ ఎటువంటి హక్కులు ఇవ్వలేదు.*** *ఈ రాష్ట్రంలోనే కాదు, ఇండియాలోని ఏ రాష్ట్రంలోని ఏ పబ్లిషర్స్‌తోనూ మాకు ఎటువంటి సంబంధాలు లేవు. ఒకవేళ మా పాఠకులు అటువంటి ప్రచురణలను చూడటం జరిగితే, వెంటనే* ***మాకు తెలియజేయమని మనవి.*** *శాంతిబాటలో ప్రచురించబడుతున్న శీర్షికలను ఇన్షా అల్లాహ్ పుస్తకాలుగా* ***తెలుగు, English, ఉర్దూలో*** *విడుదల చేయడానికి ప్రయత్నిస్తాము.*


# శాంతిబాట

**మాసపత్రిక** రూ.17/-

సంపుటి 4 సంచిక 8 మార్చి, 2013

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

**www.saanthibaata.net**

**www.saanthibaata.com**

Email:velugubaata@gmail.com

**Cell : 9491103017**



**ఎడిటర్:**

ఎమ్‌డి. అతహరుల్లా

**ఎడ్వయిజరీ బోర్డ్:**

డా॥ సలీమ్ పాషా
డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు
ఎమ్‌డి. అఫ్ఫాన్ ఉమ్రీ



**Editor**
Md. Athaharullah

**Advisory Board**

Dr. Salim Pasha
Dr. Nagireddi Srinivasa Rao
Md. Affan Omri

**Printed by**
Md. Athaharullah

**Published by**
Md. Athaharullah

**Owned by**
Velugubaata Educational Society
(R.No. 569/2008), Samalkot-533440

and

**Printed at**
Saanthibaata Publishing House,
19-1-447, Hanuman Statue Center
Samalkot - 533440

and

**Published at**
2-8-31, Kota Bazar, Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah

Phone : 9347046090,
Email: velugubaata@gmail.com
RNI Regd. No. APTEL/2009/29650

**Production Incharge**
T. Srinivasa Rao
(Zakir)


## మార్చి 2013 (రబీ ఉల్ ఆఖిర్ - జుమాద అల్-అవ్వల్ హి. 1434)


5 **అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం:** ఖుర్ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - సూరహ్ అల్-బఖరా తఫ్సీర్ : 50 - 59 ఆయత్‌లు ...

9 **రెండవ ఖలీఫా ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) వారి జీవిత చరిత్ర :** విశ్వాసుల మధ్య సంప్రదింపులు ...

15 **ముహమ్మద్(స) వారి జీవిత చరిత్ర :** తన సహచరులలో విశ్వాస పునాది ...

19 **జిన్నులు మరియు చేతబడి :** చేతబడి ...

25 **బాలబాలికలకు ప్రత్యేకం :** దైవ ప్రవక్త సాలిహ్(అ) ...

31 **ఖుర్ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం :** నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని...

32 **మంచిని బోధించడం మరియు చెడును నిరోధించే ప్రయత్నంలో 'శాంతిబాట'కు మూడున్నర సంవత్సరాలలో ఎదురైన అనుభవాలు**

37 **మస్జిద్‌లు విజ్ఞాన కేంద్రాలు - 4 :** ఇమామ్ బాధ్యతలు


**సంవత్సర చందా :**

**రూ. 200/-**


(వివరాలకు పేజీ నెం. 14 చూడండి)



**Velugubaata Educational Society**
D.No. 2-8-31, Kota Bazar
SAMALKOT - 533440
**East Godavari District**


మీ ఎడ్రస్ మారినా లేక ఫోన్ నంబర్ మారినా మీరు కాల్ చేయవలసిన నంబర్ : **9491103017**

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు, *M.Sc.,Ph.D.*
(ముహమ్మద్ అబ్దుల్ కరీమ్ )

ప్రతీరోజూ మధ్యాహ్నం 3 గం. నుండి సాయంత్రం 5 గం. వరకు

లేదా పై నంబర్‌కి SMS ద్వారా తెలియజేయండి



**ప్రచురించిన విషయాలపై సద్విమర్శలు గాని, అభిప్రాయాలు గాని ఫోన్‌లో స్వీకరించబడవని మనవి చేస్తున్నాము. వాటిని మీ పూర్తి ఎడ్రస్‌తో సహా లెటర్‌లో వ్రాసి పంపగలరు.**

*We don't accept any fund from within India and from abroad except from our team members and close friends who have Taqwa and whose money is earned in Halaal way as instructed by Our Holy Prophet Muhammad(s). We don't ask financial help from anybody at any time, except from ALLAH. If anybody wants to help us, they can try to increase our subscribers by joining their friends and relatives or can buy a fixed number of copies every month.*

బిస్మిల్లా హిర్రహ్మాన నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

*జరిగిన సంఘటనల ద్వారా*

# బయటపడిన కుట్ర

ఫిబ్రవరి 21వ తేదీన హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో పేలుళ్లు జరిగాయి. వాటికి కారకులెవరో ఇంకనూ తెలియరాలేదు. అయితే 22వ తారీఖు నుండి ముస్లిములను లక్ష్యంగా చేసుకుని మీడియా కథనాల రూపంలో విద్వేషం రగిలించే బాంబులు వేయడం మొదలుపెట్టింది. ఉన్మాదుల చేత కథనాలు వ్రాయించి వారిని మేధావులుగా పేర్కొనడం మరియు ఎవరు కారకులో తెలియకుండానే మతోన్మాద ప్రేరిత ఉగ్రవాదం అంటూ ఉన్మాదపు వ్రాతలు ప్రచురించేసారు. మీడియాకు స్వేచ్ఛ ఉంది. కాని రాజ్యాంగానికి, నైతిక విలువలకు, నిజాయితీకి అతీతులై పోయామనే భావనలో ఉన్న మీడియాను నియంత్రించక పోతే మీడియా ఉగ్రవాదం సమాజానికి ప్రమాదంగా మారిపోతుంది.

ఓ వ్యక్తికి ప్రమాదం జరిగితే, అతనికి ఏమి జరిగిందో డాక్టర్లు పరీక్షించి చెబుతారు. ఒక కేసు విషయంలో తీర్పు న్యాయమూర్తి చెబుతారు. బాంబ్ బ్లాస్ట్‌లు జరిగినప్పుడు సంబంధిత ఇన్వెస్టిగేటివ్ ఏజెన్సీ దర్యాప్తు చేసి కారకులు ఎవరో బయట పెడతారు. ఈ విధంగా ప్రతీ విషయంలోనూ సంబంధిత శాఖలో నైపుణ్యం గలవారు మాత్రమే చెబుతారు.

కాని ఏ నైపుణ్యం లేకపోయినా ఎటువంటి శోధన లేకుండానే ప్రతీదీ స్వయంగా చెప్పేయగల రంగం ఒకటుంది. అదే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా. ఇది మన దౌర్భాగ్యం.

ఇండియన్ ముజాహిదీన్ చేయించిందా? స్వామి అసీమానంద అనుచరులు చేయించారా? లేక సాధ్వి ప్రగ్యాసింగ్ చేయించడం జరిగిందా? ఈ విషయాన్ని తేల్చడానికి ఎన్.ఐ.ఏ.వారు పనిచేస్తున్నారు. మక్కా మస్జిద్ పేలుళ్లు, మాలెగావ్ పేలుళ్ళు, అజ్మీర్ దర్గా పేలుళ్ళు, సంఝౌతా ఎక్స్‌ప్రెస్ పేలుళ్లకు కూడా ముందు ముస్లిములనే కారకులుగా అనుమానించారు. కాని వాటికి కారకులు ఆశ్రమంలో ఉండే ఓ స్వామీజీ గారు, ఓ సాధ్విగారు, ఆర్.ఎస్.ఎస్. నాయకుడు ఒకరు. మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి గారు కొన్నాళ్ళ క్రితం హైదరాబాద్‌లో ఇలా ప్రకటించారు :

***"మక్కా మస్జిద్ పేలుళ్లు హిందూ ఉగ్రవాదుల పనే".*** *హిందూ ఉగ్రవాదులను, మతోన్మాద శక్తులనూ దూరంగా ఉంచేందుకు అంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.* ***మక్కా పేలుళ్ల కేసులో తొలుత అమాయకులైన ముస్లిమ్ యువకులను నిందితులుగా భావించి జైళ్ళకు పంపాల్సి వచ్చిందన్నారు.*** *పేలుళ్ళతో వారికి సంబంధం లేదని విచారణలో తేలిందన్నారు. ముస్లిమ్ యువకులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తామన్నారు."* **(సాక్షి దినపత్రిక, ఫిబ్రవరి 3, 2011 పేజీ. 12)**

అనుమానాలు తప్పు అని తేలింది కదా! ఎందరో అమాయకులు బలైపోయారు కదా! మరి మీడియాకు బుద్ధి ఎప్పుడు వస్తుంది? ఇప్పటికే దర్యాప్తు ప్రారంభమైంది. దర్యాప్తు సంస్థలు మీడియా కోసం ఏదైతే రిలీజ్ చేస్తాయో దానినే అందరూ ప్రచురించాలి.

ముస్లిములను లక్ష్యంగా చేసుకుని, ముస్లిములపై అనుమానపు వ్రాతలు వ్రాసి వారి జీవితాలతో ఆడుకుంటున్న మీడియా, ఉగ్రవాది కంటే భయంకరమైనదిగా రూపాంతరం చెందుతుంది. మానవతా విలువలను మంట గలుపుతుంది.

తొగాడియా గత 20 సంవత్సరాలుగా పోలీసులు పక్కన ఉన్నా సరే ముస్లిములు చంపబడుతున్నారని ప్రకటించాడు. అంటే 20 సంవత్సరాల క్రితమే ముస్లిములపై దాడి ప్రారంభమైంది. ఓ పథకం ప్రకారం కుట్ర జరుగుతుంది.

ముస్లిముల పట్ల ఇతర మతధర్మాలవారికి సానుభూతి లేకుండా ఉండేందుకు, ముస్లిములు పాకిస్తాన్‌కు అనుకూలంగా ఉన్నట్లు మరియు ఇండియా పట్ల శతృత్వం వహిస్తున్నట్లు నమ్మించడానికి భారీ స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. శాంతిబాట ఎడిటోరియల్‌లో ఇదివరకు రెండుసార్లు తెలియజేశాము. కర్ణాటకలో ఓ తహసిల్దార్‌గారి ఆఫీస్ ముందు పాకిస్తాన్ జెండా ఎగురవేస్తూ కొందరు ఓ హిందుత్వ సంస్థకి చెందిన వారు పట్టుబడ్డారు. వీరు పాకిస్తాన్ జెండాను ఎగురువేసి, నిందను ముస్లిములపై వేసి ముస్లిములను పాకిస్తాన్ సపోర్టర్లుగా నమ్మించాలనుకున్నారు.

అల్లాహ్ కారుణ్యం వలన ఆ కుట్ర ఫలించలేదు. పోలీసులు భగ్నం చేశారు. **ఇండియన్ ముస్లిములు పాకిస్తాన్‌కు ఎలా సపోర్ట్ చేస్తారు?** సపోర్ట్ చేస్తారని అంత మూర్ఖంగా ఎలా ఆలోచించారు?

అజ్మీర్ దర్గా పేలుళ్ళ విషయంలో స్వామి అసీమానంద చెప్పిన దానిని బట్టి, ఆర్.ఎస్.ఎస్. నాయకుడు ఇంద్రేష్ కుమార్ పాకిస్తాన్ ఐ.ఎస్.ఐ. నుండి ఇద్దరు ముస్లిమ్ కుర్రాళ్ళని తీసుకున్నారట. అంటే **పాకిస్తాన్ ఐ.ఎస్.ఐ.తో సంబంధం ఉన్నది ఎవరికి?** ఏ సంస్థలకి ఉంది? ముస్లిములకు కాదు. **పాకిస్తాన్ జెండా ఎగురువేయడానికి ప్రయత్నించింది ఎవరు?** ఆ జెండాపై ప్రేమతో దానిని మోసిందెవరు? ముస్లిములు కాదు.

కేవలం కొన్ని రూపాయలకే మనిషిని హత్య చేసేవారున్నారనేది తెలిసిన విషయమే! ఆ హంతకులకు మరియు మతానికి సంబంధం లేదు. బేబీ వైష్ణవిని కొలిమిలో వేసి కాల్చేసారు. కాల్చినవారు ముస్లిములు కాదు. ఆ విధంగా చేయమని డబ్బు ఇచ్చిన వ్యక్తి ముస్లిమ్ కాడు. వీరు చేసింది డబ్బు కోసం. రాజకీయ లాభం కోసం ఏదైనా చేయిస్తారు. ఆ విధంగా డబ్బుకోసం హత్యలు చేసే వారెవరికైనా ముస్లిమ్ పేరుంటే, అతనికి ఇస్లామ్‌కి ముడిపెట్టడం అనాగరికం.

ఒక ఛానల్ వారైతే, తిరుపతి కొండపై అన్యమత ప్రచారం జరుగుతుందని ఒకరోజు రాత్రి వేళ ఫ్లాష్ న్యూస్ ప్రసారం చేశారు. క్లోజప్‌లో అస్పష్టంగా చూపించి ఏదో వాల్‌పోస్టర్ అంటించినట్లు అనుమానం కలిగేటట్లుగా ప్రసారం చేశారు. అది ఒక సి.డి. మాత్రమే. కొందరు ఒరిస్సా కుర్రాళ్ళు బ్రతుకు తెరువు కోసం ఓ హెూటల్‌లో పనిచేసుకుంటున్నారు. వారి దగ్గర ఖవ్వాలీ వంటి పాటల సి.డి. ఉంది. తరువాత వారి దగ్గర మారణాయుధాలు ఉన్నాయన్నారు. కొబ్బరి బొండాలు కొట్టే కత్తి అది. పోలీసులు దర్యాప్తు చేసి అసలు నిజం చెప్పారు. ఆ కుర్రాళ్ళు అన్యమత ప్రచారం చేయలేదు. వారు తీవ్రవాదులూ కాదు. న్యూస్ ప్రసారం చేస్తూ ఆ రాత్రి యాంకర్‌గారు బి.జె.పి. నాయకునికి ఫోన్ చేసి 'మీరేమి చేయబోతున్నారు?' అని అతనిని రెచ్చగొడుతూ అడిగారు. అడగవలసింది ఎవరిని? అడుగుతున్నది ఎవరిని? ఇది మత విద్వేషాన్ని రగిలించడానికి చేసే అనైతిక ప్రయత్నమే.

ఇటువంటి వారు మత సామరస్యాన్ని పాడుచేయడానికి చాలా పాటుపడుతున్నారు.

అక్బరుద్దీన్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి కేసులు పెట్టారు. ఓ.కె. అయితే తొగాడియా విషయంలో చర్య ఏమీ లేదు. సెక్యులరిజమ్ మనదేశంలో ఉందా? అనే అనుమానం కలుగుతుంది. ఇది మన వ్యవస్థకు చాలా ప్రమాదకరం.

ముస్లిమ్ యువకులను అనుమానంతో అరెస్ట్ చేసి ఓ రెండు సంవత్సరాలు జైలులో ఉంచి ఆ తరువాత అమాయకులని వదిలేస్తే, వారిపై పడిన మచ్చ సంగతి ఏమిటి? వారిని మానసికంగా హత్య చేస్తున్నారు. ఎవరినైనా దర్యాప్తు సంస్థ ప్రశ్నించడానికి పిలిచినప్పుడు, అతడు దోషి అని నిర్ధారణ అయితే అప్పుడు పబ్లిక్‌కి తెలియజేస్తే అర్థముంటుంది. కాని ముందే ప్రచురించడం వలన, అమాయకులకు కోలుకోని దెబ్బ తగులుతుంది.

'ఇదేం సెక్యులరిజం?' అంటూ అసదుద్దీన్ రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడారు. ఎన్.ఐ.ఏ. వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో డి.ఆర్.డి.ఓ. శాస్త్రవేత్త అజాద్ అహ్మద్ మీర్జాను 6.3.13 తేదీన విడుదల చేశారని, అయితే ఆయన కాంట్రాక్టును డి.ఆర్.డి.ఓ. రద్దు చేసిందని, శాస్త్రవేత్తగా ఆయనకు రెండేళ్ళు కాంట్రాక్టు ఉంది. దాని రద్దుకు కారణం ఏమిటి? మా సామాజిక వర్గంలో శాస్త్రవేత్తలు అతి తక్కువ. ఆయన్ను తప్పుడు కేసులో ఇరికించారు. ఎన్.ఐ.ఏ. విడుదల చేసింది. డి.ఆర్.డి.ఓ. కాంట్రాక్టు రద్దు చేసింది. అసలు ఈ ప్రభుత్వం ఆచరిస్తున్న సెక్యులరిజం ఎలాంటిదో నేను తెలుసు కోవాలనుకుంటున్నా. కర్నల్ పురోహిత్ నాలుగేళ్ళుగా మహారాష్ట్ర జైల్లో ఉన్నారు. ఆయనకు నాలుగేళ్ళుగా ఇదే రక్షణశాఖ జీతమిస్తోంది.'' (సాక్షి, తేది. 07.03.13, పేజి.2)

సుప్రీమ్ కోర్టు మాజీ న్యాయమూర్తి మరియు ప్రెస్ కౌన్సిల్ చైర్మన్ మార్కండేయ కాట్జు గారు పైన పేర్కొన్న సైంటిస్ట్ కేసు విషయాన్ని గౌరవ కర్నాటక ముఖ్యమంత్రి గారికి మరియు గౌరవ కేంద్ర రక్షణ శాఖ మంత్రివర్యులు ఎ.కె.ఆంటోనీ గారిని అడిగారు. ఆయనను తిరిగి చేర్చుకోవాలని, వేదనకు మరియు అమర్యాదకు లోనైనందుకు కేంద్ర / రాష్ట్ర ప్రభుత్వాలు బహిరంగ క్షమాపణ చెప్పాలని, సరియైన విధంగా పరిహారం కూడా ఇవ్వాలని అన్నారు. (ద హిందూ, 09.03.13, పేజి. 13)

నేషనల్ కమీషన్ ఫర్ మైనారిటీస్ (NCM) చైర్మన్ వజహత్ హబీబుల్లాహ్, ప్రెస్ కౌన్సిల్ చైర్మన్ గారికి లేఖ వ్రాశారు. దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ళకు సంబంధించి మీడియా ఒక కమ్యూనిటీని లక్ష్యంగా చేసుకుందని. మాజీ ఇంటెలిజెన్స్ అధికారి మరియు సెక్యూరిటీ ఎనలిస్ట్ బి. రామన్ గారి వ్యాసాన్ని ఆయన రిఫర్ చేసారు. "ఇది ఒక ట్రెండ్‌గా మారిపోయినట్లుగా కనిపిస్తుంది. టెర్రర్ అయితే అది ముస్లిమ్ అయివుండాలి. అతడు ముస్లిమ్ అయితే అతడు ఇండియన్ ముజాహిదీన్ నుండి అయివుండాలి. అది ఇండియన్ ముజాహిదీన్ అయితే పాకిస్తాన్ ఐ.ఎస్.ఐ. అవసరానికి చేసింది.'' ఇటువంటి ట్రెండ్‌ని ప్రోత్సహించ కూడదని NCM చైర్మన్ చెప్పారు.

కాట్జుగారు ఆ లేఖలోని అంశాలతో ఏకీభవించారు. ముస్లిములలో చాలామంది టెర్రరిస్టులు అనే ముద్ర వేయడంతో, పోలీసులు తరచుగా కొందరు ముస్లిములను కేవలం అనుమానంతో అరెస్ట్ చేస్తున్నారని. ఒకసారి అటువంటి ముస్లిమ్ అరెస్ట్ అయితే, అతనికి బెయిల్ దొరకడం కష్టం. ఒకవేళ అతడు చివరకు అమాయకుడు అని తేలినా, ఎన్నో సంవత్సరాల అతని జైలు జీవితాన్ని ఎవరూ తిరిగి ఇవ్వలేరు. ఎన్నో తప్పుడు కేసులు ముస్లిములపై బనాయించబడ్డాయని అన్నారు.

బ్లాస్ట్ జరిగిన కాస్సేపటికే ముస్లిములను టార్గెట్ చేస్తూ విద్వేషాలు కలిగే విధంగా ఎలక్ట్రానిక్ ఛానళ్ళు ప్రసారం చేయడాన్ని కాట్జుగారు బాధ్యతారాహిత్యంగా చెప్పారు. (ద హిందూ, 07.03.13, పేజి 13 'Stop targeting Muslims for blasts, Katju tells media)

26 సంవత్సరాల జర్నలిస్ట్ ముతి-ఉర్-రహ్మాన్ సిద్దీఖీని బెంగుళూరు క్రైమ్ బ్రాంచి పోలీసులు మరో 14 మందితో సహా అరెస్ట్ చేశారు. ఆగష్టు

2012లో ప్రముఖ హిందుత్వ నాయకులను మరియు కొందరు జర్నలిస్ట్‌లను హత్య చేయడానికి కుట్ర పన్నారని ఆరోపించారు. ఎన్.ఐ.ఏ. విచారణ చేపట్టింది. మరియు అతనిని నిర్దోషిగా వదిలి పెట్టింది. (ద హిందూ, 27.02.13, పేజీ.15)

పోలీసులు నలుగురిని దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ళ కేసు విషయమై ఇంటరాగేషన్ కోసం తీసుకెళ్ళారు. ఆ నలుగురు 2007లో స్వామి అసీమానంద చేయించిన మక్కా మస్జిద్ పేలుళ్ల కేసులో నిందితులు. తరువాత నిర్దోషులుగా విడుదలయ్యారు. వారికి ఆర్థికంగా పరిహారాన్ని ఇవ్వమని నేషనల్ కమీషన్ ఫర్ మైనారిటీస్ రికమెండ్ చేసారు కూడా.

సోమాలి జాతీయుడిని మరియు అతని ఫ్రెండ్‌కి పేలుళ్ళతో సంబంధం లేదని ఎన్.ఐ.ఏ. తేల్చి చెప్పింది. ఎన్.ఐ.ఏ. చాలా తొందరగానే చెప్పింది. కాని అప్పటికే అతని గురించి ఇంటర్‌నెట్‌లో వార్త పాకిపోయింది మరియు జరగవలసిన నష్టం జరిగిపోయింది.

హైదరాబాద్ న్యాయవాది రహ్మాన్ మహాజిర్ హైదరాబాద్ పోలీస్ కమీషనర్‌గారికి బహిరంగ లేఖ వ్రాశారు. పోలీస్ వర్గాలు చెప్పాయని ప్రాంతీయ న్యూస్‌పేపర్లు నిగూఢమైన ప్రయోజనంతో రిపోర్టింగ్ ఎందుకు చేస్తున్నాయి? ఎవరు కారకులో ఆధారాలు లేవని స్వయంగా ఆయనే చెబుతున్నప్పటికీ. ఒక వ్యక్తి పేరును అనుమానిస్తున్నారని అంటే చాలు ఆ అనుమానితునికి మరియు ఆ కుటుంబాన్ని గాయం చేయడానికి. (ద హిందూ, 27.02.13, పేజీ. 15) ఇది మీడియా ఉగ్రవాదం కాదా?

ఇటీవల ఒక తెలుగు పత్రికలో ఓ విద్యావేత్తగారు వ్రాసిన వ్యాసం ప్రచురించబడింది. దానిలో ఆయన ఓ విషయాన్ని చెప్పారు. ఓ పదేళ్ళ పాప ఆ పేలుళ్లకి కారణం, అఫ్జల్‌గురుని ఉరితీసినందుకు ప్రతీకారం అని ఠక్కున సమాధానం చెప్పిందట. ఒక పాపకే ఇంత ఆలోచన ఉంటే, యంత్రాంగం ఎలా ఉండాలని సదరు విద్యావేత్తగారు అభిప్రాయపడ్డారు. కాని ఒక చిన్నారి మనస్సులో ఎంతటి విషాన్ని నింపుతున్నారో అర్థం చేసుకోవాలి.

పేలుళ్లు పాకిస్తాన్ కుట్రేనని విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి గారు పేలుళ్లు జరిగిన మూడో రోజు ఆరోపించారు. పాకిస్తాన్ పనే అని ఎందుకు అనుకున్నారు? ఇంతకు పూర్వం జరిగిన బ్లాస్ట్‌లకు ఒక స్వామిజీగారు, ఒక సాధ్విగారు, ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తలకు లింక్ ఉంది కాబట్టి, ఎవరైనా ఓ స్వామిజీగారే ఇది చేయించి ఉండవచ్చని అనుమాన పడవచ్చు కదా!

ఈ స్వామిజీ గారు అనుమానపడినట్లే పాకిస్తాన్ ప్రమేయం ఉందని బీజేపీ అగ్రనేత అద్వానీ గారు కూడా ఆరోపించారు.

**22వ తేదీ నుండి 27వ తేదీ వరకూ పేపర్లలో వచ్చిన కొన్ని పతాక శీర్షికలు :**


| | | | |
|---|---|---|---|
| 22.02.13 | The Hindu | Pg.6 | Let's not name any outfit : Shinde |
| | సాక్షి | పేజీ.1 | దిల్‌సుఖ్‌నగర్‌లో జంట పేలుళ్లు - ఇండియన్ ముజాహిదీన్ ఘాతుకం |
| 23.02.13 | The Hindu | Pg.1 | Too early to blame anyone : Shinde |
| 24.02.13 | The Hindu | Pg.1 | 15 Crack teams to probe blasts |
| | సాక్షి | పేజీ. 2 | ఐ.ఎమ్. మాస్టర్ మైండ్ రియాజ్ |
| 27.02.13 | సాక్షి | పేజీ.1 | యాసిన్ భత్కల్ పనే! దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ళలో స్వయంగా పాల్గొన్నాడు.<br>ఎన్.ఐ.ఏ. దర్యాప్తులో నిర్ధారణ - హోం మంత్రిత్వ శాఖకు వెల్లడి.<br>107 బస్టాప్ వద్ద సైకిల్ బాంబు పెట్టింది అతడే! |

రాజకీయ లబ్ది కోసమో లేక మరే ప్రయోజనాన్ని ఆశించో, ముస్లిములను తీవ్రవాదులుగా చిత్రీకరిస్తున్నారు. ముస్లిములను లక్ష్యంగా చేసుకుని మీడియా అబద్ధపు వ్రాతలు వ్రాసి ఎవరికి మేలు చేస్తుంది? మన దేశానికా? లేక తీవ్రవాదులకా? నింద ముస్లిములపై వేసి తీవ్రవాదులను తప్పించి దేశానికి నష్టం కలిగించాలని మీడియా కోరుతుందని భావించాలా?

ఈ రోజు ఎవరో కొందరు అమాయకులు బలైపోవడం చూసి ఊరుకుంటే, రేపు అదే స్థానంలో మీరుండవచ్చు. లేక మీ సన్నిహితులుండవచ్చు. దోషులను కఠినంగా శిక్షించాలి. కాని అమాయకులకు అన్యాయం జరిగితే, వారికి న్యాయం జరిగేలా మన ప్రయత్నం మనం చేయాలి.

న్యాయపరమైన పరిష్కారానికై నాయకులు ఇప్పటికైనా ప్రయత్నించాలి. ముస్లిములను లక్ష్యంగా చేసుకుని మీడియా బరితెగించినప్పుడు, వివిధ జమాత్‌ల నాయకులు నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుంటే ఎలా? ఇంకా ఎంతకాలం నిద్ర నటిస్తారు? అల్లాహ్‌కు ఏమి సమాధానమిస్తారు?

ముస్లిముల ఆయుధం - సహనం. విశ్వాసంతో అల్లాహ్‌ను వేడుకుంటే, ఇన్షా అల్లాహ్ ఈ అపనిందల నుండి కుట్రల నుండి రక్షణ లభిస్తుంది. సహనం వహించండి. - **శాంతిబాట టీమ్**



# అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

28

## ఖుర్'ఆన్ తఫ్సీర్

**2. సూరహ్ అల్-బఖరా**

البقرة

( గత సంచిక తరువాయి )

### 57వ ఆయత్ నుండి 59వ ఆయత్ వరకూ

**మరియు మేము మీపై మేఘాల ఛాయను కల్పించాము మరియు మన్న మరియు సల్వాలను మీ కొరకు ఆహారంగా దించాము. 'మేము మీకు ప్రసాదించిన శుద్ధమైన వస్తువులను తినండి' అని అన్నాము. (కాని మా ఆజ్ఞలను ఉల్లంఘించారు), అయినా వారు మాకు అపకారమేమీ చేయలేదు, పైగా వారు తమకు తామే అపకారం చేసుకున్నారు. (2:57)**

పై ఘటనలు 'తీహ్' ఎడారిలో సంభవించినట్లు తఫ్సీర్ గ్రంథాలలో ప్రస్తావించబడింది. ఇస్రాయీల్ సంతానం సిరియాకు చెందినది. కాని యూసుఫ్(అ)వారి కాలంలో వారు ఈజిప్టుకు వెళ్ళిపోవలసి వచ్చింది. మరియు వారక్కడే స్థిరపడ్డారు. అయితే సిరియా అమాలిఖహ్ ప్రజల అధికారంలోకి వచ్చింది.

ఫిర్'ఔన్ సముద్రంలో ముంచివేయబడిన తరువాత, ఇస్రాయీల్ సంతానం ప్రశాంతంగా జీవించవచ్చు. అమాలిఖహ్ ప్రజలతో యుద్ధం చేసి తిరిగి తమ మాతృభూమిని స్వాధీనం చేసుకోవడానికి వెళ్ళమని అల్లాహుతాలా వారిని ఆదేశించారు.

ఇస్రాయీలీయులు యుద్ధానికి బయలుదేరారు కాని సిరియాను సమీపిస్తూ, శతృవుల సైనిక శక్తిని తెలుసుకున్న తరువాత, వారి ధైర్యం సన్నగిల్లింది. మరియు వారు ధర్మ పోరాటంలో పాల్గొనడానికి నిరాకరించారు.

వారు చూపిన అవిధేయతకు అల్లాహ్ వారిని శిక్షించారు. కాబట్టి పూర్తి నలభై సంవత్సరాలు వారు ఎడారిలో సంచరిస్తూనే ఉన్నారు. మరియు వారు ఈజిప్టుకి సైతం వెనక్కి వెళ్ళలేకపోయారు. ఆ ఎడారి కూడా బాగా విశాలమైనదేమీ కాదు. కేవలం ఓ పదిమైళ్ళ పొడవు ఉంటుంది. అది ఈజిప్టు మరియు సిరియా దేశాల మధ్యలో ఉంది.

వారు ఈజిప్టువైపు ఒక రోజంతా కవాతు చేసి మరియు రాత్రి విడిది చేయడానికి ఒక చోట ఆగేవారు. కాని ఉదయం వారు లేచేసరికి, వారు తాము ఎక్కడినుండి బయలు దేరారో తిరిగి అక్కడే ఉన్నట్లు తెలుసు కునేవారు.

ఆ విధంగా వారు 40 సంవత్సరాలపాటు అల్పమైన ఉద్రేకం మరియు విసుగుతో ఎడారిలో తిరుగుతూనే ఉన్నారు. అందుకే ఆ ఎడారిని తీహ్ అన్నారు. అది ఒకరు దారి తప్పి పోవడమనే అర్థాన్నిస్తుంది.

ఆ ఎడారి కేవలం ఓ ఖాళీ ప్రదేశం. వేడి నుండి గాని చలి నుండి గాని కాపాడటానికి అందులో ఒక చెట్టుకాని లేదా ఒక ఇల్లుగాని లేదు. తినడానికి ఆహారం లేదు.

**తెల్లటి మరియు చల్లటి మేఘాలు :**

అయితే మూసా(అ)వారి ప్రార్థనను స్వీకరించి, అల్లాహుతాలా వారి అవసరాల కొరకు అద్భుతమైనవి అనుగ్రహించారు. వారు సూర్యుని వేడిమికి తట్టుకోలేనప్పుడు, అల్లాహ్ వారి కొరకు పలుచని తెల్లని మేఘం యొక్క నీడను పంపారు.

వారు ఆకలికి గురైనప్పుడు అల్లాహుతాలా వారికి మన్న్ (మన్న) సల్వాను అనుగ్రహించారు.

ఇస్రాయీల్ సంతానాన్ని అల్లాహుతాలా ఏయే ఉపద్రవాల నుండి రక్షించారో, వాటిని ముందరి ఆయత్‌లలో ప్రస్తావించిన తరువాత, ఆయన వారిపై కురిపించిన అనుగ్రహాలను ఇక్కడ ప్రస్తావించారు.

**"మరియు మేము మీపై మేఘాల ఛాయను కల్పించాము"**

ఇబ్నె అబ్బాస్(రజి)వారి ఉల్లేఖనాన్ని నసాయీ(ర), అల్-కుబ్రా (6:405)లో గ్రంథస్థం చేశారు. దానిని బట్టి 'అల్లాహ్ ఇస్రాయీల్

సంతానానికి వారు ఎడారిలో సంచారంలో ఉన్న కాలంలో మేఘాలతో నీడను ఒసంగారు''

ఇటువంటి వ్యాఖ్యానాన్నే ఇబ్నె ఉమర్, అర్-రబీ బిన్ అనస్, అబూ మిజ్‌లాజ్, అద్-దహ్హాక్ మరియు అస్-సుద్ది చేసినట్లు ఇబ్నె అబీ హాతిమ్ చెప్పారు. అల్-హసన్ మరియు ఖతాదహ్ చెప్పారు : **"ఇది వారు ఎడారిలో ఉన్నప్పుడు సంభవించింది మరియు మేఘాలు సూర్యుని నుండి వారికి నీడ నిచ్చాయి."**

ఇబ్నె జరీర్‌గారు చెప్పిన దానిని బట్టి ఎందరో విద్వాంసులు, ఈ ఆయత్‌లో ప్రస్తావించబడిన మేఘం '**చల్లగానూ మరియు ఈనాడు మనకు తెలిసిన దానికంటే మేలైన రకం**' అని చెప్పారు.

**"మరియు మన్న మరియు సల్వాలను మీ కొరకు దించాము."**

**మన్న**

పై విషయంపై ఖతాదహ్ ఇలా వ్యాఖ్యానించారు :

**"మన్న పాల కంటే తెల్లగా మరియు తేనె కంటే తీయగా ఉండేది. మంచు కురిసినట్లు వారిపై కురుస్తూ ఉండేది. వారిలో ఒకరు ఆ రోజుకి సరిపడా సేకరించేవారు. ఎందుకంటే అంతకంటే ఎక్కవ కాలం ఉంటే, అది పాడై పోయేది. ఆరవరోజు, అంటే శుక్రవారం, ఆరవ రోజు మరియు 7వ రోజు కోసం సేకరించేవారు. ఏడవరోజు సబ్బత్ ఆ రోజు  జీవనోపాధి కోసం లేక మరేదాని కోసమైనా వారు ఇళ్ళు వదిలి వెళ్ళకూడదు. ఇదంతా సంభవించింది ఎడారిలో."**

ప్రాత:కాలం నుండి సూర్యుడు ఉదయించే వరకూ మన్న పడుతూనే ఉండేది.

కేవలం ఈ 'మన్న' ఒక్కటే తింటే సరిపోతుంది. అది మధురమైనది మరియు పోషక విలువలు కలిగున్నది. ఈ సందర్భానికి సరిపోతుందని ఓ హదీస్‌ను దిగువన ఇస్తున్నాము.

స'ఈద్ బిన్ జైద్(రజి)వారి ఉల్లేఖనం. నేను విన్నాను ప్రవక్త(స) వారు చెప్పగా, **అల్ కమ్'అత్** (పుట్టగొడుగులు) **మన్న వంటివి మరియు దాని నీరు కంటి వ్యాధులను నయం చేస్తుంది. (సహీహ్ బుఖారీ, 5708, పుస్తకం 76, అధ్యా.20, సంపుటి 7)**

**సల్వా**

ఇక సల్వా విషయానికొస్తే, అలీ బిన్ అబీ తల్హా ఉల్లేఖించారు, ఇబ్నె అబ్బాస్(రజి) చెప్పారు:

**"అది ఒక పక్షి, చూడటానికి కౌజు పిట్టలా ఉంటుంది".**

ఇక్రిమా చెప్పారు :

**'సల్వా' పిచ్చుక పరిమాణంలో ఉండే స్వర్గలోక పక్షి.'**

ఖతాదహ్ చెప్పారు, 'సల్వా పిచ్చుకలా ఉండే పక్షి.'

సల్వా కూడా మన్న వలే రోజుకి సరిపడినంత పట్టుకోవచ్చు. నిల్వ చేస్తే ఇది కూడా పాడవుతుంది.

**"మేము మీకు ప్రసాదించిన శుద్ధమైన వస్తువులను తినండి."**

అల్లాహ్ వారిని ఆదేశించారు వారికి ఎంత అవసరమైతే అంత తీసుకోమని మరియు భవిష్యత్తులో ఉపయోగించు కోవడానికి నిల్వ ఉంచవద్దని. కాని వారు ఆ ఆదేశాన్ని పాటించలేదు. ఆ మాంసం కుళ్ళిపోవడం మొదలైంది. ఆ విధంగా వారు తమకు తాము అపకారం చేసుకున్నారు. అల్లాహ్‌కు కాదు.

ఇబ్నె కసీర్‌గారు తన తఫ్సీర్ గ్రంథంలో ఈ సందర్భంగా ముహమ్మద్(స)వారి అనుచరులను ఇతర ప్రవక్తల అనుచరులతో పోల్చారు.

ధర్మంలో స్థిరత్వం, సహనం మరియు అణుకువ మన సహాబాల లక్షణాలు.

ముహమ్మద్(స)వారితో అనుచరులు ఎన్నో యుద్ధాలలో పాల్గొన్నారు, వాటిలో ఒకటి తబూక్ దండయాత్ర. అది ఎన్నో కష్టాల మధ్య కరువు కాలంలో సంభవించింది. అయినా సరే సహాబాలు ముహమ్మద్(స)వారిని ఏ అద్భుతం కోసమూ అడగలేదు. ముహమ్మద్(స)వారు అల్లాహ్‌ను కోరివుంటే అది సులభంగా జరిగేది.

కాని అనుచరులు ఆకలితో ఉన్నప్పుడు, కేవలం వారు ముహమ్మద్(స)వారితో తమ దగ్గరున్న ఆహారాన్ని అధికం అయ్యే విధంగా దు'ఆ చేయమని కోరారు. మన్న, సల్వాలను కోరలేదు. వారు తమ దగ్గర మిగిలి ఉన్న కొద్ది పరిమాణంలోని ఆహారాన్ని సేకరించి ప్రవక్త(స) దగ్గరకు తీసుకు వచ్చారు. దానిని అనుగ్రహించమని అల్లాహుతాలాను ముహమ్మద్(స) వారు ప్రార్థించారు. వారంతా తమ పాత్రలలో ఆహారాన్ని నింపుకో గలిగారు.

ఒక అవసరంలో ముహమ్మద్(స)వారు వర్షాన్ని దింపమని అల్లాహుతాలాను వేడుకున్నారు. మేఘం వర్షాన్ని తీసుకువచ్చింది వారు త్రాగారు, ఒంటెలకు త్రాపించారు మరియు తమ నీటితిత్తులను నింపుకున్నారు.

వారు చుట్టూ చూసినప్పుడు, ఆ మేఘం తాము విడిది చేసిన చోట మాత్రమే వర్షాన్ని కురిపింప జేసిందని తెలుసుకున్నారు.

అల్లాహ్ ఏ ఆదేశాన్నిస్తే దానికి విధేయత చూపి పాటించారు సహాబాలు మరియు తమ ప్రవక్త, ముహమ్మద్(స)వారిని ఎల్లప్పుడూ అనుసరించే వారు. మూసా(అ)వారి అనుచరుల వలే, నిర్లక్ష్య ధోరణిలో ఎన్నడూ ప్రవర్తించ లేదు.

**మరియు మేము మీతో : "ఈ నగరం (జెరూసలెం)లో ప్రవేశించండి. మరియు అక్కడున్న వస్తువులను మీ ఇష్టానుసారంగా కావలిసినంత తినండి మరియు నగర ద్వారంలోకి సజ్దా చేస్తూ (సుజ్జదాన్ -**

**వినమ్రులై తలవంచుతూ). 'హిత్తతున్'** (మమ్మల్ని క్షమించు) **అంటూ ప్రవేశించండి, మేము మీ పాపాలను క్షమిస్తాము. మరియు మేము సజ్జనులను అత్యధికంగా కరుణిస్తాము." అని చెప్పిన** (మాటలను జ్ఞప్తికి తెచ్చుకోండి)!" **(2:58)**

పై ఆయత్‌పై సహాబాలు మరియు విద్వాంసులు ఇచ్చిన వివరణలు చూద్దాం.

కొందరు విద్వాంసులు పై ఆయత్‌లో ప్రస్తావించబడిన పవిత్ర భూమి అరిహా అని అభిప్రాయపడ్డారు. ఇబ్నె అబ్బాస్(రజి) మరియు అబ్దుర్రహ్మాన్ బిన్ జైద్ ఈ అభిప్రాయాన్నే వెలిబుచ్చారు.

40 సంవత్సరాలపాటు సంచారం చేయడం పూర్తియైన తరువాత యూష' బిన్ నూన్ నాయకత్వంలో శుక్రవారం పవిత్ర భూమిని జయించడానికి అల్లాహ్ అనుమతించారు. వారు ఆ భూభాగాన్ని జయించిన తరువాత సజ్దా చేస్తూ (వినమ్రులై తలవంచుతూ) ద్వారంలోకి ప్రవేశించమని వారిని ఆదేశించారు. కారణం వారు 40 సంవత్సరాల పాటు తిరుగుతూనే ఉన్నారు, తరువాత విజయం సాధించి తమ భూభాగానికి తిరిగి చేరుకున్నారు.

అల్లాహ్‌ను కీర్తిస్తూ, కృతజ్ఞతతో వారు అల్లాహ్ ఆదేశాన్ని పాటించ వలసి ఉంది.

"మరియు నగర ద్వారంలోనికి సజ్దా చేస్తూ ప్రవేశించండి" అంటే 'తలవంచుతూ' అని ఇబ్నె అబ్బాస్(రజి)వారు వ్యాఖ్యానించారని అల్-అవ్ఫి చెప్పారు.

ఇబ్నె జరీర్ ఇదే విషయంపై ఇబ్నె అబ్బాస్(రజి)వారు చెప్పిన దానిని వివరించారు. **"ఓ చిన్న ద్వారం గుండా తలవంచుతూ"**. కాని వారు ఆ ద్వారాన్ని వెనుక నుండి ప్రవేశించారు.

అల్-హసన్ అల్-బస్రీ చెప్పారు, "వారు నగరంలోనికి ప్రవేశించి నప్పుడు తన ముఖాలతో సజ్దా చేయమని ఆదేశించబడ్డారు." అర్రాజి చెప్పారు, ఇక్కడ ప్రస్తావించబడిన 'సుజుద్' అనే పదానికి అర్థం, 'విధేయత'. ఎందుకంటే సజ్దా చేస్తూ ప్రవేశించడం సాధ్యం కాదు కనుక. ఇబ్నె అబ్బాస్(రజి)వారు చెప్పారు, **"ఇక్కడ ప్రస్తావించబడిన ద్వారం - ఖిబ్లాకు అభిముఖంగా ఉండేది"**

ముజాహిద్, అస్-సుద్ది, ఖతాదహ్ మరియు అద్-దహ్హాక్ చెప్పారు, **ఆ ద్వారం 'హిత్తా' ద్వారం. ఇయ్లా లోనిది.** అది జెరూసలెమ్.

అర్రాజి మరియు మరికొందరు చెప్పారు, **ఆ ద్వారం ఖిబ్లా దిశలో ఉంది అని.** అబ్దుల్లాహ్ బిన్ మస్'ఊద్(రజి)వారు చెప్పారు, "వారు ఇలా ఆదేశించబడ్డారు, 'ప్రవేశించండి ద్వారాన్ని వినమ్రులై తల వంచుతూ', కాని బదులుగా వారు తమ తలలను పైకెత్తి విధేయత చూపకుండా ప్రవేశించారు."

ఆ తరువాత అల్లాహ్ చెప్పారు, **"మరియు చెప్పండి : హిత్తతున్"**

ఇబ్నె అబ్బాస్(రజి)వారు దీనిపై ఇలా వ్యాఖ్యానించారు, **"క్షమించమని అల్లాహ్‌ను వేడుకుంటూ"** అల్ హసన్ మరియు ఖతాదహ్ చెప్పారు దీని అర్థం, "చెప్పండి : మా పాపాల నుండి మమ్మల్ని విముక్తి చేయండి" అని.

**"మేము మీ పాపాలను క్షమిస్తాము. మరియు మేము సజ్జనులను అత్యధికంగా కరుణిస్తాము."**

అల్లాహ్ యొక్క ఆదేశాన్ని పాటిస్తే వారిని క్షమించడమే కాకుండా వారు చేసే మంచి పనులకు అత్యధికంగా కరుణిస్తానని అల్లాహ్ చెబుతున్నారు.

**అల్-ముహ్‌సినీన్** అనే అరబీ పదానికి తెలుగులో **'సజ్జనులు'**గా (అంటే మంచి పనులు చేసేవారిగా) పై తెలుగు అనువాదంలో చెప్పడం జరిగింది. ముహ్‌సినీన్ అంటే **'ఇహ్‌సాన్'**ను కలిగి ఉన్నవారు. ఇహ్‌సాన్ అంటే ఒక పనిని చక్కగా చేయడం - దానికి తగిన విధానంలో. ఇది భాషా పరమైన అర్థం. దీని యొక్క సాంకేతిక అర్థం సహీహ్ ముస్లిమ్ గ్రంథం తొలి హదీస్‌లో వివరించబడింది.

జిబ్రీల్(అ)వారు మానవ రూపంలో వచ్చి ముహమ్మద్(స)వారిని కొన్నింటి గురించి ప్రశ్నించారు. వాటిలో ఒకటి - **'ఇహ్‌సాన్' అంటే ఏమిటి?**

"అది అల్లాహ్‌ను ప్రార్థించడం నీవు ఆయనను చూడగలుగు తున్నట్లుగా, నీవు ఆయనను చూడలేక పోయినప్పటికీ, వాస్తవానికి ఆయన నిన్ను చూస్తున్నారు."

దీనిని బట్టి ముహ్‌సినీన్ అంటే అల్లాహ్ తాను చేసేపనిని చూస్తున్నారనే స్పృహతో మంచి ఆచరణ చేసేవారు అని.

ఫిర్'ఔన్ పాలనలో బానిసలుగా బ్రతికిన ఇస్రాయీల్ సంతానం, అల్లాహ్ కారుణ్యంతో సముద్రం రెండుగా చీలడం వలన, ఫిర్'ఔన్ నుండి రక్షింపబడి స్వేచ్ఛ పొందారు. కృతజ్ఞత చూపడానికి బదులు, ఆవుదూడను ఆరాధించి ఘోరపాపమైన షిర్క్ చేశారు. షిర్క్‌కు శిక్ష అనుభవించారు. తన మాతృభూమిని స్వాధీనపరుచుకోమని ఆదేశిస్తే, తిరస్కరించారు. ఫలితంగా 40 సంవత్సరాలు సంచారంలో గడిపారు. తిరిగి వారిని క్షమించి, వారికి విజయం ప్రసాదించి, కృతజ్ఞత చూపుతూ అణుకువతో తలవంచుతూ ఖిబ్లాకు అభిముఖంగా ఉన్న చిన్న ద్వారం గుండా అల్లాహ్‌ను క్షమాపణ వేడుకుంటూ నగరంలోకి ప్రవేశించమంటే మరలా అవిధేయతే చూపారు. ఎంతటి కృతఘ్నులు వీరు.

ఈ సందర్భంగా పాఠకులు ఒక విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. దాదాపు 20 సంవత్సరాల పాటు శతృవుల ఆగడాలను భరిస్తూ, చివరికి అల్లాహ్ కారుణ్యంతో మక్కాను స్వాధీనం చేసుకోవడానికి ముహమ్మద్ (స)వారు తన ప్రజలతో మక్కా ఏ విధంగా ప్రవేశించారు? ఎంతో అణుకువతో, ఒంటె మూపురం వరకూ తల వంచి అల్లాహ్‌ను కీర్తిస్తూ మక్కా నగరంలోకి ప్రవేశించారు.

ముహమ్మద్(స)వారి ఉమ్మత్ విశిష్ఠత అదే. అల్లాహ్ ఆదేశాలను అణుకువతో పాటించడం, ప్రవక్త(స)వారి మాటకు విధేయత చూపుతూ, ప్రవక్త(స)వారు ఏది ఆదేశించినా దానిని వెంటనే ఆచరణలో పెట్టడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేవారు ముస్లిమ్ ప్రజలు.

కాని నేడు ముహమ్మద్(స)వారి ఉమ్మత్గా చెప్పుకునే ముస్లిములు, - మూసా(అ)వారి ప్రజలు చూపినట్లు అల్లాహ్ ఆదేశాల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారా? లేక ఆనాటి ముస్లిములు చూపినట్లు విధేయత చూపుతున్నారా?

ప్రతీ ఒక్కరూ ఒక్కసారి ఖుర్'ఆన్ అర్థం చేసుకుంటూ చదివితే, అల్లాహ్ ఆదేశాలకు మనం ఏ స్థాయిలో అణుకువతో స్పందించడం జరుగుతుందో అర్థమౌతుంది.

ఖుర్'ఆన్లో ఇస్రాయీల్ సంతానం గురించి పై ఆయత్లలో ఎందుకు ప్రస్తావించారో ఎవరికైనా సులభంగా అర్థమౌతుంది. తప్పులను క్షమిస్తూ, అపారమైన అనుగ్రహాలను అల్లాహ్ కురిపిస్తూనే ఉంటారు. కాని విధేయత చూపకుండా, ఆయన పట్ల కృతఘ్నత చూపితే అల్లాహ్ ఆగ్రహం ఎలా ఉంటుందో మనకు తెలియజేస్తుంది ఖుర్'ఆన్.

**కాని దుర్మార్గులైన వారు, వారికి చెప్పిన మాటను మరొక మాటతో మార్చారు. కనుక, మేము దుర్మార్గం చేసిన వారిపై, వారి దౌష్ట్యాలకు ఫలితంగా, ఆకాశం నుండి ఆపదను దింపాము. (2:59)**

58వ ఆయత్కు కొనసాగింపు ఈ పై ఆయత్. 'హిత్తతున్' అనే మాటను నగరంలో ప్రవేశిస్తుండగా పదే పదే చెప్పాలని ఆదేశించారు. అంటే వారు తమ పాపాలకు పశ్చాత్తాపపడి అల్లాహ్ క్షమాపణను కోరుకోవడం. కాని వారు వెక్కిరింపుగా ఆ పదానికి బదులు మరో పదం 'హబ్బతున్ ఫీ ష'ఈరహ్.' (బార్లీ మధ్యలో ఉండే గింజ లేక విత్తనం) అని పలుకుతూ తమ పిరుదులపై జారుతూ నగరంలోకి ప్రవేశించారు. వివరణకై క్రింది హదీస్ చూడండి.

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) చెప్పారు, అల్లాహ్ చెప్పిన (**మరియు నగర ద్వారంలోకి సజ్దా చేస్తూ ప్రవేశించండి**)కి సంబంధించి "వారు పిరుదులపై జారుతూ ప్రవేశించారు" అర్థాన్ని వక్రీకరించారు, మరియు ఇదే సనద్తో ప్రవక్త(స) వారి నుండి. **"కాని దుర్మార్గులైన వారు, వారికి చెప్పిన మాటను మరొక మాటతో మార్చారు"** - "వారు అన్నారు : హబ్బతున్ (విత్తనం) ష'ఈరహ్ (బార్లీ)లో" **(తిర్మిజీ, సహీహ్, 2956, పుస్తకం 44, అధ్యా.2, సంపుటి 5)**

**వారు చేసిన పనికి శిక్షగా వారిపై 'ప్లేగు' వ్యాధి దింపబడింది. దాదాపు 70వేల మంది మరణించారు.**

అల్లాహ్ పలకమని చెప్పిన మాటను కాకుండా వెక్కిరింపుగా తమ స్వంత పదాన్ని పలికిన విషయంపై మరికొన్ని వివరాలు అందించ వలసి ఉంది. అయితే స్థలాభావం వలన ఆ వివరాలను వచ్చే సంచికలో ఇన్షా అల్లాహ్ అందిస్తాము.

(మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ...)

## గుణపాఠం

సత్య తిరస్కారి అయినందుకు ఫిర్'ఔన్ తమ కళ్ళ ముందే సముద్రంలో ముంచి వేయబడ్డాడు. అతనిపై చూపిన ఆగ్రహాన్ని మరియు అతని నుండి కాపాడటం ద్వారా తమపై కురిపించిన అనుగ్రహాన్ని స్పష్టంగా గమనించారు బనీ ఇస్రాయీల్. ఆ విధంగా అల్లాహ్ ఆగ్రహాన్ని మరియు అనుగ్రహాన్ని **ఒకేసారి చూసారు**.

అల్లాహ్ ఆదేశాన్ని తిరస్కరించినందుకు 40 సంవత్సరాలు ఎడారిలో సంచరిస్తూనే ఉన్నారు. **అది శిక్ష**. అదే సమయంలో వారు ఏ పని చేయక పోయినా సరే మన్న సల్వాలను దింపి అల్లాహ్ వారి ఆకలిని తీర్చడమే కాకుండా, ఎండ నుండి రక్షించేందుకు మేఘాన్ని నీడగా పంపారు. **కలలో కూడా ఊహించ లేనటువంటి అనుగ్రహాలు ఇవి.**

అంతేకాకుండా యుద్ధంలో విజయాన్ని ప్రసాదించారు. ఆ అనుగ్రహానికి కూడా కృతజ్ఞత చూపకుండా కృతఘ్నతే చూపారు వారు.

ఇందులో మనకు ఓ గొప్ప గుణపాఠం కూడా ఉంది. సన్మార్గం వైపు ఎవరినైనా మనం ఆహ్వానించడానికి, బనీ ఇస్రాయీల్కు చూపినటువంటి అద్భుతాలు వంటివి వారి కళ్ళ ముందు చూపడం సాధ్యం కాదు.

అటువంటివి చూసి కూడా బనీ ఇస్రాయీల్ దుర్మార్గమే వహించారు. మరి మనం ఇతరులతో సత్యాన్ని నమ్మించేది ఎలా? నమ్మించడం మన బాధ్యత ఎంతమాత్రం కాదు.

మన బాధ్యత కేవలం సన్మార్గాన్ని అచరిస్తూ, దాని గురించి తెలపడం వరకే. హిదాయత్ కేవలం ఖుర్'ఆన్ ద్వారా అల్లాహ్యే ఇస్తారు.

**ఖుర్'ఆన్లోని సత్యాన్ని తెలపడం వరకే మన బాధ్యత**

**"నిశ్చయంగా మేము మానవులందరి కొరకు, ఈ గ్రంథాన్ని, సత్యంతో నీపై అవతరింప జేశాము. కావున సన్మార్గంపై నడిచేవాడు, తన మేలు కొరకే అలా చేస్తాడు. మరియు నిశ్చయంగా, మార్గభ్రష్టుడైనవాడు తన కీడు కొరకే మార్గభ్రష్టుడవుతాడు. మరియు నీవు వారి కొరకు బాధ్యుడవు కావు."**

(ఖుర్'ఆన్ 39:41)

**కాబట్టి ఖుర్'ఆన్ ప్రతీ రోజూ చదువుతూ అల్లాహ్ చూపిన సన్మార్గాన్ని అనుసరించుదాం, ఇన్షా అల్లాహ్!**

ప్రపంచ పాలకులు మరియు రాజకీయ నాయకులు తప్పనిసరిగా తెలుసుకోవలిసిన ముహమ్మద్(స)వారి ప్రియ అనుచరుని జీవితచరిత్ర

ప్రపంచానికి నిజమైన ప్రజాస్వామ్యాన్ని అందించిన ధర్మం - ఇస్లామ్

రెండవ ఖలీఫా

# ఉమర్ బిన్ ఖత్తాబ్

12

రజి అల్లాహుతాలా అన్హు

● అతి నిరాడంబరుడు

● ప్రపంచంలోని అతి పెద్ద భూభాగానికి నాయకుడు

అవినీతి అధికారులకు సింహస్వప్నం ●

ఓ దశాబ్దంపాటు నూటికి నూరు శాతం ప్రజాస్వామ్య పరిపాలన అందించిన ప్రజానాయకుడు

ఎటువంటి తిరుగుబాటులకు అవకాశం రానివ్వని ఉత్తమ పాలకుడు

ప్రజలకే కాకుండా మూగజీవాలకూ న్యాయం చేకూర్చిన అత్యంత దైవభీతిపరుడు

(జనవరి సంచిక తరువాయి ...)

## విశ్వాసుల మధ్య సంప్రదింపులు ...

క్రిందటి వ్యాసం చివరిలో అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారు తొలి ఖలీఫాగా ఎన్నుకోబడటం మరియు ఆయన తీసుకున్న ఓ నిర్ణయం గురించి తెలియ జేయడం జరిగింది.

ముహమ్మద్(స)వారు జీవించి యున్నప్పుడు ఏదైనా ఒక కొత్త సమస్య వస్తే, దాని పరిష్కారానికై ఆయనను అడిగి, తదనుగుణంగా ప్రజలు ఆచరించేవారు. తమ ఆచరణను అల్లాహ్ స్వీకరిస్తారనే భరోసా వారికి ఉండేది.

అయితే ముహమ్మద్(స)వారి మరణం తరువాత తొలి ఖలీఫాగా బాధ్యతను స్వీకరించిన అబూబక్ర్(రజి)వారిపై అసాధారణమైన భారం పడింది.

ఎవరికైనా ఇక్కడ ఓ ప్రశ్న ఉదయించవచ్చు. "ధర్మం పరిపూర్ణం చేయబడిందని ఖుర్'ఆన్ చెబుతుంది. మరియు అది ఖయామత్ వరకూ ఆచరణ యోగ్యమైనది కదా! అంటే అప్పటి వరకూ వచ్చే ప్రతీ సమస్యకి పరిష్కారం ఖుర్'ఆన్ మరియు సున్నత్‌లలో ఉంటుంది కాబట్టి పరిపాలనా బాధ్యత కష్టంతో కూడుకున్నది ఎలా అవుతుంది?"

అల్లాహ్ నుండి సందేశాలను అందుకునే ప్రవక్త(స)వారి పాలన తరువాత, వెనువెంటనే ప్రవక్త కాని ఓ వ్యక్తి పరిపాలన ఆరంభం అయినప్పుడు, అప్పటికి కొత్తగా ఇస్లామ్‌లో ప్రవేశించిన వారిలో మరియు సాధారణ ప్రజల ఆలోచనలో తేడా వచ్చే అవకాశం ఉంటుంది. ఇవన్నీ ఖిలాఫత్ ప్రారంభంలో వస్తాయి. ఖలీఫా వ్యవస్థకు అలవాటు పడిన తరువాత, పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే అవకాశం ఉంటుంది.

ముహమ్మద్(స)వారి సన్నిహిత అనుచరుల తఖ్వా అసాధారణ మైనది. అంతేకాకుండా అబూబక్ర్(రజి)వారు సున్నిత మనస్కులు.

అబూ బక్ర్(రజి)వారు బాధ్యతలు స్వీకరించేటప్పటి సమయం అత్యంత క్లిష్టమైనది. ఈ ఖలీఫా వ్యవస్థ ప్రారంభంలో ఆయనకు పెనుసవాళ్ళు ఎదురయ్యాయి. వాటిని ఎదుర్కొని మామూలు స్థితికి తీసుకురావడానికి అల్లాహ్ కారుణ్యంచే అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారు కనబరచిన సాహసోపేత నిర్ణయాలు ప్రశంసనీయమైనవి.

ఉసామా(రజి)వారి సైన్యాన్ని మదీనా నుండి పంపడంలో ఆయన తీసుకున్న నిర్ణయాన్ని సహాబాలు ఆమోదించారు.

తొలి ఖలీఫాగా అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారు స్థిరమైన పునాది వేశారు. ఆయన తీసుకున్న మరో అతి ముఖ్యమైన నిర్ణయం ఏమిటంటే మార్గభ్రష్టులపై పోరాటం.

ఇస్లామ్ నుండి పూర్తిగా వైదొలిగిన వారిపై మరియు ప్రవక్తలుగా ప్రకటించుకున్న అసత్యవాదుల అనుచరులపై యుద్ధం చేయడంలో అభ్యంతరం ఏమీ లేదు.

కాని జకాత్ చెల్లించడానికి నిరాకరించిన ముస్లిములపై కూడా ఖలీఫా యుద్ధాన్ని ప్రకటించారు. ఈ విషయంలో ప్రారంభంలో సహాబాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

ఈ విషయానికి సంబంధించి 'తిర్మిజీ' హదీస్ గ్రంథం నుండి ఓ హదీస్ దిగువున ఇస్తున్నాము.

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) మరణించి నప్పుడు మరియు ఆయన తరువాత అబూబక్ర్(రజి)వారు ఖలీఫా అయినప్పుడు, అరబ్బుల నుండి ఎవరైతే విశ్వసించలేదో వారు విశ్వసించ లేదు. కాబట్టి ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారు అడిగారు అబూబక్ర్(రజి)వారిని : "**మీరు ప్రజలతో ఎలా యుద్ధం చేస్తారు రసూలుల్లాహ్(స)వారు ఇలా చెప్పి ఉండగా** : 'నేను ఆదేశించబడ్డాను ప్రజలతో యుద్ధం చేయమని వారు 'లా ఇలాహ ఇల్లల్లాహ్' చెప్పేవరకూ, మరియు వారు అది చెప్పినట్లయితే, వారి ప్రాణం మరియు సంపద నా నుండి రక్షింపబడతాయి, **వారిపై ఏదైతే తప్పనిసరి అయిందో అది తప్ప.** మరియు వారి లెక్క తీసుకోవడం అల్లాహ్‌దే!' "

అప్పుడు అబూబక్ర్(రజి)వారు చెప్పారు : "అల్లాహ్ సాక్షి! నేను యుద్ధం చేస్తాను ఎవరైతే సలాత్ మరియు జకాత్ మధ్య బేధాన్ని

చూపుతారో. ఎందుకంటే వాస్తవానికి, జకాత్ అనేది ఐశ్వర్యంపై విధించ బడిన హక్కు మరియు అల్లాహ్ సాక్షి! (పూర్వం) రసూలుల్లాహ్(స)వారికి ఇస్తుండే (ఒంటె) పలుపుతాడు సయితం ఆపివుంటే, నేను వారితో యుద్ధం చేస్తాను వాటిని ఆపి ఉంచి నందుకు. కావున ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారు చెప్పారు: "అల్లాహ్ సాక్షి! నేను చూశాను అల్లాహుతాలా అబూబక్ర్(రజి) వారి హృదయాన్ని యుద్ధం వైపు తెరిచారని. మరియు **నేను తెలుసుకున్నాను అది సత్యమని."** **(తిర్మిజీ, సహీహ్, 2607, పుస్తకం 38 అబ్‌వాబుల్ ఈమాన్, అధ్యా.1, సంపుటి 5)**

ముహమ్మద్(స)వారు మరణించిన తరువాత మూడు రకాల వ్యక్తులు మదీనా తెగలలో కనిపించారు.

**మొదటి రకం వ్యక్తులు :** కొందరు తమను తాము ప్రవక్తలుగా ప్రకటించు కున్నారు. వారు అసత్యవాదులు. అటువంటి వారిని నమ్మడం ద్వారా ఇస్లామ్ నుండి మార్గభ్రష్టులైనవారు ఈ కోవకు చెందినవారు. తిరిగి అజ్ఞానకాలపు ఆచారాల వైపు వెళ్ళిపోయినవారు.

**రెండవ రకం వ్యక్తులు :** కొందరు తౌహీద్‌లోనే ఉన్నారు మరియు వారు సలాత్(నమాజ్) చేసేవారు కాని జకాత్ తప్పనిసరి కాదని చెబుతూ దానిని ఇవ్వడానికి నిరాకరించారు.

**మూడవ రకం వ్యక్తులు :** తౌహీద్, సలాత్, జకాత్‌పై ఉన్నప్పటికీ, ఖలీఫాకు జకాత్ చెల్లించడాన్ని తిరస్కరించినవారు.

ఇదంతా అవిశ్వాసం కిందకే వస్తుంది. ఇటువంటి వారిపై ఖలీఫా యుద్ధం చేసే విషయంలో వ్యతిరేకించ వలసింది ఏమీ లేదు.

'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని పలికిన ఒక ముస్లిమ్ మరో ముస్లిమ్‌ను అన్యాయంగా చంపితే లేక ఆ ముస్లిమ్ దొంగతనం చేస్తే **అతడు శిక్షకు అర్హుడే!** 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని పలికినంత మాత్రాన ఎవరైనా ఏదైనా చేయడానికి హక్కు ఉందనుకుంటే అది పొరపాటు, అది ఇస్లామ్ పరిధిలో ఉంటే తప్ప. **ప్రవక్త(స)వారు ఆ షరతు కూడా చెప్పారు.** కాబట్టి ధార్మిక విషయాలు మనకు బాగా అర్థం కావడానికి ఖలీఫాల జీవితాల గురించి అధ్యయనం చేయడం ద్వారా మనకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

**అర్హత ఉన్న ప్రతీ ముస్లిమ్‌పై జకాత్ తప్పని సరిగా విధించబడింది.** ఎందుకంటే జకాత్ అనేది ఈమాన్, సలాత్(నమాజ్), హజ్జ్ మరియు సౌమ్ (ఉపవాసాల) వలే, ఇస్లామ్ యొక్క 5 మూలస్తంభాలలో ఒకటి.

ఇబ్నె ఉమర్(రజి)వారి ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స)వారు చెప్పారు: "**ఇస్లామ్ ఐదింటిపై ఆధారపడింది.** షహాదత్ - ఆరాధ్యుడు లేడు అల్లాహ్ తప్ప మరియు ముహమ్మద్(స)వారు అల్లాహ్ యొక్క సందేశహరులు మరియు సలాత్ స్థాపన, జకాత్ ఇవ్వడం, రమదాన్ ఉపవాసం మరియు (కాబా) గృహానికి హజ్జ్ చేయడం." **(తిర్మిజీ, సహీహ్, 2609, పుస్తకం 38, అధ్యా.3, సంపుటి 5)**

వీటిలో ఏ ఒక్కదానిని తిరస్కరించినా, అతడు ఇస్లామ్ నుండి బయటికి వెళ్ళి పోయినట్లే. అల్లాహ్ కారుణ్యంచే తొలి ఖలీఫా సరియైన నిర్ణయాన్నే తీసుకుని సమాజంలో అవినీతికి చోటు లేకుండా చేశారు.

ఈ ఐదింటిలో 'జకాత్' అనేది కేవలం ఓ వ్యక్తిగత ఆరాధన మాత్రమే కాదు, దానిపై ప్రజలకు హక్కు ఉంది. ధనవంతుల సంపదలో అల్లాహ్ ఉంచిన పేదవారి అమానత్ - జకాత్. దానిని ఇవ్వనని ఎవరు పలికినా, ఆ వ్యక్తిపై నాయకునికి చర్య తీసుకునే హక్కు ఉంది.

ఒక పక్క అసత్యవాదుల ద్వారా సమస్య ఎదుర్కొంటుండగా, మరో ప్రక్క జకాత్ పట్ల వ్యతిరేకత చూపుతున్నవారి ద్వారా సమస్య మొదలైంది. ఇటువంటి సమయంలో ఉసామా(రజి)వారి సైన్యాన్ని యుద్ధానికి పంపితే, శతృవులు ఇంకా పెరిగే అవకాశం ఉంది.

పరిస్థితులు ఎలా ఉన్నా సరే, ధర్మంపై స్థిరంగా నిలబడటం నాయకుని బాధ్యత అని ప్రజలకు ఓ ఉదాహరణగా నిలిచారు అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారు.

'జకాత్' చెల్లించడాన్ని నిరాకరించిన వారిపై పోరాటం విషయంలో కొందరు సహాబాలు అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారికి నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. వారి మాటలకు స్పందించి ఆయన పెద్ద ప్రసంగమేమీ ఇవ్వలేదు. ఒకే ఒక్క మాట చెప్పారు :

**"గ్రంథ అవతరణ ఆగిపోయింది. మరియు ధర్మం పరిపూర్ణం అయింది. నేను దానిని క్షీణించడానికి అవకాశం ఇవ్వాలా నేను బ్రతికుండగనే?"**

అయితే ఆయన ఈ నిర్ణయం తీసుకునే ముందు ప్రవక్త(స)వారి సంప్రదాయం ప్రకారం సహాబాల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు.

ఇస్లామ్‌లో పరస్పర సంప్రదింపుల గురించి కొన్ని విషయాలు ఇక్కడ చెప్పడం చాలా ముఖ్యం. ముందుగా క్రింది రెండు ఆయత్‌లు చూడండి.

అల్లాహ్‌ను విశ్వసించినవారి గురించి ఖుర్'ఆన్‌లో ఇలా చెప్పబడింది:

> **"..... మరియు తమ వ్యవహారాలను పరస్పర సంప్రదింపుల ద్వారా పరిష్కరించు కుంటారు ...."** (ఖుర్'ఆన్ 42:38)

ప్రవక్త(స)వారికి అల్లాహ్ ఇలా చెబుతున్నారు :

> **"..... మరియు వ్యవహారాలలో వారిని సంప్రదించు. ఆ పిదప నీవు కార్యానికి సిద్ధమైనప్పుడు అల్లాహ్‌పై ఆధారపడు. నిశ్చయంగా అల్లాహ్ తనపై ఆధారపడేవారిని ప్రేమిస్తాడు."** (ఖుర్'ఆన్ 3:159)

ముహమ్మద్(స)వారి మరణానంతరం, ఒకవేళ ఏదైనా వ్యవహారంలో ఖుర్'ఆన్ మరియు సున్నత్‌లలో దాని గురించి సవివరంగా లేనట్లయితే ఏమి చేయాలి? ఇదే విషయాన్ని అలీ(రజి)వారు ముహమ్మద్(స)వారిని అడిగారని తఫ్సీర్ గ్రంథాలలో ప్రస్తావించబడింది.

ధర్మపరాయణులు మరియు ఎల్లప్పుడూ తమ ప్రభువు పట్ల ఆరాధనలో గడిపేవారు మరియు ధర్మంపై ఎక్కువ జ్ఞానం గలవారు

కలిసి పరస్పరం సంప్రదింపుల ద్వారా నిర్ణయం తీసుకోవాలని, ఎవరో ఒకరి ఏకాకి అభిప్రాయంపై ఆధారపడవద్దని ప్రవక్త(స)వారు బోధించారు.

ఇక్కడ మనం ఓ ముఖ్య విషయాన్ని గమనించాలి. సవివరంగా లేని వ్యవహారం అంటే అది ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌లలో లేనే లేదని భావించడం పొరపాటు. ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌లలో ఆ విషయం గురించి ప్రస్తావన ఉన్నప్పటికీ దానిలోని వివేకం మన గ్రహణ స్థాయికి అందక పోవచ్చు. అటువంటప్పుడు ప్రవక్త(స)వారు చెప్పినటువంటి వ్యక్తులు కూర్చుని సంప్రదింపులు జరిపినప్పుడు, వారిలో ఎవరికో ఒకరికి లేదా కొందరికి అల్లాహ్ ఆ ప్రత్యేక వ్యవహారాన్ని అర్థం చేసుకునే వివేకాన్ని ప్రసాదించవచ్చు. అటువంటి ఎన్నో వ్యవహారాల పరిష్కారాలను ఆనాటి విద్వాంసులు ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌ల నుండే గ్రహించ గలిగారు.

బైహఖీ(ర)వారు తన షు'బుల్ - ఈమాన్‌లో అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)వారి ఉల్లేఖనాన్ని తెలియజేశారు ప్రవక్త(స)వారు చెప్పారు:

**ఒక వ్యక్తి ఏదో చేయాలని అనుకుంటాడు, తరువాత సంప్రదించ డానికి వెళతాడు మరియు ఒక నిర్ణయంతో వస్తాడు అది చేయవచ్చా? లేదా? అని, అతడు అల్లాహుతాలా నుండి ఏది సరైనదో మరియు ప్రయోజనకరమైనదో ఆ ఎంపికవైపు మార్గదర్శకత్వాన్ని పొందుతాడు.**

(మారిఫుల్ ఖుర్‌ఆన్, ఇంగ్లీష్ అనువాదం, సంపుటి 2, పుట 228 నుండి)

మనవంటివారు తెలియని విషయాల గురించి సంప్రదించాలి. కాని **ముహమ్మద్(స)వారు ఎవరినైనా ఎందుకు సంప్రదించాలి?** సంప్రదించమని ఆయనను ఎందుకు ఆదేశించారు?

ఆయన అల్లాహ్ యొక్క సందేశహరుడు మరియు ఏ నిర్ణయాన్ని అయినా అల్లాహ్ నుండి ఆయన పొందగలరు. అయితే ఈ విషయంలోని ఔన్నత్యాన్ని గురించి ఇక్కడ చెప్పడం కంటే ఒక ప్రత్యేక వ్యాసరూపంలో సవివరంగా ఇన్షా అల్లాహ్ అందిస్తాము. ఎందుకంటే ఈ అంశానికి సంబంధించి చాలా ఎక్కువ వివరాలున్నాయి.

జకాత్ చెల్లించని వారిపై యుద్ధం విషయంలో అబూబక్ర్(రజి)వారు తుది నిర్ణయం తీసుకున్న తరువాత అల్లాహ్‌పై భరోసాతో దానిపైనే స్థిరంగా ఉన్నారు.

సహాబాలు అందరూ అబూబక్ర్(రజి)వారి వివరణను అర్థం చేసుకున్నారు. అందరూ మనస్ఫూర్తిగా ఆయనకు మద్దతు తెలిపారు.

అబూబక్ర్(రజి)వారి ఖిలాఫత్‌లో, ఆయన తీసుకున్న కొన్ని నిర్ణయాల పట్ల ఉమర్(రజి)వారు హర్షం వ్యక్తం చేశారు.

అదే విధంగా పరిపాలనా విషయాలలో ఉమర్(రజి)వారి సహకారం కూడా అబూబక్ర్(రజి) వారికి ఎంతో మేలు చేసింది. అటువంటి కొన్ని సంఘటనలను కూడా ఇక్కడ చెప్పవలసి ఉంది. ఎందుకంటే ముహమ్మద్(స)వారి తరువాత ఈ ఇద్దరి విశ్వాసులకు చాలా విషయాలలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. కనీసం కొన్ని ముఖ్య సంఘటనలనైనా అందించడం మా బాధ్యతగా భావించాము.

అబూబక్ర్ సిద్దీఖ్(రజి) మరియు ఉమర్(రజి) మధ్య ధార్మిక విషయాలలో సంప్రదింపులు జరుగు తుండేవి. వీరిద్దరూ తొలి మరియు ద్వితీయ ఖలీఫాలు అయినప్పటికీ, ధర్మం విషయంలో వీరి వ్యవహారశైలి ఏ ఇద్దరి ముస్లిములకైనా ఆదర్శం అని చెప్పవచ్చు.

- ముహమ్మద్(స)వారు ము'ఆజ్ బిన్ జబల్(రజి)వారిని యెమన్‌కి పంపారు. ఆయన యెమన్‌లోని ప్రజలను ఇస్లామ్ వైపు ఆహ్వానించారు. ముస్లిమ్‌లకు ధర్మం గురించి బోధించేవారు, తరువాత కాలంలో మార్గ భ్రష్టులకు వ్యతిరేకంగా పోరాడారు. రసూలుల్లాహ్(స)వారు మరణించిన తరువాత, ము'ఆజ్(రజి) మదీనాకు తిరిగి వచ్చేయడానికి నిర్ణయించు కున్నారు.

ఆయన యెమన్‌లో ఉన్నంత కాలం హలాల్ మార్గంలో కొంత ఐశ్వర్యాన్ని సంపాదించు కున్నారు.

ము'ఆజ్(రజి)వారు ప్రభుత్వం తరపున యెమన్‌కి వెళ్ళారు గనుక, ఉమర్(రజి)వారి అభిప్రాయం ప్రకారం ము'ఆజ్ (రజి)వారు తాను సంపాదించిన ఐశ్వర్యం నుండి కొంత భాగం ప్రభుత్వానికి వెనక్కి ఇవ్వాలి.

కాబట్టి ఉమర్(రజి)వారు అబూబక్ర్(రజి)వారితో ఇలా చెప్పారు: **"ఆయన (ము'ఆజ్-రజి)కు కబురు పంపండి. తరువాత ఆయనకు జీవించడానికి సరిపడా ఇవ్వండి మరియు తీసుకోండి ఆయన దగ్గర మిగిలిన దానిని."**

అబూబక్ర్(రజి)వారు దీనికి అంగీకరించ లేదు. ఉమర్(రజి)వారితో ఆయన ఇలా అన్నారు, "నిశ్చయంగా, ప్రవక్త(స)వారు అతనిని సంతోషంగా ఉండటానికే పంపారు."

అబూబక్ర్(రజి)వారు తనతో ఏకీభవించనప్పటికీ, ఉమర్(రజి) వారు తన అభిప్రాయం సరైనదేనని సమర్థించు కున్నారు. కాబట్టి ఉమర్(రజి) వారు ము'ఆజ్(రజి)వారి దగ్గరకు వెళ్ళారు, తన అభిప్రాయాన్ని ఆయన స్వీకరించ వచ్చేమోనని.

కాని ము'ఆజ్(రజి)వారు వ్యతిరేకంగా స్పందించారు. "నిశ్చయంగా, రసూలుల్లాహ్(స)వారు నన్ను పంపారు సంతోషంగా ఉండటానికి. **కాబట్టి మీరు చెప్పినట్లు నేను చేయను.**"

ఇక్కడ ఉమర్(రజి)వారి సంకల్పాన్ని అర్థం చేసుకోవాలి.

ము'ఆజ్(రజి)వారికి మరియు సాధారణ ముస్లిమ్ ప్రజానీకానికి మేలు చేయాలనేదే ఉమర్(రజి)వారి కోరిక. కాని ము'ఆజ్(రజి)వారు ఆయన సలహాను ఒప్పుకోక పోవడంతో, నిజాయితీగా ఏది మంచిదో ము'ఆజ్(రజి)వారికి సలహా ఇచ్చి, తన బాధ్యతను నెర వేర్చానని భావించి, ఇక ఆ విషయాన్ని అక్కడితో ఉమర్(రజి)వారు వదిలేశారు.

అంతేకాదు, ఉమర్(రజి)వారికి తెలుసు, ము'ఆజ్(రజి)వారిపై తనకు

అధికారం లేదని. ఎందుకంటే, ముస్లిమ్ జాతి వ్యవహారాలను చూసే ప్రతినిధి తాను కాదు. ఆ అధికారం అబూబక్ర్(రజి) వారిది.

కొంత కాలం గడిచింది. ము'ఆజ్(రజి)వారు ఉమర్(రజి)వారి దగ్గరికి వెళ్ళి చెప్పారు, "నేను మీకు విధేయత చూపుతున్నాను. మరియు నేను చేస్తాను దేనినైతే నన్ను చేయమని మీరు ఆదేశించారో, ఎందుకంటే వాస్తవానికి స్వయంగా నేను నీటి ప్రవాహంలో ఉన్నట్లు కలలో చూశాను. నేను మునిగిపోతానని భయపడ్డాను, కాని తరువాత, **ఓ ఉమర్! మీరు నన్ను రక్షించారు.**"

ఆ తరువాత ము'ఆజ్(రజి)వారు అబూబక్ర్(రజి)వారి దగ్గరికి వెళ్ళారు. ఆ విషయం పరిష్కరించబడింది.

- మార్గభ్రష్టులపై పోరాటం గురించి చెప్పుకున్నాం. మార్గభ్రష్టత్వానికి పాల్పడిన అటువంటి ఓ ఉపతెగ బుజాఖహ్. ఇది అసద్ మరియు ఘత్ఫాన్ తెగలకు చెందినది.

యుద్ధంలో ఓడిపోయాక, బుజాఖహ్ నాయకులు ఓ ప్రతినిధి బృందాన్ని అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారి దగ్గరకు పంపడానికి నిర్ణయించు కున్నారు. తమ లొంగుబాటును మరియు పశ్చాత్తాపంతో తిరిగిఇస్లామ్ వైపు రావడాన్ని తెలియజేయడానికి వారు ఖలీఫాగారి వద్దకు బయలు దేరారు.

ఆ బృందం మదీనా చేరింది. బహుశా అబూబక్ర్(రజి)వారికి వారి రాక వెనుక గల కారణం ఖచ్చితంగా తెలిసి ఉండకపోవచ్చు. అందువలన ఆయన ఆ బృందానికి రెండింటి మధ్య ఏదో ఒకటి ఎంచుకునే అవకాశాన్ని ఇచ్చారు - (1) బహిరంగ యుద్ధం మరియు (2) అవమానకరమైన శాంతి."

బుజాఖహ్ ప్రతినిధులు అడిగారు, "మాకు బహిరంగ యుద్ధం యొక్క అర్థం తెలుసు. కాని అవమానకర శాంతి అంటే ఏమిటి?" అబూబక్ర్(రజి) దాని గురించి వారికి వివరించారు. వారు తమ వీపులను ఇస్లామ్‌కు వ్యతిరేకంగా తిప్పి ముస్లిములతో యుద్ధం చేశారు మరియు ఇక వారిని పూర్వం నమ్మినట్లు నమ్మలేరు కనుక, ఒకవేళ వారు శాంతిని కోరితే, అవమానకరమైన స్థాయిని వారు ఆమోదించ వలసి ఉంటుంది.

అబూబక్ర్(రజి) చెప్పారు: **"మేము మీ నుండి మీ ఆయుధాలను మరియు మీ గుఱ్ఱాలను స్వాధీనం చేసుకుంటాము. మేము మీ నుండి పొందిన యుద్ధప్రాప్తిని ఉంచుకుంటాము. మీరు మా నుండి పొందిన యుద్ధప్రాప్తిని తిరిగి మాకు ఇచ్చివెయ్యాలి. మీరు రక్తపరిహారాన్ని నేలకొరిగిన మావారి కొరకు చెల్లించాలి. నేలకొరిగిన మీలోని వారు నరకాగ్నిలో ఉన్నారు. మరియు మీరు మీ ప్రజలను వదలండి ఒంటెల తోకలను అనుసరించడానికి (అంటే రైతులుగా), అల్లాహుతాలా తన ప్రవక్త(స)వారి ఖలీఫాకు మరియు ముహాజిరూన్‌లకు మిమ్మల్ని క్షమించే దానినేదైనా చూపేవరకూ."**

ఇస్లామ్ వైపు తిరిగి వచ్చినప్పటికీ మార్గభ్రష్టులను యుద్ధ సైనికులుగా ప్రభుత్వం తీసుకోలేదు. వారి నిజాయితీ ప్రశ్నార్థకం కనుక. ఎందుకంటే వారు తిరిగి నమ్మకద్రోహానికి పాల్పడే అవకాశం ఉండవచ్చు. కాబట్టి వారు రైతులుగా పనిచేసుకోవాలి. వారి పశ్చాత్తాపంలో నిజాయితీ ఉందని నిరూపించబడే వరకూ ఆ పరిస్థితే కొనసాగుతుంది.

అబూబక్ర్(రజి)వారు 'అవమానకరమైన శాంతి ఒప్పందం' యొక్క నిబంధనలను పేర్కొనడాన్ని ముగించగానే, ఉమర్(రజి)వారు లేచి అబూబక్ర్(రజి)వారితో అన్నారు, "**నా అభిప్రాయాన్ని మీతో పంచు కోవాలనుకుంటున్నాను.** మీరు బాగా చెప్పారు - మీరు బహిరంగ యుద్ధం మరియు అవమానకరమైన శాంతి ఎంపిక విషయాన్ని ప్రస్తావించినప్పుడు.

మనం వారి నుండి పొందిన యుద్ధప్రాప్తిని మనం ఉంచుకుంటామని మరియు వారు మన నుండి పొందిన యుద్ధప్రాప్తిని తిరిగి ఇచ్చివేయాలని మీరు చెప్పినప్పుడు కూడా మీరు బాగా మాట్లాడారు.

కాని 'వారు రక్తపరిహారాన్ని నేలకొరిగిన మన సైనికులకు ఇవ్వాలని, నేల కొరిగిన వారి సైనికులు నరకాగ్నిలో ఉండగా' అనిన మీ ప్రకటనకి సంబంధించి మీరు ఒక ముఖ్యమైన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

ముఖ్యమైన విషయం ఏమిటంటే, నేల కొరిగిన మన సైనికులు యుద్ధం చేశారు మరియు అల్లాహ్ ధర్మాన్ని రక్షించడంలో వారు చంపబడ్డారు. వారి బహుమానాలు అల్లాహ్ దగ్గర ఉన్నాయి. కాబట్టి వారికి రక్త పరిహారం అవసరం లేదు."

ఉమర్(రజి)వారి అభిప్రాయాన్ని ఖలీఫా స్వీకరించారు. దాని ప్రకారంగా ఆ నిబంధనల నుండి రక్త పరిహార చెల్లింపును తొలగించారు. ఆ తరువాత అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారు ఆ బృందం చేత ప్రతిజ్ఞ చేయించారు.

**మరికొన్ని ముఖ్య సంఘటనలను చెప్పుకునే ముందు, ఇప్పటి వరకూ చెప్పిన విషయాలను విశ్లేషిద్దాం!**

## కలిమా విషయం

**'లా ఇలాహ ఇల్లల్లాహ్. ముహమ్మదుర్ రసూలుల్లాహ్'** అని కలిమా చదివేసి స్వర్గానికి అనుమతి లభించినట్లుగా చాలామంది భావిస్తుంటారు. చాలా మంది దాయీలు చేసేపని కూడా అదే. నోటిమాటగా అనిపించేసి చేతులు దులిపేసుకుంటారు. కాని విశ్వాసులకు మాత్రమే స్వర్గం ఉందని ప్రవక్త(స)వారు స్పష్టంగా ప్రకటించారు. ఇస్లామ్‌లో కొన్నింటిని ఆమోదించి, మరి కొన్ని ఆదేశాలను తిరస్కరిస్తే అది అవిశ్వాసమే అవుతుంది. ఆచరణ ముఖ్యం. ఫరిష్తాలలో నెమలి అని పేరు పొందిన ఇబ్లీస్, ఒకే ఒక్క ఆదేశాన్ని తిరస్కరించి అల్లాహ్‌చే శపించబడ్డాడు.

క్లిష్టపరిస్థితులలో ఉన్నప్పటికీ ఇస్లామ్ మూల స్తంభాలలో ఒకటైన జకాత్ చెల్లించని ముస్లిములపై యుద్ధం ప్రకటించి ధర్మం విషయంలో

స్థిరంగా నిలబడ్డారు ఖలీఫా.

ఇదే జకాత్ విషయంలో నేటి మన ముస్లిమ్ సమాజంలో కూడా చాలా మంది అల్లాహ్ ఆదేశాన్ని పరోక్షంగా తిరస్కరిస్తూ అల్లాహ్ చెప్పిన వారికి కాకుండా ఇతరులకు ఇస్తున్నారు. మార్గభ్రష్టత్వంవైపు ప్రజలను తీసుకుపోయే స్వార్థపరుల విషయంలో మన సమాజం చాలా అప్రమత్తంగా ఉండాలి.

## సంప్రదింపుల విషయం

ఎవరితో సంప్రదించాలి?

జ్ఞానం గలవారితో, తఖ్వా గలవారితో, అల్లాహ్‌ను ఆరాధించడంలో సమయాన్ని గడిపే వారితో. అంతేగాని ఫలానా మదరసా నుండి డిగ్రీ పొందినవారితో అని మాత్రం కాదు. ఆ డిగ్రీ పొందినా సరే, వారు పైన పేర్కొన్న వ్యక్తులలో ఒకరై ఉండాలి.

ఒక హదీస్‌ను అర్థం చేసుకోవడం అనేది అందరి విషయంలో ఒకే విధంగా ఉండకపోవచ్చు. కొందరికి అందులో లోతుగా ఉండే వివేకం స్పష్టంగా అర్థమౌతుంది. కాబట్టి ఖుర్ఆన్ మరియు సున్నత్‌లలో స్పష్టంగా వివరణ లేనప్పుడు మాత్రమే పరస్పర సంప్రదింపులు జరగాలి.

ఉదాహరణకు సేకరించబడిన జకాత్ మొత్తాన్ని ఎవరెవరికి పంచాలో అల్లాహుతాలా స్పష్టంగా ఖుర్ఆన్ (9:60)లో తెలియజేశారు. ఎనిమిది రకాల కేటగిరిలలో ఒకటి **ఫీ సబీలిల్లాహ్** (అల్లాహ్ మార్గంలో). **అది అస్పష్టమైన పదమేమీ కాదు.** సవివరంగా చెప్పని విషయం అంతకంటే కాదు. ఆ పదం ఇస్లామ్ పట్ల కనీస అవగాహన లేని వారికి మాత్రమే అర్థం కాకపోవచ్చు. ఖుర్ఆన్ చదువుకున్నవారికి అది అల్లాహ్ మార్గంలో చేసే పోరాటం అని చాలా స్పష్టంగా తెలుస్తుంది.

కాబట్టి ఆ విషయంపై పరస్పర సంప్రదింపుల యొక్క అవసరం ఎంతమాత్రం లేదు. ఉదాహరణకు క్రింది విషయాలు చూడండి :

**అహ్సనుల్ బయాన్** గ్రంథానికి హాఫిజ్ సలాహుద్దీన్ యూసుఫ్‌గారు వ్యాఖ్యానం చేశారు. దీని ఇంగ్లీష్ అనువాదాన్ని రియాద్‌లోని దారుస్సలామ్ పబ్లిషర్స్ 2010లో ప్రచురించారు. ఆ అనువాదంలోని 'ఫీ సబీలిల్లాహ్' కేటగిరికి అర్హులు ఎవరని చెప్పబడిందో ఆ భాగానికి తెలుగు అనువాదం:

> **అల్లాహ్ మార్గమంటే జిహాద్. ఆయుధాల కొనుగోలుకు జకాత్ ఖర్చుపెట్టవచ్చు మరియు ఓ యుద్ధ సైనికునికి సహాయం చెయ్యవచ్చు (అతడు ధనవంతుడైనప్పటికీ). హదీస్‌ల ప్రకారం హజ్జ్ మరియు ఉమ్రా కూడా 'ఫీ సబీలిల్లాహ్' క్రిందికే వస్తుంది.**

ఇదే అహ్సనుల్ బయాన్‌ను తెలుగులో ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ గారిచే అనువాదం చేయించి, శాంతిమార్గం పబ్లికేషన్ ట్రస్ట్ (హైదరాబాద్)వారు ఉచితంగా పంపిణీ చేశారు. ఆ తెలుగు అనువాదాన్ని ఇక్కడ అందిస్తున్నాము.

> **దైవమార్గంలో (ఫీ సబీలిల్లాహ్) : అంటే ధర్మ యుద్ధం కోసం అన్నమాట. యుద్ధ సామాగ్రిని సమకూర్చు కోవడానికి, యోధుల అవసరాలను తీర్చడానికి జకాత్‌ను వెచ్చించటం సమ్మతమే. హజ్జ్, ఉమ్రాలు కూడా దైవమార్గం (ఫీ సబీలిల్లాహ్) పద్దు క్రిందకే వస్తాయని హదీస్‌ల ద్వారా రూఢీ అవుతుంది.**
>
> అలాగే దైవధర్మ ప్రచారం కోసం కూడా ఈ మొత్తాన్ని వెచ్చించ వచ్చని కొంతమంది **విద్వాంసులు భావించారు.** ఎందుకంటే ఇది కూడా జిహాద్ మాదిరిగానే సత్యధర్మ ఉన్నతికై జరిగే కృషి అని వారు సూత్రీకరించారు. (పేజీ 851)

ఖుర్ఆన్ మరియు హదీస్‌లలో స్పష్టంగా చెప్పబడిన తరువాత విద్వాంసుల స్వంత అభిప్రాయాలకు విలువ లేదు.

**దైవధర్మ ప్రచారం యొక్క ఆవశ్యకత మరియు ప్రాధాన్యత ఇప్పటికంటే ఆనాడే చాలా ఎక్కువ ఉంది.** ఆనాటి ముస్లిముల సంఖ్య చాలా తక్కువ. నేడు ప్రపంచంలో 150 కోట్లకు పైగా ముస్లిములున్నారు. ఒక్కొక్కరు 4గురికి సందేశాన్ని అందించినా మొత్తం ప్రపంచానికి సందేశం అందించ వచ్చు. సన్మార్గం పొందిన ఖలీఫాలు జకాత్ విషయంలో ఖుర్ఆన్ మరియు హదీస్‌ల ప్రకారమే వ్యవహరించారు.

ప్రతీ పనికి జకాత్ సొమ్ము ఉపయోగించే విషయమే అయితే అల్లాహుతాలా 8 రకాల వ్యక్తుల గురించి ఎందుకు చెప్పి ఉంటారని ఆలోచిస్తే, ఏ స్థాయిలో మోసం జరుగుతుందో అర్థమౌతుంది.

**పరస్పర సంప్రదింపుల ద్వారా తీసుకునే నిర్ణయం విషయంలో మెజారిటీ లేదా మైనారిటీ అనే అంశానికి తావు లేదు.** వివేకవంతమైనది ఒకరు చెప్పినా దానిని స్వీకరించాలి. అంతేగాని ఎక్కువ మంది విద్వాంసులు చెప్పారు కాబట్టి అదే తీసుకోవాలని లేదు.

ఇతర సహచరులందరూ చెప్పినప్పటికీ, అబూబక్ర్(రజి) మరియు ఉమర్(రజి)వారి నిర్ణయాన్నే ప్రవక్త(స)వారు ఎక్కువ సార్లు బలపరచిన ఉదంతాలు ఉన్నాయి.

ఎందరో పెద్దవారున్నప్పటికీ, వారు తమ అభిప్రాయాలు తెలిపినా, చిన్న వయస్సుగల ఇబ్నె అబ్బాస్(రజి)వారి అభిప్రాయాన్నే ఉమర్(రజి) తాను ఖలీఫాగా ఉన్నప్పుడు ఎక్కువసార్లు స్వీకరించారు. ఎందుకంటే ఇబ్నె అబ్బాస్(రజి)వారి వివేకం అటువంటిది. ఈయన గురించి ఇది వరకే శాంతిబాటలో వివరంగా తెలిపాము.

పరస్పర సంప్రదింపులు లేకపోతే ఖిలాఫతే లేదని ఉమర్(రజి)వారు చెప్పినట్లు తఫ్సీర్‌లలో ప్రస్తావించారు. అయితే అది ఖుర్ఆన్ మరియు సున్నత్‌లకు వ్యతిరేకం కాకుండా ఉండాలి.

మెజారిటీ, మైనారిటీ అని కాకుండా, ఉత్తమ అభిప్రాయానికి విలువిచ్చి ఉత్తమ ప్రజాస్వామ్యాన్ని ఆచరణలో పెట్టారు సన్మార్గం పొందిన మన ఖలీఫాలు.

### ఇతరుల మేలు కోరడం

ము'ఆజ్ బిన్ జబల్(రజి) విషయంలో ఉమర్(రజి)వారు **ఎందుకు జోక్యం చేసుకున్నారు?** అతడు తన పరలోక జీవితంలో మేలు పొందాలనే సంకల్పంతోనే ఉమర్(రజి)వారు సలహా ఇచ్చారు. ఆ సలహాను మొదట్లో ము'ఆజ్(రజి) స్వీకరించలేదు. వ్యతిరేకించారు. **ఉమర్(రజి)వారు వాదించ లేదు.** ఆ విషయాన్ని అక్కడితో వదిలేశారు. తన బాధ్యతగా భావించి ఆ విషయాన్ని మొదట ప్రభుత్వ ప్రతినిధి (ఖలీఫా)కు చెప్పారు. తరువాత సదరు వ్యక్తికి కూడా తెలిపారు. కాని అల్లాహ్ కారుణ్యం ఆయనను అర్థం చేసుకునేలా చేసింది.

**కాబట్టి మనం చెప్పే సత్యం ఒకరు స్వీకరిస్తారా? లేదా? అనే ఆలోచన మనకు అనవసరం.** సత్యాన్ని చెప్పాలి. తోటి ముస్లిములు చేస్తున్న పని సరియైనది కాదు అని తెలిసినప్పుడు వారికి చెప్పాలి. ధర్మసందేశ ప్రచారం (దావా)ను వృత్తిగా మరియు వ్యాపారంగా స్వీకరించి ఓ బిద్'అత్ వ్యవస్థను ప్రవేశపెట్టిన దాయీలకు, ఖుర్'ఆన్ మరియు సున్నత్‌ల ద్వారా సత్యాన్ని తెలిపాము.

వారు మారాలని మరియు ముహమ్మద్(స)వారి బోధనలకు అనుగుణంగా నడచుకోవాలని, ఆ విధంగా వారికి ఇహపరలోకాల్లో మేలు కలగాలని, అంతేకాకుండా ఈ 'దావా' విషయంపై అవగాహన లేనివారికి అవగాహన కలిగించి వారు ఇటువంటి బిద్'అత్‌కు పాల్పడకుండా ఉండాలని సత్యాన్ని నిర్భయంగా అల్లాహ్ కారుణ్యంచే చెప్పడం జరిగింది.

కొద్దిమంది మాత్రం తాము మారాము అని, తిరిగి కష్టపడి పనిచేసు కుంటున్న విషయాన్ని తెలిపారు. మెజారిటీ బిద్'అతీలు మాకు వ్యతిరేకం అయ్యారు. **మా బాధ్యత మేము నెరవేర్చాము. ఇక ఈ విషయం వారిపై మరియు అల్లాహ్‌పై వదిలేస్తున్నాము.**

ఉమర్(రజి)వారు తన అభిప్రాయాలను సూటిగా సహాబాలకే కాకుండా ముహమ్మద్(స)వారికి కూడా చెప్పేవారు. ఉమర్(రజి)వారు బద్ర్ యుద్ధ ఖైదీల విషయంలో తన అభిప్రాయాన్ని ప్రవక్త(స)వారికి చెప్పారు. తరువాత ఆ అభిప్రాయమే సరైనది అని తెలిసింది. మునాఫిక్‌కి జనాజా జరిపించే విషయంలో కూడా ఉమర్(రజి)వారు తెలిపిన అభ్యంతరం సరియైనదేనని దివ్య సందేశం ద్వారా తెలిసింది.

**(ఇన్శా అల్లాహ్ మరికొంత భాగం వచ్చే సంచికలో .....)**


**మీ బంధువులు మరియు స్నేహితులను శాంతిబాట చందా దారులుగా చేర్చి సత్యాన్ని వ్యాపింప చేయడంలో సహకరించమని కోరుతున్నాము.**

**డి.టి.డి.సి. కొరియర్ ద్వారా కాపీని పొందగోరువారు సంవత్సర చందా రూ. 200/- కు అదనంగా మరో రూ. 100/- చెల్లిస్తే, మీకు కొరియర్ ద్వారా పంపిన వెంటనే కన్‌సైన్‌మెంట్ నంబర్ మీకు ఎస్.ఎమ్.ఎస్. చేస్తాము, ఇన్శా అల్లాహ్**

**కొత్తగా చేరిన పాఠకులకు మా విన్నపం**

మాకు ఉన్న పోస్టల్ లైసెన్స్ ప్రకారం ప్రతీ నెల 15వ తారీఖున శాంతిబాట పోస్ట్ చేయవలసి ఉంది. ఒకొక్కసారి కొన్ని వ్యాసాల పరిశోధన కొరకు ఎక్కువ సమయం అవసరమౌతుంది. సాంకేతిక సమస్యల వలన కూడా పత్రిక ఆలస్యం కావచ్చు.

**సంవత్సర చందా వివరాలు :**

**రూ. 200/- పోస్టల్ మనియార్డర్ (M.O.) ద్వారా**

**క్రింది ఎడ్రస్‌కు పంపండి.**

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్, సామర్లకోట-533440
మనియార్డర్ చేయగానే 9491103017కి ఫోన్ చేసి
తెలియజేయవలసిందిగా కోరుతున్నాము

**ఎక్కువ చందాలను పంపగోరువారు**
**క్రింది ఎకౌంట్‌లో డిపాజిట్ చేయవచ్చు.**
SBI A/c No. 10428633092
Waltair, Visakhapatnam-530003
Contact : Dr. N. Srinivasa Rao, Cell:9491103017
velugubaata@gmail.com
info@saanthibaata.net

**మొదటి సంవత్సరం సంచికలు**
(తొలి సంచిక ఆగష్టు 2009 మినహా)
**మరియు 2వ సంవత్సరం సంచికలు కావలిసిన వారు**
**రూ. 365/- మనియార్డర్ చేయగలరు.**

**కేవలం ఏదో ఒక ఆర్టికల్ మాత్రమే అవసరమైతే**
**మా వెబ్‌సైట్ www.saanthibaata.net నుండి**
**ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.**

మీ కవర్‌పై ఉండే ఎడ్రస్ స్లిప్‌పై మీ ఫోన్ నంబర్ లేకపోయినా లేక మీ నంబర్ మారినా ఆ నంబర్‌ను వెంటనే మాకు తెలియజేయండి.




సల్లల్లాహు అలైహి వసల్లమ్ (అల్లాహ్ నుండి ఆయనపై శుభాశీస్సులు మరియు శాంతి కలుగుగాక!)

# సకల లోకాలకు కారుణ్యం (రహమతల్లిల్ ఆలమీన్)

**16**

## విశ్వాస పునాది మరియు శిక్షణ
### (ముహమ్మద్(స)వారి అనుచరులలో)

కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా దాదాపు గత 8 సంచికలలో ముహమ్మద్(స)వారి సీరియల్ అందించ లేకపోయాము. ఇన్షా అల్లాహ్! ఈ సంచిక నుండి రెగ్యులర్‌గా అందిస్తాము.

ముహమ్మద్(స)వారి అనుచరులు అసాధారణ తఖ్వాతో ఎన్నో త్యాగాలు చేయడం మనం చదివాము. వారు అల్లాహ్ కారుణ్యంచే ఆశీర్వదించబడిన వారు. ముఖ్యమైన విషయం ఏమిటంటే, వారు కలిమా చదివిన తరువాత ప్రత్యక్షంగా ముహమ్మద్(స)వారి నుండి శిక్షణ పొందారు. ఆ శిక్షణే వారు గొప్ప విశ్వాసులు కావడంలో ముఖ్యపాత్ర వహించింది.

ముహమ్మద్(స)వారు భౌతికంగా ఇప్పుడు మన మధ్య లేరు. మనం విశ్వాసులుగా స్థిరంగా నిలబడటానికి ఆయన నుండి శిక్షణ పొందక పోవడమే దానికి కారణమా? మనకు అంత అదృష్టం లేదని చింతించాలా?

ముహమ్మద్(స)వారి నుండి ప్రత్యక్షంగా శిక్షణ లేకుండానే పరోక్ష శిక్షణతో బుఖారీ(ర)వారు ఏ విశ్వాస స్థాయికి చేరుకున్నారో, ఇదివరకే శాంతిబాటలో చెప్పుకున్నాం.

అల్లాహ్ ఎవ్వరికీ రవ్వంత అన్యాయం చేయలేదు. ఆనాడు ఒక హదీస్ గురించి వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి తెలుసుకునేవారు. ఇప్పుడు మన దగ్గర వేల హదీస్‌లు సిద్ధంగా ఉన్నాయి. ఫలానా హదీస్ కావాలని ప్రపంచంలో ఏ మారుమూలనైనా నివశించే వ్యక్తిని మరో మూల నివశించే వ్యక్తి అడిగితే, ఇంటర్‌నెట్‌లో వెంటనే పంపించ గలిగే పరిస్థితి అల్లాహ్ కల్పించారు. ఆ విధంగా మనం కూడా అదృష్ట వంతులమే!

కాని మరో విధంగా ఎంతో దురదృష్టవంతులం. ఆకలి వేస్తుందని అల్లాహ్‌ను వేడుకుంటే, ఆయన కరుణించడంతో, మన ముందు ఆహారం ఏర్పాటు చేయబడిందని అనుకుందాము. మనకు చేతులు ఉన్నాయి. తినడం తెలుసు. కాని ఆ ఆహారం వంక లొట్టలేస్తూ చూస్తూనే ఉన్నాముగాని, చేతులు ఉపయోగించడం లేదు. ఎవరో వచ్చి తినిపించాలని ఎదురుచూస్తున్నాము. ఎవరో ఒకరు వచ్చి తినిపించే వరకూ తినకుండా కూర్చుంటే ఏం జరుగుతుంది?

ముహమ్మద్(స)వారు తన అనుచరులలో విశ్వాస పునాది ఎలా వేశారో మరియు ఖుర్‌ఆన్ ద్వారా శిక్షణ ఏ విధంగా ఇచ్చారో గత వ్యాసాలలో చెప్పుకున్నాం. ఆ క్రమంలో క్రిందటి వ్యాసంలో స్వర్గం గురించి, అందులో ఉండే వివిధ సౌకర్యాల గురించి కొంత చెప్పడం జరిగింది. వాటిని ఈ వ్యాసంలో కొనసాగిస్తున్నాము.

ముహమ్మద్(స)వారి జీవితచరిత్రలో ఈ అంశాలు అంత అవసరమా? అని అడగవచ్చు. వాస్తవానికి సీరత్‌లో అతి ముఖ్యమైన అంశం ఇదే! మక్కా ముష్రిక్‌లు ఎందుకు కలిమా చదవాలి? ఎందుకు ఇస్లామ్ చూపిన విధానంలోనే వారు జీవించాలి? కష్టాలను ఎందుకు ఎదుర్కోవాలి? త్యాగాలు ఎందుకు చేయాలి?

దాని వలన వారికి అదనంగా లభించే మేలు ఏమిటి?

వీటి జవాబు ఓ ఉదాహరణ ద్వారా చెప్పుకుందాం! మనం మన పిల్లల్ని మన శక్తిమేర మంచి స్కూలులో చదివిస్తున్నాము. ఇంజినీరింగ్, మెడిసిన్ చదివించడం కోసం కార్పోరేట్ గ్రైండర్లలో వేసి రాత్రి, పగలు వారిని రుబ్బించేసి, ఎన్నో కష్టాలకు గురి చేసి, ఆటలు వినోదాల నుండి కొన్ని సంవత్సరాలు వారిని దూరంగా ఉంచడం జరుగుతుంది.

పిల్లలకు మేలు చేస్తున్నామా? మనం చేసే పని పిల్లలకు సంతోషాన్ని ఇస్తుందా? ఎందుకు మనం ఇంత కష్టపెట్టిస్తున్నాము మన పిల్లల్ని?

వారి భవిష్యత్తు బావుండాలని. వారి జీవితం సౌకర్యవంతంగా, సుఖంగా గడవాలని.

సగటు జీవితకాలం 70 సంవత్సరాలు అనుకుంటే, దానిలో దాదాపు మూడవ వంతు కాలం కష్టపడటం జరుగుతుంది. ఓ 40 సంవత్సరాలు సుఖంగా బ్రతకడానికి (వాస్తవానికి ఈ విషయంలో కూడా గ్యారంటీ లేదు) దానిలో సగం కాలం కష్టపడుతున్నారు. మంచి భవిష్యత్తు కోసం కష్టపెట్టడం తప్పుకాదని ప్రతీ తల్లీతండ్రి ఒప్పుకుంటారు.

ఇక విషయానికొద్దాం. ముహమ్మద్(స)వారు రెండు లోకాల గురించి చెప్పారు. (1) తాత్కాలికమైన ఇహలోకం - మన ప్రస్తుత జీవితం (2) శాశ్వతమైన పరలోకం.

ఇహలోకంలో ఖుర్ఆన్ మరియు సున్నత్‌ల ప్రకారం జీవిస్తే పరలోకంలో శాశ్వత సుఖాలు లభిస్తాయి.

ఇహలోక కాల వ్యవధి ఎంత?

పరలోక కాల వ్యవధి ఎంత?

ఇహలోకం తాత్కాలికం అని చెప్పడం జరిగింది కనుక, దాని గురించి వివరించాలి. ఒకసారి మన కనురెప్ప మూసి తెరవడానికి ఎంత సమయం పడుతుంది? ఒక సెకను కంటే తక్కువే అవుతుంది. మన 70 సంవత్సరాల జీవిత కాలంలో అటువంటి ఓ సెకనుకు ప్రాముఖ్యత ఏమైనా ఉందా?

ఖచ్చితంగా లేదు. ఆ ఒక్క సెకను కష్టపడితే, జీవితాంతం సుఖంగా ఉండవచ్చు అని చెబితే వారు ప్రతీ సంతోషంగా ఒప్పుకుంటారు.

పరలోకంతో పోలిస్తే, పై పోలిక కంటే ఇహలోకం చాలా తక్కువ.

ఇహలోక కష్టాలకు ఫలితం స్వర్గం కాబట్టి, అది ఎలా ఉంటుందో తెలియాలి. అదే విధంగా ఇహలోకంలో నిర్లక్ష్యం వహిస్తే ఫలితం నరకం కాబట్టి, అది ఎంత భయంకరంగా ఉంటుందో తెలియాలి.

ఆ సుఖాలు మరియు శిక్షల గురించి చదువుతుంటే వాటిని మన జ్ఞానం మేరకు ఊహించుకుంటాం. కాని వాస్తవానికి మనం ఊహించిన వాటికంటే ఎన్నో రెట్లు పరలోకంలో చూడటం జరుగుతుంది.

స్వర్గ నరకాల గురించి చాలా స్పష్టంగా ముహమ్మద్(స)వారు బోధించారు. అవి ఏ స్థాయిలో వారిని ప్రభావితం చేశాయంటే, సలాత్ (నమాజ్)లో నరక శిక్షలను తెలిపే ఆయత్‌లను పఠిస్తూ, ముహమ్మద్ (స)వారి అనుచరులు స్పృహ తప్పి పడిపోయేవారు.

స్వర్గం గురించి తెలుసుకుని లక్ష కంటే ఎక్కువ సంఖ్యలో ఉండే శత్రు సైన్యంలోకి దూసుకు పోయేవారు. ఎందుకంటే షహీద్ అయితే స్వర్గం. ఆ విధంగా విశ్వాసుల ఏకైక లక్ష్యం - స్వర్గం.

పిల్లలు రాత్రి పగలు కష్టపడినట్లు, టెన్షన్ పడినట్లు, ఇహలోకంలో ఇస్లామ్ ప్రకారం కష్టపడితే స్వర్గం లభిస్తుందా? పిల్లలకు మంచి ర్యాంకు రావాలి మరియు సీట్లు పరిమితం. కాని మంచి ఆచరణలతో అల్లాహ్ మార్గంలో ఎందరు కష్టపడినా, అల్లాహ్ కరుణిస్తే, వారందరికీ స్వర్గం గ్యారంటీ.

వాస్తవానికి అల్లాహ్ మార్గంలో స్థిరంగా విశ్వాసంతో బ్రతుకుతూ, ఖుర్ఆన్ మరియు సున్నత్‌ల ఆదేశాల ప్రకారం జీవించే ప్రతీ వ్యక్తి సంతోషంగా జీవిస్తాడు, కష్టాలలోనూ మరియు సుఖాలలోనూ కూడా.

పూర్తిగా పగలే ఉన్నా, పూర్తిగా రాత్రి మాత్రమే ఉన్నా ఇబ్బందేగాని సంతోషం ఉండదు. కాబట్టి జీవితంలో కష్టాలు మరియు సుఖాలు రెండూ ఉండాలి. కష్టం తరువాత సుఖం ఉంది అని అల్లాహుతాలా ఖుర్ఆన్‌లో స్పష్టం చేశారు.

ఈ పై కారణాల వలన స్వర్గం మరియు నరకం గురించి సీరత్‌లో ప్రాముఖ్యత నివ్వడం జరిగింది.

స్వర్గాన్ని పొందిన విశ్వాసులు స్వర్గంలో ధరించే దుస్తులు, అభరణాల గురించి 35:33, 76:21, 18:31 ఆయత్‌లలో చూడండి.

స్వర్గవాసుల సమావేశాలు మరియు సంభాషణల గురించి క్రింది ఖుర్ఆన్ ఆయత్‌లు వివరిస్తున్నాయి.

> అప్పుడు వారు ఒకరివైపు కొకరు మరలి, పరస్పరం ఇలా ప్రశ్నించు కుంటారు. వారిలో ఒకడు అంటాడు : "వాస్తవానికి (భూలోకంలో) నాకొక స్నేహితుడు (ఖరీనున్) ఉండేవాడు.
>
> అతడు నన్ను ఇలా అడిగేవాడు: ఏమీ? నీవు కూడా (పునరుత్థానాన్ని) నిజమేనని నమ్మేవారిలో ఒకడివా? ఏమీ? మనం చనిపోయి మట్టిగా ఎముకులుగా మారిపోయిన తరువాత కూడా నిశ్చయంగా, మనకు ప్రతిఫలమనేది ఉంటుందా?"
>
> అతడు ఇంకా ఇలా అంటాడు : ఏమీ? మీరు అతనిని చూడదలచు కున్నారా? తరువాత అతడు తొంగి చూసి, అతనిని (తన పూర్వ స్నేహితుడ్ని) భగభగమండే నరకాగ్ని మధ్యలో చూస్తాడు.
>
> అతనితో (ఆ స్నేహితునితో) అతడు అంటాడు : "అల్లాహ్ సాక్షిగా! నీవు నన్ను నాశనం చేసి ఉండేవాడివే! ఒకవేళ నా ప్రభువు అనుగ్రహమే లేకున్నట్లయితే! నేను కూడా (నరకానికి) హాజరు చేయబడిన వారిలో చేరిపోయేవాడిని."
>
> (తరువాత ఆ స్వర్గవాసి తన సహచరులతో అంటాడు) : "ఏమీ? ఇక మనం మరల చనిపోము కదా? మన మొదటి (భూమిలో) మరణం తప్ప! మనకు ఎలాంటి శిక్ష పడదు కదా?" నిశ్చయంగా, ఇదే ఆ గొప్ప సాఫల్యం. (ఖుర్ఆన్ 37:50-61)

**స్వర్గవాసుల భార్యలు :**

ఇహలోకంలో ఒక విశ్వాసి యొక్క భార్య కూడా విశ్వాసం కలిగి ఉంటే, పరలోకంలో కూడా ఆమె అతనికి భార్య అవుతుంది.

"వారు మరియు వారి భార్యలు చల్లని నీడలలో, ఆసనాల మీద హాయిగా కూర్చుని ఉంటారు." (ఖుర్ఆన్ 36:56)

"మీరు మరియు మీ భార్యలు సంతోషంగా స్వర్గంలో ప్రవేశించండి." (ఖుర్ఆన్ 43:70)

**అల్-హూర్ అల్-'ఈన్ :**

"ఇలా ఉంటుంది వారి స్థితి! మరియు మేము వారిని అందమైన, ప్రకాశవంతమైన కళ్ళుగల వారి (హూర్‌ల)తో వివాహం చేయిస్తాము." (ఖుర్ఆన్ 44:54)

హూర్ అనే పదం 'హూరా' అనే పదానికి బహువచన పదం. హూరా అంటే అందమైన కళ్ళుగల స్త్రీ. కంటిలో ఉండే తెలుపు అత్యంత తెలుపుగానూ, నలుపు అత్యంత నలుపుగానూ ఉంటుంది. 'ఈన్ అనేది 'ఐనా అనే పదానికి బహువచన పదం. దాని అర్థం వెడల్పయిన కళ్ళు.

"మరియు వారిని (నిర్మలమైన) కన్యలుగా చేశాము. వారు ప్రేమించేవారుగానూ, సమ వయస్సుగలవారు గానూ (ఉంటారు) (ఖుర్ఆన్ 56:35-37)

"అందులో తమ దృష్టిని ఎల్లప్పుడూ క్రింద ఉంచే నిర్మల కన్యలు ఉంటారు. వారిని ఇంతకు పూర్వం ఏ మానవుడు గానీ, ఏ జిన్న్ గానీ తాకి ఉండడు." (ఖుర్ఆన్ 55:56)

"మరియు అందమైన కన్నులుగల సౌందర్యవతులు దాచబడిన ముత్యాల వలే!" (ఖుర్ఆన్ 56:22,23)

"అందులో తమ దృష్టిని ఎల్లప్పుడూ క్రిందికి వంచే నిర్మల కన్యలు ఉంటారు. వారిని ఇంతకు పూర్వం ఏ మానవుడుగానీ, ఏ జిన్న్ గాని తాకి ఉండడు. అయితే వారిరువురు మీ ప్రభువు యొక్క ఏయే అనుగ్రహాలను నిరాకరిస్తారు? వారు కెంపులను మరియు పగడాలను పోలి ఉంటారు." (ఖుర్ఆన్ 55:56-68)

## స్వర్గం కోసం హదీస్‌లలో ఉన్న కొన్ని వర్ణనలు :

ము'ఆజ్ బిన్ జబల్ (రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు : "స్వర్గ వాసులు శారీరక వెంట్రుకలు లేకుండా తమ కండ్లపై కుహ్లాతో, 30 సంవత్సరాల వయస్సు లేదా 33 సంవత్సరాల వయస్సుతో స్వర్గంలో ప్రవేశిస్తారు. (తిర్మిజీ, సహీహ్, 2545, పుస్తకం 36, అధ్యా. 12, సంపుటి 4)
*(శరీరంపై వెంట్రుకలు లేకుండా అంటే గడ్డంపై వెంట్రుకలు లేని యవ్వనం లేక చాలా సుందరమైన)*

అలీ(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: "వాస్తవానికి స్వర్గంలో నివాసాలు ఉంటాయి. వాటి వెలుపల స్పష్టంగా చూడబడుతుంది లోపలి నుండి. మరియు వాటి లోపల (భాగం) చూపబడుతుంది వెలుపలి నుండి. ఒక ఎడారివాసి లేచి అడిగాడు : "ఎవరి కొరకు ఓ అల్లాహ్ యొక్క ప్రవక్తా?" ఆయన(స) చెప్పారు : "వారి కొరకు, మంచిగా మాట్లాడే వారికి, ఇతరులకు తినిపించేవారికి, క్రమం తప్పకుండా ఉపవాసాలు ఉండేవారికి మరియు అల్లాహ్ కోసం రాత్రివేళ సలాత్ చేసేవారికి ప్రజలు నిద్రిస్తుండగా." **(తిర్మిజీ, హసన్, 2527, పుస్తకం 36, అధ్యా. 3, సంపుటి 4)**

---

ఉబాదహ్ బిన్ అస్సామిత్ ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) చెప్పారు : స్వర్గంలో 100 స్థాయిలుంటాయి. ప్రతీ రెండు స్థాయిల మధ్యలో ఉండే దూరం, ఆకాశాలకి మరియు భూమికి మధ్య ఉండే దూరాన్ని పోలి ఉంటుంది. అల్-ఫిర్‌దౌస్ స్వర్గంలో కెల్లా ఉన్నత స్థానం మరియు దాని నుండి నాలుగు స్వర్గ నదులు ముందుకు ప్రవహింప చేయబడతాయి. మరియు దానిపై అర్ష్ ఉంటుంది. కాబట్టి మీరు అల్లాహ్‌ను అడిగినప్పుడు, ఆయనను అడగండి అల్-ఫిర్‌దౌస్ కొరకు"
**(తిర్మిజీ, సహీహ్, 2531, పుస్తకం 36, అధ్యా.4, సంపుటి 4)**

---

అబూ అయ్యూబ్ (రజి)వారి ఉల్లేఖనం. ఓ ఎడారివాసి ప్రవక్త(స) వారి వద్దకు వచ్చి చెప్పాడు : "ఓ రసూలల్లాహ్! వాస్తవానికి నాకు గుర్రాలంటే ఇష్టం. స్వర్గంలో గుర్రాలు ఉంటాయా?" అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) చెప్పారు : "నీవు స్వర్గంలోకి ప్రవేశపెట్టబడితే, నీవు కెంపు రంగులో రెండు రెక్కలతో ఉన్న గుర్రం దగ్గరికి తీసుకు రాబడతావు. నీవు దానిని అధిరోహిస్తావు. తరువాత అది నీతో ఎగురుతుంది నీవు కోరిన చోటుకి."
**(తిర్మిజీ, హసన్, 2544, పుస్తకం 36, అధ్యా. 11, సంపుటి 4)**

---

అబూ స'ఈద్ ఖుద్రీ ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు:

స్వర్గవాసులు వారిపైన ఉండే ఉన్నత స్థానాన్ని చూస్తారు, మీరు తూర్పునగాని, పడమర గాని చాలా దూరంగా ప్రకాశిస్తున్న నక్షత్రాన్ని చూస్తున్నట్లు, వారి మధ్య స్థాయిలో ఉండే బేధం వలన."

వారు అడిగారు "ఓ రసూలల్లాహ్(స)! అది ఎవరూ పొందని ప్రవక్తల హోదా?"

ఆయన(స) చెప్పారు : "లేదు, ఆయన సాక్షి ఎవరి చేతులలో నా ఆత్మ ఉందో! వారు అల్లాహ్‌ను విశ్వసించినవారు మరియు

సందేశహరులను విశ్వసించినవారు.''
(సహీహ్ ముస్లిమ్, 7144, పుస్తకం 51, అధ్యా.3, సంపుటి 7)

అబూ సయీద్ ఖుద్రీ మరియు అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు: పిలిచేవాడు పిలుస్తాడు : ''మీకు వాగ్దానం చేయబడింది ఏమిటంటే, మీరు ఆరోగ్యంగా ఉంటారు మరియు ఎన్నటికీ అనారోగ్యాన్ని పొందరు, మీరు జీవిస్తారు మరియు ఎన్నటికీ చనిపోరు, మీరు యవ్వనంలోనే ఉంటారు మరియు ఎన్నటికీ ముసలివారు కారు, మీరు భోగాన్ని అనుభవిస్తారు మరియు ఎన్నటికీ విచారపడరు.'' ఇదే అల్లాహుతాలా చెప్పారు : ''... అపుడు వారికి ఒక వాణి వినబడు తుంది : 'మీరు చేస్తూ ఉండిన సత్కార్యాలకు ఫలితంగా, మీరు వారసులుగా చేయబడిన స్వర్గం ఇదే!' (ఖుర్ఆన్ 7:43)''
(సహీహ్ ముస్లిమ్, 7157, పుస్తకం 51, అధ్యా. 8, సంపుటి 7)

## స్వర్గవాసులకు మేలైనది ఇవ్వబడుతుంది

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు :

''స్వర్గవాసులు స్వర్గంలో ప్రవేశించినప్పుడు అల్లాహుతాలా అడుగుతారు, 'మీరు కోరతారా అదనంగా ఏదైనా?'
వారు అంటారు, 'మీరు మా ముఖాలను తెల్లగా చేయలేదా? మీరు మమ్మల్ని స్వర్గంలో ప్రవేశపెట్టలేదా మరియు నరకాగ్ని నుండి రక్షించలేదా?'
ఆయన పరదా తొలగిస్తారు మరియు వారికి ఏదీ ఇవ్వబడలేదు బాగా ఇష్టమైనది తమ ప్రభువు (అజ్జ వజల్ల)ను చూడటం కంటే.''

ఈ హదీస్ ఉల్లేఖనాలలో ఒక దాని చివర, ప్రవక్త(స) క్రింది ఆయత్ పఠించారు :

**''మంచి పనులు చేసిన వారికి, మంచి ఫలితం దొరుకుతుంది మరియు ఇంకా ఎక్కువ లభిస్తుంది. మరియు వారి ముఖాలు నల్లబడవు మరియు వారికి అవమానమూ జరగదు. అలాంటి వారు స్వర్గవాసులు, వారందులో శాశ్వతంగా ఉంటారు.''** (ఖుర్ఆన్ 10:26)
(సహీహ్ ముస్లిమ్, 449, సంపుటి 1)

అబూ స'ఈద్ ఖుద్రీ ఉల్లేఖనం : ప్రవక్త(స)వారు చెప్పారు : అల్లాహుతాలా స్వర్గవాసులతో అంటారు, ''ఓ స్వర్గవాసులారా!''
వారు చెబుతారు : ''హాజరయ్యాము ఓ మా ప్రభూ! మరియు మంచి మీ కోసమే. మరియు మంచి అంతా మీ చేతిలో ఉంది.''
ఆయన అడుగుతారు ''మీరు తృప్తి పొందారా?''
వారు చెబుతారు : ''మేమెందుకు తృప్తి పడలేకుండా ఉంటాము, ఓ ప్రభూ. మీరు మాకు ఇచ్చినది మీ సృష్టిలో వేరెవరికీ ఇవ్వలేదు''
ఆయన అడుగుతారు : ''నేను మీకు ఏదైనా ఇవ్వనా దాని కంటే సైతం మేలైనది?''
వారు చెబుతారు : ''ఓ ప్రభూ! ఏది దానికంటే మేలైనది?''
ఆయన చెబుతారు : ''నేను మీపై నా ప్రసన్నతను అనుగ్రహించాను మరియు దీని తరువాత నేనెన్నటికీ మీపై ఆగ్రహించను''
**(సహీహ్ ముస్లిమ్, 7140, అధ్యా.2, పుస్తకం 51, సంపుటి 7)**

పునరుత్థాన దినం నాడు ఎన్నో భయానక సంఘటనలు చూస్తారు. వాటిలో చిట్ట చివరిది సిరాత్. (అది నరకాగ్నిపై ఏర్పాటు చేసి ఉంటుంది. దానిని క్షేమంగా దాటినవారు స్వర్గంలో ప్రవేశిస్తారు). తరువాత, వారి నుండి మొత్తం దు:ఖాన్ని తొలగించిన తరువాత, అల్లాహ్ వారిని స్వర్గంలో ప్రవేశింప జేస్తారు. అల్లాహ్ తమ కొరకు సిద్ధం చేసిన దానిని చూసి, వారు అల్లాహ్ ఘనతను కీర్తిస్తారు.

''శాశ్వతమైన స్వర్గ వనాలలో వారు ప్రవేశిస్తారు. అందులో వారు బంగారు కంకణాలు మరియు ముత్యాలతో అలంకరింప బడతారు. మరియు వారి వస్త్రాలు పట్టుతో చేయబడి ఉంటాయి. మరియు (అప్పుడు) వారు ఇలా అంటారు : **''మా నుండి దు:ఖాన్ని తొలగించిన అల్లాహ్‌యే సర్వస్తోత్రాలకు అర్హుడు.** నిశ్చయంగా మా ప్రభువు క్షమాశీలుడు, కృతజ్ఞతలను ఆమోదించేవాడు. (ఖుర్ఆన్ 35:33,34)''

## స్వర్గ వనాలలో వారి మనవికి ముగింపు ''సర్వ స్తోత్రాలకు అర్హుడు, సమస్త లోకాల పోషకుడైన అల్లాహ్ మాత్రమే''

అందులో వారి ప్రార్థన ''ఓ అల్లాహ్! నీవు సర్వలోపాలకు అతీతుడవు.'' అని మరియు వారి అభినందనం : ''అస్సలాము అలైకుమ్'' అని మాత్రమే ఉంటాయి. మరియు వారు తమ ప్రార్థనలను : ''సర్వ స్తోత్రాలకు అర్హుడు, సమస్త లోకాల పోషకుడైన అల్లాహ్ మాత్రమే'' అని ముగించుకుంటారు. (ఖుర్ఆన్ 10:10)

## ఇహలోక కష్టాలకు ఫలితం - ఉత్తమ భవిష్యత్తు - శాశ్వత స్వర్గం.

అనస్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : ''స్వర్గం కష్టాలతో పరివేష్ఠించబడి ఉంటుంది.మరియు నరకాగ్ని కోరికలతో పరివేష్ఠించబడి ఉంటుంది. **(తిర్మిజీ, 2559, అధ్యా. 21, పుస్తకం 36, సంపుటి 4)**

నరకానికి సంబంధించి ఖుర్ఆన్ మరియు హదీస్‌లలో వివరించ బడిన కొన్ని వర్ణనలను ఇన్షా అల్లాహ్ రాబోవు సంచికలో అందిస్తాము.

**(ఇన్షా అల్లాహ్ మరికొంత భాగం వచ్చే సంచికలో ...)**

# జిన్నాలు మరియు చేతబడి

8 సీరియల్

## మనిషికుండే బలహీనతలే కొందరికి జీవనాధారం

*శారీరక లేదా మానసిక సమస్యలతో బాధపడేవారు సంబంధిత డాక్టర్‌ని సంప్రదించండి.*

ఈ శీర్షికను రెండు భాగాలుగా అందించాలని ప్రారంభించాము. మొదటి భాగంలో అందించాలని అనుకున్న అంశాలు : జిన్నులు మరియు షైతాన్‌ల గురించి ఖుర్‌ఆన్ మరియు హదీస్‌ల ద్వారా తెలియజేయడం మరియు మానసిక ఆరోగ్యానికి సంబంధించిన కొన్ని ప్రాథమిక విషయాలు. ఇక రెండవ భాగంలో తెలియజేయ వలసిన విషయం - చేతబడి. ఇది కూడా ఇస్లామ్ పరిధిలోనే తెలియ జేయవలసి ఉంది. మొదటి భాగం దాదాపు పూర్తయింది.

జిన్నులు అంటే ఏమిటి? షైతాన్‌లు అంటే ఏమిటి? షైతాన్‌లు మనుషులలో కూడా ఉంటారా? మొదలైన ఎన్నో సందేహాలకు స్పష్టంగా వివరణ ఇచ్చిన తరువాత, వాటి గురించి ఆందోళన పడవలసిన అవసరం లేకుండా ముహమ్మద్(స)వారు నేర్పిన దు'ఆలను అందించాము.

మన చూపు, వినికిడి మరియు ఇతర ఇంద్రియాల పరిధి కొంతవరకే ఉంటుంది. మనకు తెలియనివి ఎన్నో ఉన్నాయి. **ఆ అగోచర విషయాల వెనక పడవలసిన అవసరం మనకు ఎంతమాత్రం లేదు.** అటువంటి వాటి వలన సమస్యలు వచ్చాయని ఎవరైనా భావిస్తే, వాటి పరిష్కారం కొరకు ఎవరి దగ్గరికో పరుగెట్టవలసిన అవసరం కూడా ఎంత మాత్రం లేదు.

ఇంట్లో ఏవో ఉన్నాయని రాత్రుళ్ళు భయపడేవారున్నారు. ఇంట్లో మనకు ఇబ్బంది పెట్టేవి చాలా ఉండవచ్చు. ఉదాహరణకు దోమలు, ఎలుకలు, తేళ్ళు మొదలైనవి. ఇవి కళ్ళకు కనిపిస్తాయి. అయితే మనల్ని అనారోగ్యం పాలుచేసే ఎన్నో క్రిములు మన కళ్ళకు కనిపించవు. వీటి వలన కలిగే కీడుకంటే, షైతాన్ వలన కలిగే కీడు గురించే ఎక్కువగా ప్రజలు భయపడుతుంటారు.

ఎందుకంటే భౌతిక అనారోగ్యాన్ని నయం చేయడానికి డాక్టర్లు ఉన్నారని, వారి దగ్గరికి వెళ్ళి ట్రీట్‌మెంట్ పొందవచ్చనే అవగాహన సాధారణ ప్రజలలో ఉంది. కాని మానసిక అనారోగ్యానికి కూడా ట్రీట్‌మెంట్ ఉందనే విషయంపై వారిలో సరియైన అవగాహన లేదు. మనం దానిని వారిలో కల్పించ వలసి ఉంది. ఇస్లామ్ దవా (మెడిసిన్) మరియు దు'ఆ (ప్రార్థన) రెండింటి గురించి బోధించింది. ఇస్లామ్‌పై అవగాహన ఉంటే ఏ భయాలూ ఉండవు.

మన దృష్టికి మరియు వినికిడికి పరిమితులు ఏర్పాటు చేయడం కూడా అల్లాహ్ కారుణ్యంలో ఒక భాగమే. లేకపోతే మనం ప్రశాంతంగా జీవించలేము. కనిపించని అన్ని కీడుల నుండి రక్షణ కోసం అల్లాహుతాలా తన ప్రవక్త ద్వారా మనకు అన్ని విషయాలు తెలియ జేశారు. ఇంతకు పూర్వం ఈ శీర్షికలో అందించిన వ్యాసాలలో అవన్నీ స్పష్టంగా వివరించ బడ్డాయి.

**ముహమ్మద్(స)వారి సంప్రదాయం ఏమిటంటే, ప్రజలను భయానికి మరియు ఆందోళనకు గురిచేయకూడదు. అయితే జరిగే కీడు వారికి తెలియకుండానే తొలగిపోవాలి.**

ఖుర్‌ఆన్ మరియు సున్నత్ ప్రకారమే భూతవైద్యం చేస్తున్నామని చెప్పేవారున్నారు. ముందుగా వారు ప్రజలలో భయాందోళనలు పెంచుతున్నారు. మరి వారి ఆచరణలో సున్నత్ లేనట్లే కదా!

కాబట్టి 'శాంతిబాట' ఈ శీర్షిక విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకొని ప్రామాణిక ఆధారాల ద్వారా ఆ భయాందోళనలను వారి మనస్సుల నుండి తొలగించాలని అల్లాహ్ పేరుతో ప్రయత్నం చేస్తోంది. పాఠకులకు స్పష్టంగా అర్థం అయ్యేందుకు, అగోచరంగా ఉండే వాటి ద్వారా జరగడానికి అవకాశం ఉండే కీడును 4 రకాలుగా విభజించడం జరిగింది.

ఆ నాలుగింటిలో మొదటి రెండు రకాలు ఎవరి ప్రమేయం లేకుండా షైతాన్ వలన జరిగే కీడుకు సంబంధించినవి.

చివరి రెండు రకాలు ఒక వ్యక్తి లేదా వ్యక్తుల ప్రమేయం వలన జరిగే కీడుకు సంబంధించినవి.

**ఎవరి ప్రమేయం లేకుండా షైతాన్ వలన కలిగే కీడు**

1. మనం స్పృహలో ఉన్నప్పుడు
2. నిద్రలో ఉన్నప్పుడు

**మరొక వ్యక్తి ప్రమేయం వలన కలిగే కీడు**

3. ఆ వ్యక్తికి తెలియకుండానే అతని వలన జరిగే కీడు
4. ఆ వ్యక్తి కావాలని జరిపించే కీడు.

**1. మనం స్పృహలో ఉన్నప్పుడు** : ఇంటిలో ప్రవేశించేటప్పుడు 'అస్సలాము

అలైకుమ్' చెప్పాలి మరియు ఏదైనా తినే ముందు, త్రాగే ముందు 'బిస్మిల్లాహ్' అని చెప్పాలి. ఉదయం మరియు సాయంత్రం నిర్ణీత సంఖ్యలో చేసే పఠనం చేయాలి. ఉదాహరణకు 'సుబహానల్లాహి వబిహమ్దిహి సుబహానల్లాహిల్ అజీమ్' (100 సార్లు).

**2. నిద్రలో ఉన్నప్పుడు జరిగే కీడు నుండి రక్షణ :** నిద్రకు ఉపక్రమించే ముందు కొన్ని దు'ఆలు పఠించాలి. కల రూపంలో ఆందోళన కలిగినప్పుడు, ముహమ్మద్(స)వారు చెప్పినట్లు పాటిస్తే, ప్రశాంతంగా నిద్రపోవచ్చు. సంబంధిత దు'ఆల కోసం ముందరి వ్యాసాలు చదవండి.

**3. ఒక వ్యక్తికి తెలియకుండానే అతని చూపువలన కలిగే కీడు** - అల్-అయ్న్. ఈ విషయానికి సంబంధించి పూర్తి వివరాలు మరియు నివారణ కోసం దు'ఆలు క్రిందటి వ్యాసంలో అందించాము.

**4. కావాలని జరిపించే కీడు :** ఇదే జాల విద్య (చేతబడి). భార్యాభర్తల మధ్య ఎడబాటు రావడానికి, వారు శారీరకంగా కలవకుండా చేయడానికి, ఇంకా ఎన్నో రకాల కలతలను కలిగించడానికి ప్రయోగించే విద్య ఇది. దీని గురించి ఈ వ్యాసంలో కొన్ని వాస్తవాలు అందిస్తున్నాము..

## చేతబడి سِحْرٌ (Witchcraft)

**ఈ విషయంలో కూడా ప్రజలు తమంతట తాము ఏ విధంగా ఈ కీడు నుండి రక్షించుకోవచ్చో చాలా సులభంగా మరియు స్పష్టంగా ముహమ్మద్(స) వారు వివరించారు.**

ఈ చేతబడిపై ఎన్నో కల్పిత కథలు ప్రచారంలో ఉన్నాయి. ఎన్నో సినిమాలు వచ్చాయి. తెలిసీ తెలియక ఎన్నో అపోహలకు లోనైన వారున్నారు. కాబట్టి పైసా పెట్టుబడి లేకుండా **లక్షలు, కోట్లు సంపాదించుకోవాలనుకునే వారికి ఇది పెద్ద వ్యాపారం అయింది.** మన దేశంలోనే కాదు, పాశ్చాత్య దేశాలలో కూడా ఖరీదైన వ్యాపారం ఇది.

ఈ విషయంలో మేము అందించే వివరాలు కేవలం ఖుర్'ఆన్ మరియు సున్నత్‌ల పరిధిలోనే ఉంటాయి. ఇతరత్రా విషయాలను చర్చించ దలచుకోలేదు.

**ముందుగా ఈ చేతబడి (జాలవిద్య) గురించి ఖుర్'ఆన్‌లో ఏమి చెప్పబడిందో తెలుసుకుందాం:**

"మరియు వారు సులైమాన్ రాజ్య కాలంలో షైతాన్‌లు పఠించే దానిని (జాలవిద్యను) అనుసరించారు. సులైమాన్ సత్య తిరస్కారి కాలేదు. కానీ నిశ్చయంగా, షైతాన్‌లు సత్యాన్ని తిరస్కరించారు. వారు బాబిలోన్ నగరమందు హారూత్, మారూత్ అనే ఇద్దరు దేవదూతల ద్వారా తేబడిన జాలవిద్యను ప్రజలకు నేర్పుచుండిరి. ఎవరికైనా ఈ విద్యను నేర్పేటప్పుడు, వారిద్దరూ ఇలా చెప్పేవారు : "నిశ్చయంగా, మేము (మానవులకు) ఒక పరీక్ష! కాబట్టి మీరు (ఈ జాలవిద్యను నేర్చుకుని) సత్యతిరస్కారులు కాకండి." అయినప్పటికీ వారు (ప్రజలు), భార్యాభర్తలకు ఎడబాటు కలిగించే (జాలవిద్య) వారిద్దరి దగ్గర నేర్చుకునేవారు. మరియు అల్లాహ్ అనుమతి లేనిదే, దాని ద్వారా ఎవరికీ ఏమాత్రం హాని కలిగించ లేరు. మరియు వారు నేర్చుకునేది, వారికి నష్టం కలిగించేదే. కాని లాభం కలిగించేది ఎంతమాత్రం కాదు. మరియు వాస్తవానికి దానిని (జాలవిద్యను) స్వీకరించే వానికి పరలోక సౌఖ్యాలలో ఏమాత్రం భాగం లేదని వారికి బాగా తెలుసు. మరియు వారు ఎంతో తుచ్ఛమైన సొమ్ముకు బదులుగా తమను తాము అమ్ముకున్నారు! ఇది వారికి తెలిస్తే ఎంత బాగుండేది!" (ఖుర్'ఆన్ 2:102)

పై ఆయత్ ద్వారా మూడు ముఖ్య విషయాలు తెలుస్తున్నాయి.

1. **జాల విద్య ఉంది**
2. **అది భార్యాభర్తల మధ్య ఎడబాటు కలుగజేస్తుంది**
3. **అల్లాహ్ అనుమతి లేనిదే, దాని ద్వారా ఎవరికీ ఏ మాత్రం హాని కలిగించలేరు.**

మరో ఆయత్ :

"వారు విసరగానే మూసా : "మీరు విసిరింది మంత్రజాలం. నిశ్చయంగా, అల్లాహ్ దానిని భంగపరుస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ దౌర్జన్యపరుల కార్యాలను చక్కబడనివ్వడు. మరియు అల్లాహ్ తన ఆజ్ఞతో సత్యాన్ని సత్యంగా నిరూపిస్తాడు, అది అపరాధులకు ఎంత అసహ్యకరమైనా సరే!" (ఖుర్'ఆన్ 10:81-82)

**పై మూడు ఆయత్‌ల ద్వారా స్పష్టమయ్యేదేమిటంటే :**

**అల్లాహ్‌పై విశ్వాసం గలవారు మంత్రజాలానికి భయపడ నవసరం లేదు. ఆయన దానిని భంగపరుస్తాడు.**

మూసా(అ)వారిపై కూడా మంత్రవిద్యను ప్రయోగించారు. కాని అల్లాహ్ అనుగ్రహంతో ఆయన దానిని ఎదుర్కొన్నారు. మాంత్రికులు సత్యాన్ని స్వీకరించారు.

వారు (మాంత్రికులు) ఇలా అన్నారు : "ఓ మూసా! నీవు విసురుతావా, లేదా మేము మొదట విసరాలా?" (మూసా) అన్నాడు : "లేదు! మీరు (ముందు) విసరండి!" అప్పుడు అకస్మాత్తుగా వారి త్రాళ్ళు మరియు వారి కర్రలూ - వారి మంత్రజాలం వల్ల - **అతనికి (మూసాకు) చలిస్తూ ఉన్నట్లు కనిపించాయి. దానితో మూసాకు, తన మనస్సులో కొంత భయం కలిగింది.** మేము (అల్లాహ్) అన్నాము : **"భయపడకు! నిశ్చయంగా నీవే ప్రాబల్యం పొందుతావు."** "నీ కుడిచేతిలో ఉన్నదానిని విసురు! అది వారు కల్పించిన వాటిని మ్రింగివేస్తుంది. వారు కల్పించింది నిశ్చయంగా మాంత్రికుని తంత్రమే!మరియు **మాంత్రికుడు ఎన్నడూ సఫలుడు కానేరడు. వాడు ఎటునుంచి, ఎలా వచ్చినా సరే!"** అప్పుడు ఆ మాంత్రికులు సజ్దాలో పడుతూ అన్నారు:

"మేము హారూన్ మరియు మూసాల ప్రభువును విశ్వసించాము."
(ఖుర్'ఆన్ 20:65-70)

అల్లాహ్ ఖుర్'ఆన్‌లో ఎంతో స్పష్టంగా చెప్పిన తరువాత కూడా మనం ఎందుకు భయపడాలి? క్రింది ఆయత్ చూడండి.

> ఇలా అను : "నేను ఉదయకాలపు ప్రభువు (అల్లాహ్) శరణు వేడుకుంటున్నాను. ఆయన సృష్టించిన ప్రతిదాని కీడునుండి. మరియు చిమ్మ చీకటి కీడు నుండి, ఎప్పుడైతే అది కమ్ము కుంటుందో! మరియు **ముడుల మీద మంత్రించి ఊదేవారి కీడునుండి.** మరియు అసూయ పరుడి కీడు నుండి, ఎప్పుడైతే అతడు అసూయపడతాడో! (ఖుర్'ఆన్ 113:1-5)

విశ్వాసులకు ఆదర్శంగా ఉండే ప్రవక్తల పైనే మంత్రజాల విద్య ప్రయోగించ బడింది. కాబట్టి అది మనపై ప్రయోగించ బడుతుంది అనడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. అప్పుడు మనం ఏమి చేయాలి? మన ప్రవక్త(స) బోధించిన దాని ప్రకారం ఆచరిస్తే సరిపోతుంది.

మన ప్రియ ప్రవక్త ముహమ్మద్(స)వారిపై కూడా చేతబడి చేశారు. ఈ విషయానికి సంబంధించి ఓ ప్రామాణిక హదీస్‌ను దిగువున ఇస్తున్నాము.

**ఆయిషా(రజి)వారి ఉల్లేఖనం** : అల్లాహ్ యొక్క సందేశహరులు(స)కు చేతబడి చేయబడింది, ఆయన తన భార్యలను శారీరకంగా కలుసుకోకపోయినా కలుసుకున్నానేమోనని అనుకునే విధంగా. **(ఈ హదీసు ఉల్లేఖకుల్లో ఒకరైన సుఫ్యాన్ చెప్పారు : 'అటువంటి ప్రభావం కలిగిందంటే అది చాలా తీవ్రమైన చేతబడి')** తరువాత ఒక రోజు ఆయన(స) చెప్పారు, 'ఓ ఆయిషా! నీకు తెలుసా? అల్లాహ్ నాకు సూచించినది నేను ఆయనను అడిగిన దానికి సంబంధించి. ఇద్దరు వ్యక్తులు నా దగ్గరకు వచ్చారు. మరియు వారిలోని ఒకరు నా తల దగ్గరగా కూర్చున్నారు మరియు మరొకరు నా పాదాల దగ్గర కూర్చున్నారు.

నా తల దగ్గరి వ్యక్తి రెండవ వ్యక్తిని అడిగాడు '**ఈయనకు ఏమైంది?**'
రెండవ వ్యక్తి సమాధాన మిచ్చాడు '**ఈయన చేతబడి ప్రభావంలో ఉన్నారు**'.
మొదటాయన అడిగారు, "**ఆయనపై ఎవరు చేతబడి చేశారు?**"
రెండవ వ్యక్తి సమాధానమిచ్చాడు, **'లబీద్ బిన్ అల్ అ'సమ్** (బనీ జురైక్ తెగకి చెందిన వాడు, యూదుల మిత్రపక్షంవాడు మరియు మునాఫిక్ (కపట విశ్వాసి))
మొదటి వ్యక్తి అడిగాడు 'ఏ పదార్థాన్ని **(అతడు వాడాడు)?**'
రెండవ వ్యక్తి సమాధానమిచ్చాడు '**ఒక దువ్వెన మరియు దువ్వెనలో చిక్కుకున్న వెంట్రుకలు**'.
మొదటి వ్యక్తి అడిగాడు, '**ఎక్కడ** (ఉందది)?'
రెండవ వ్యక్తి సమాధానమిచ్చాడు, **జర్వాన్ బావిలో రాతిక్రింద పోతు ఖర్జూరపు చెట్టు గుత్తిపొరలో ఉంచాడు.**
కాబట్టి ప్రవక్త(స)వారు ఆ బావి దగ్గరకు వెళ్ళారు మరియు ఆ వస్తువులను తీయించారు. మరియు చెప్పారు, "ఇదే బావి నాకు (కలలో) చూపబడింది. దాని నీరు గోరింటాకు నానబెట్టిన నీరులా ఉంది. అక్కడి ఖర్జూర చెట్లు కూడా పిశాచ తలలు మాదిరిగా కనిపించాయి. ప్రవక్త(స) ఇంకనూ (ఇలా) చెప్పారు : "తరువాత అది తీసివేయబడింది". నేను (ప్రవక్త(స)తో) చెప్పాను, "మీరు స్వయంగా చేతబడికి విరుగుడు ఎందుకు చేయలేదు?". ఆయన చెప్పారు, "**అల్లాహ్ నాకు స్వస్థత చేకూర్చారు**. నా ప్రజల మధ్య చెడు వ్యాపించడాన్ని నేను ఇష్టపడను." అని అన్నారు.
(సహీహ్ బుఖారీ, **5765,** పుస్తకం 76, అధ్యా. 7, సంపుటి 7)

حدَّثَني عَبْدُ اللهِ بنُ مُحَمَّدٍ قَالَ : سَمِعْتُ ابنَ عُيَيْنَةَ يَقُولُ: أوَّلُ مَنْ حدَّثَـنا بِهِ ابنُ جُرَيْجٍ، يَقُولُ : حدَّثَنِي آلُ عُرْوَةَ، عَنْ عُرْوَةَ. فَسألْتُ هِشاماً عَنْهُ فَحَدَّثَنا عَنْ أبِيهِ، عَنْ عائِشَةَ رَضِيَ اللهُ عَنْها قَالَتْ : كانَ رَسُولُ اللهِ ﷺ سُحِرَ حتَّى كانَ يَرَى أنَّهُ يَأتِي النِّساءَ ولا يَأتِيهِنَّ. قالَ سُفيانُ : وَهٰذَا أشَدُّ ما يَكُونُ مِنَ السِّحْرِ، إذَا كانَ كَذَا، فَقالَ : ((يا عائِشَةُ، أعَلِمْتِ أنَّ اللهَ قَدْ أفْتانِي فِيما اسْتَفْتَيْتُهُ فِيهِ؟ أتانِي رَجُلان فَقَعَدَ أحَدُهُما عِنْدَ رأسِي، والآخَرُ عِنْدَ رِجْلَيَّ. فَقالَ الَّذِي عِنْدَ رأسِي للآخَرِ : ما بالُ الرَّجُلِ؟ قالَ : مَطْبُوبٌ، قالَ : وَمَنْ طَبَّهُ ؟ قال : لَبِيدُ بنُ الأعْصَمِ رَجُلٌ مِنْ بَنِي زُرَيْق حَلِيفٌ لِيَهُودَ كانَ مُنافِقاً، قالَ : وَفِيم؟ قالَ : فِي مُشْطٍ و مُشاطَةٍ، قالَ : وأيْنَ؟ قالَ: في جُفّ طَلْعَةٍ ذَكَرٍ تَحتَ رَعُوفَةٍ في بِئْرِ ذَرْوَانَ))، قالَتْ: فأتى النَّبِيُّ ﷺ البِئْرَ حَتَّى اسْتَخْرَجَهُ، فَقالَ : ((هٰذِهِ البِئْرُ الَّتِي أُرِيتُها وكأنَّ ماءَها نُقاعَةُ الحِنَّاءِ، وكأنَّ نَخْلَها رُؤُوسُ الشَّياطِينِ))، قالَ: فاسْتُخْرِجَ، قالَتْ: فَقُلْتُ: أفَلا ؟ – أيْ تَنَشَّرْتَ – فَقالَ : ((أما وَ اللهِ فَقَدْ شَفانِي وأكْرَهُ أنْ أُثِيرَ عَلَى أحَدٍ مِنَ النَّاسِ شَرّاً)).

ప్రవక్త(స)వారితో పాటు అలీ బిన్ అబీ తాలిబ్(రజి), జుబైర్ బిన్ అవ్వామ్(రజి) మరియు అమ్మార్ బిన్ యాసిర్(రజి) వెళ్ళారు.

సహాబాలు చాలా వేగంగా నీటిని తోడారు దాని నుండి చేతబడి కోసం వాడిన దానిని తొలగించడానికి. చేతబడికి వాడిన దానిని బయటకి తీశారు. అవి ఒక దారంతో కట్టబడి మరియు 12 ముడులు వేయ బడ్డాయి. ప్రతీ ముడిలో ఒక సూది ఉంచబడింది.

అల్లాహుతాలా తన ప్రవక్త(స)కి అల్-ము'అవ్విజాత్ (ఖుర్'ఆన్‌లోని ఆఖరి రెండు సూరహ్‌లు - ***ఖుల్ అవుజుబి రబ్బిల్ ఫలఖ్*** సూరహ్ మరియు ***ఖుల్ అవుజుబి రబ్బిన్నాస్*** సూరహ్) అవతరింప జేశారు. **ఒకొక్క ఆయత్ పఠిస్తుండగా ఒకొక్క ముడి విడిపోయింది.**

ఈ హదీస్‌లోని కొన్ని మాటలను వక్రీకరించి ఒక మతధర్మం వారు చేసే దుష్ప్రచారం గురించి, మాచే ప్రచురించబడిన "ముహమ్మద్(స) వారిపై ప్రపంచ వ్యాప్తంగా జరుగుచున్న దుష్ప్రచారం" పుస్తకంలో వివరించాము. (మా వెబ్‌సైట్ www.saanthibaata.net లో చదువు కోవచ్చు)

పై హదీస్‌లో ముహమ్మద్(స)వారు ఏమి చెప్పారో చూసారు కదా! ప్రజలను భయాందోళనలకు గురిచేయకూడదు. చేతబడి జరిగిందని మాంత్రికుల దగ్గరకు వెళ్ళనవసరం లేదు. అల్లాహ్ అనుమతి లేకుండా ఎవరూ ఏ హానీ చేయలేరు. కాబట్టి అల్లాహ్‌ను శరణు వేడుకుంటే ఈ చేతబడి నుండి రక్షణ ఉంది.

మూసా(అ)వారు కూడా ఓ క్షణం భయపడ్డారు. కాని అల్లాహ్ చెప్పినట్లు చేశారు. ముహమ్మద్(స)వారు కూడా అల్లాహ్ చెప్పినట్లే చేశారు. కాబట్టి మనం కూడా ఆయన చెప్పినట్లే పఠిస్తే, మనపై మంత్రజాలంతో ఏ మాంత్రికుడూ సఫలుడు కాలేడు. సుళువైన పరిష్కారం ఇది.

ఈ చేతబడి గురించి ఎన్నో విషయాలు చెబుతుంటారు. వాటన్నింటిని ఇక్కడ ప్రస్తావించి సున్నత్‌కు వ్యతిరేకంగా ప్రజలను భయాందోళనకు గురి చేయదలచుకోలేదు. **మన ప్రియప్రవక్త ముహమ్మద్(స)వారు ప్రళయం వరకూ సంభవించే అన్ని రకాల కీడు నుండి మనంతట మనమే స్వయంగా అల్లాహ్‌ను శరణు ఏ విధంగా వేడుకోవాలో నేర్పించి ఈ లోకాన్ని వీడారు.**

**ఖుర్'ఆన్ మరియు సున్నత్‌ల ప్రకారం ఆచరణ గలవారు అల్లాహ్‌కు మాత్రమే భయపడతారు. కాబట్టి వారు ఇక దేనికీ భయపడ నవసరం లేదు.**

ఖుర్'ఆన్ మరియు హదీస్‌ల ద్వారా క్లుప్తంగా చేతబడి ఉనికి గురించి చెప్పుకున్నాం. హారూత్ మరియు మారూత్ అనేవారు చేతబడి నేర్పారని ఖుర్'ఆన్ ఆయత్ ద్వారా తెలుస్తుంది. అయితే ఈ ఆయత్ (2:102) గురించి కొన్ని వివరాలు స్పష్టం చేయవలసి ఉంది. కొందరు వీటిని అపార్థం చేసుకునే అవకాశం ఉంది. అందుకని ఈ ఆయత్ వివరణను తఫ్సీర్ ఇబ్నె కసీర్ నుండి అందిస్తున్నాము.

ఈ చేతబడి అనేది అల్లాహ్ యొక్క ప్రవక్త - సులైమాన్(అ)వారి కంటే ముందునుండే ఉనికిలో ఉంది.

**"వారు సులైమాన్ రాజ్యకాలంలో షైతాన్‌లు పఠించే దానిని (జాల విద్యను) అనుసరించారు."**

ఆయత్ లోని పై భాగంపై అస్-సుద్దీ ఇలా వ్యాఖ్యానించారు:

షైతాన్‌లు ఆకాశాలకు ఎగబాకి అల్లాహ్ యొక్క దూతల సంభాషణలను పొంచి ఉండి వినేవారు, భూమిపై మరణం, ఇతర ఘటనలు లేక అగోచర విషయాల గురించి ఏదైతే సంభాషించారో, ఆ సమాచారాన్ని జ్యోతిష్యులకు షైతాన్‌లు చేరవేసేవారు. మరియు జ్యోతిష్యులు మరల దానిని ప్రజలకు చేరవేసేవారు. జ్యోతిష్యులు తమకు ఏదైతే చెప్పారో దానిని ప్రజలు నిజమని నమ్మేవారు. జ్యోతిష్యులు షైతాన్‌లపై నమ్మకం ఏర్పరచుకున్న తరువాత, అవి వారికి అబద్ధాలు చెప్పడం ప్రారంభించాయి. మరియు ఇతర పదాలను వారు వినిన నిజవార్తలకు కలిపేవారు, నిజమైన ప్రతీ పదానికి 70 అబద్ధపు పదాలను కలిపేవారు. ప్రజలు ఈ పదాలను కొన్ని పుస్తకాలలో వ్రాసేవారు. శీఘ్రంగానే, ఇస్రాయీల్ సంతానం 'జిన్నులకు అగోచర విషయాలు తెలుసు' అని అన్నారు.

సులైమాన్(అ)వారు ప్రవక్తగా పంపబడినప్పుడు, ఆయన ఈ పుస్తకాలను ఓ పెట్టెలో సేకరించి తన సింహాసనం క్రింద పాతి పెట్టించారు. ఏదైనా జిన్న్ ధైర్యం చేసి ఆ పెట్టె దగ్గరకు వచ్చినప్పుడు కాలిపోవడం జరిగేది. సులైమాన్(అ) చెప్పారు, "నేను వినను జిన్నులకు అగోచరాలు తెలుసని పలికే ఎవని మాటలను, కాని వానికి శిరచ్ఛేధం చేస్తాను." సులైమాన్(అ)వారు మరణించి నప్పుడు మరియు సులైమాన్ (అ)వారి గురించి నిజం తెలిసిన జ్ఞానులు కూడా కాలగర్భంలో కలిసిపోయాక, మరో తరం వచ్చింది. (అంటే సులైమాన్(అ)వారు అల్లాహ్ యొక్క ప్రవక్త అని స్పష్టంగా తెలిసినవారు గతించారు).

వారి దగ్గరికి జిన్న్ మానవ రూపంలో వచ్చాడు మరియు ఇస్రాయీల్ సంతానంలోని కొందరితో, "నేను మిమ్మల్ని మీరు ఎన్నటికీ పూర్తిగా ఉపయోగించు కోలేనటువంటి నిధి ఉన్న చోటుకు తీసుకెళ్ళనా?" వారు అన్నారు, 'అలాగే'. అతడు చెప్పాడు, తవ్వండి ఈ సింహాసనం క్రింద. మరియు అతడు వారితో వెళ్ళి సులైమాన్(అ)వారి సింహాసనాన్ని చూపాడు. వారు అతనితో చెప్పారు, 'దగ్గరకు రండి' అతడు అన్నాడు, 'లేదు' మీ కొరకు నేనిక్కడ వేచి ఉంటాను మరియు మీకు నిధి దొరకకపోతే, నన్ను చంపివేయండి." వారు తవ్వారు మరియు భూమిలో పాతి పెట్టిన పుస్తకాలు కనుగొన్నారు. మరియు షైతాన్ వారితో (అబద్ధం) చెప్పాడు, "సులైమాన్(అ) ఈ జాలవిద్యతోనే మానవులు, జిన్నులు మరియు పక్షులను నియంత్రించే వారు." ఆ తరువాత సులైమాన్ (అ)వారు మాంత్రికుడు అనే వార్త ప్రజలలో వ్యాపించింది. మరియు ఇస్రాయీల్ సంతానం ఈ పుస్తకాలను ఆమోదించారు (అంటే ప్రవక్తల పుస్తకాలను వదిలేసారు).

ముహమ్మద్(స)వారు వచ్చిన తరువాత సులైమాన్(అ)వారిని అల్లాహ్ యొక్క ప్రవక్తగా చెప్పినప్పుడు, వారు ఆ పుస్తకాలపై ఆధారపడి ముహమ్మద్(స)వారితో వివాదానికి దిగారు. కనుక అల్లాహ్ ఇలా ప్రకటించారు.

**"సులైమాన్ సత్య తిరస్కారి కాలేదు, కాని నిశ్చయంగా, షైతాన్‌లు సత్యాన్ని తిరస్కరించారు."**

సులైమాన్(అ)వారు అల్లాహ్ యొక్క ప్రవక్త. ఆయన విశ్వాసి. ఆయన సత్యతిరస్కారి (కాఫిర్) ఎలా అవుతారు? జాలవిద్యను ఉపయోగించిన వారు కాఫిర్లు అవుతారు. సులైమాన్(అ)వారు జాల విద్యను నేర్చుకోలేదు.

ఆయన అల్లాహ్ కారుణ్యంచే, అల్లాహ్ అనుమతితో జిన్నులను, పక్షులను నియంత్రించ గలిగారు, ఆ విధంగా నియంత్రించ గలిగేలా అల్లాహ్ ఆయనను అనుగ్రహించారు.

ఆయనపై జరిగిన దుష్ప్రచారాన్ని ఖుర్ఆన్ ఖండించింది.

పై ఆయత్ నుండి మరొక విషయానికి వివరణ ఇవ్వడం ఇక్కడ సందర్భానికి సరిపోతుంది.

## చేతబడి ద్వారా భార్యాభర్తలను విడదీయడం

ఈ విషయంపై నవంబర్ 2011 సంచికలో తెలిపాము. అయితే ఇక్కడ మరో అదనపు విషయం ఉంది. అందుకని తిరిగి ఇక్కడ చెప్పవలసి వచ్చింది.

పై ఆయత్ (2:102)లో "... **వారు భార్యాభర్తలకు ఎడబాటు కలిగించే (జాలవిద్య) వారిద్దరి దగ్గర నేర్చుకునేవారు** ..."

ఈ ఆయత్ ద్వారా చాలా స్పష్టంగా అర్థమయ్యేది ఏమిటంటే, ఈ చెడు ప్రయోగాల ద్వారా భార్యాభర్తలను విడదీయడం కూడా జరుగుతుందని. వారు పరస్పరం ఎంతో అన్యోన్యంగా మరియు సన్నిహితంగా ఉన్నప్పటికీ. ఇది షైతాన్‌ల పని.

ఈ విషయంపై ఒక ప్రామాణిక హదీస్ ఉంది.

జాబిర్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) చెప్పారు : ఇబ్లీస్ తన ఆసనాన్ని నీటిపై ఉంచుతాడు, తరువాత అతని సమూహాన్ని బయటికి పంపుతాడు మరియు అతడికి హొదాలో బాగా సన్నిహితంగా ఉండేవాడు అతడే (ప్రజల మధ్య) చాలా ఎక్కువ ఉపద్రవాన్ని కలుగజేసినవాడు. వారిలో ఒకడు వచ్చి చెబుతాడు : నేను ఫలానా ఫలానా పనిచేశాను. తరువాత వారిలో ఒకడు వచ్చి చెబుతాడు : **నేను అతనిని (భర్తని) వదలలేదు అతడు తన భార్య నుండి విడిపోయేవరకూ.** అప్పుడు అతడు (ఇబ్లీస్) వానిని తనకు దగ్గరగా తీసుకుని చెబుతాడు : "నీవెంత మంచివాడివో". 'అమాష్ చెప్పారు నేను అనుకుంటున్నాను, "ఆయన(స) చెప్పారు : మరియు అతడు (ఇబ్లీస్) వానిని కౌగలించుకుంటాడు". (సహీహ్ ముస్లిమ్, 7106, సంపుటి 7)

ఇక్కడ భార్యాభర్తలు విడిపోవడానికి కారణం, వారిలో ఒకరికొకరు అసహ్యంగా ఉన్నట్లు లేదా చెడునడత కలిగినట్లుగా భ్రమించడం.

**హారూత్ మరియు మారూత్ అనేవారు అల్లాహ్ యొక్క దూతలా? చేతబడి దింపబడిందా?**

ఈ విషయంపై అప్పటి విద్వాంసులు రెండు విభిన్నమైన వివరణలు ఇచ్చారు. వాటిని ఇబ్నె కసీర్‌గారు తన తఫ్సీర్‌లో పొందుపరిచారు. ఈ రెండింటిలో ఏ వివరణ సరియైనదో అల్లాహ్‌కే బాగా తెలుసు. ఏది సరియైనది అయినప్పటికీ, చేతబడి నేర్చుకున్నవాడు కాఫిర్ (సత్య తిరస్కారి) అవుతాడు అనే విషయం మాత్రం స్పష్టం అవుతుంది.

ఈ రెండు వివరణలు ఆయత్‌కు మాత్రం భిన్నంగా లేవు. ఆయత్‌ను వివరించడంలోనే భిన్నంగా ఉన్నాయి. ఇన్షా అల్లాహ్! ఈ వివరణలను ఈ శీర్షిక ముగింపు వ్యాసంలో అందించడానికి ప్రయత్నిస్తాము.

ముఖ్యంగా గమనించ వలసింది ఏమిటంటే, ఈ వ్యాసంలో తెలిపిన అన్ని ఆయత్‌లలోనూ మరియు హదీస్‌లోను చేతబడి కోసం ఉపయోగించ బడిన పదం ఒకటే - 'సిహ్ర్'.

మూసా(అ)వారికి తాళ్ళు, కర్రలు కదులుతున్నట్లు భ్రమ కలిగింది. ముహమ్మద్(స)వారికి కూడా చేయకపోయినా చేసినట్లు భ్రమ పడ్డారు (అది కూడా ఒక్క విషయంలోనే)

దీనిని బట్టి చేతబడి ద్వారా భార్యభర్తలను భ్రమకు గురిచేసి వారిని విడదీయడం జరగవచ్చు. ఇటువంటి భ్రమలు ప్రాణాపాయానికి కారణం కూడా కావచ్చు. ఎవరైతే తమపై ఏదో జరిగిందని అనుమానపడతారో వారు పఠించినా ప్రభావం తొలగిపోతుందని హదీస్ ద్వారా స్పష్టం అవుతుంది.

చిన్న సూరహ్‌లు, చిన్న దు'ఆలు కంఠస్థం చేయడం కష్టమైన పనికాదు.

కాబ్ అల్-అహ్‌బార్ మొదట్లో యూదుడు. ఆయన ఇస్లామ్ స్వీకరించారు. "నేను ప్రతీరోజూ పఠించే పదాల వలన కాకపోతే యూదులు నన్ను గాడిదగా మార్చివేసేవారు."

ఇక్కడ 'గాడిద' అనే పదం తెలివితక్కువ వారిని సూచించే రూపకాలంకారం. భాషాపరమైన అర్థాన్ని తీసుకున్నా కూడా మంత్రజాల ప్రభావం లేనట్లే కదా! ఆయనపై ప్రయోగం జరిగిందో లేదో తెలియదు. **కాని యూదులు ఈ చేతబడి ప్రయోగాలు చేసేవారని అర్థమౌతుంది.** ఆయన ప్రతీరోజూ చదివే ఆ పదాలు ఏమిటని అడిగితే ఆయన వివరించారు.

"నేను గొప్పవాడైన అల్లాహ్ రక్షణను వేడుకుంటున్నాను, ఆయన కంటే గొప్పగా ఏదీ లేదు మరియు నేను వేడుకుంటున్నాను రక్షణను అల్లాహ్ పరిపూర్ణ పదాలలో వాటికి ఏ మనిషి, సన్మార్గుడు లేక దుర్మార్గుడు, సయితం అతీతంగా లేడు. మరియు నేను వేడుకుంటున్నాను రక్షణను అల్లాహ్ యొక్క సుందరమైన అన్ని పేర్లతో నాకు తెలిసినవాటితో మరియు నాకు తెలియనివాటితో

అల్లాహ్ సృష్టించిన ప్రతీదాని కీడు నుండి, వాటికి అల్లాహ్ అస్తిత్వాన్ని ఇచ్చారో మరియు అల్లాహ్ వ్యాపింపజేశారో (భూమిపై లేదా విశ్వంలో).

## కంగారుపడ వలసింది ఏమీ లేదు

ఒక వ్యక్తిపై 'చేతబడి' జరగడం వలన ఆ వ్యక్తిలో కనిపించే లక్షణాలు మరియు ఒక వ్యక్తిలో ఏదైనా మానసిక రుగ్మత వలన కనిపించే లక్షణాలు ఒకే విధంగా ఉండవచ్చు. కాబట్టి ప్రవక్త(స)వారు నేర్పిన దు'ఆలు మరియు ఆయత్‌లు చదవడం వలన ఆ వ్యక్తి నుండి చేతబడి ప్రభావం తొలగిపోతుంది. అయినాసరే ఆ వ్యక్తిలో మార్పు రాకపోతే, మానసిక వైద్య నిపుణుడి (సైక్రియాట్రిస్ట్) దగ్గరకు తీసుకువెళ్ళి వైద్యం చేయించ వచ్చు. అటువంటి కొన్ని మానసిక వ్యాధుల గురించి రాబోవు వ్యాసాలలో అందిస్తాము, ఇన్షా అల్లాహ్!

మనం చదివే ఖుర్'ఆన్ ఆయత్‌లుగాని, దు'ఆలు గాని అతనిపై జరిగే మెడికల్ ట్రీట్‌మెంట్‌కి అడ్డంకి కావు. ఆ ఆయత్‌లు మరియు దు'ఆల అర్థాలు వివరిస్తే, ఆ వ్యక్తిలో మానసిక ధైర్యం పెరుగుతుందే గాని ఏమాత్రం తగ్గే అవకాశం లేదు. ఆ వ్యక్తి గనుక మీ కుటుంబ సభ్యుడైతే మీరు వాటిని చదవండి. మీరు మరొకరి దగ్గరికి వెళ్ళి చదివించ వలసిన అవసరం లేదు. మీ కంటే ఎక్కువ విశ్వాసం గలవారు మాత్రమే పఠిస్తే, ఫలితం ఎక్కువ ఉంటుంది అని భావిస్తున్నారా? ఈ విషయంపై ఈ శీర్షిక పూర్వపు వ్యాసాలలో ఉదాహరణ పూర్వకంగా వివరించాము.

మీకు అల్లాహ్‌పై విశ్వాసం ఉంది. అది చాలు. మీరు ఎవరి దగ్గరికైతే వెళ్ళారో అతనిలో నిజంగా అల్లాహ్‌పై విశ్వాసం ఉందో లేదో మీకు తెలియదు కదా! ఒకవేళ మీ ఉచ్చారణ సరిగ్గా లేకపోవడం వలన మీరు పఠించిన వాటి ప్రభావం ఉండదనుకుంటున్నారా?

**'ఓ అల్లాహ్! నన్ను క్షమించు'** అని మీరు దు'ఆ చేస్తారు.

ఇన్షా అల్లాహ్, అల్లాహ్ మిమ్మల్ని క్షమిస్తారు.

బాగా నత్తి ఉన్న వ్యక్తి (అంటే పదాలను సరిగ్గా పలకలేని వ్యక్తి),

**'ఓ అల్లాహ్! నన్ను క్షమించు'** అని దు'ఆ చేసాడని అనుకుందాం!

అతని దు'ఆ స్వీకరించబడుతుందా? లేదా?

అతని ఉచ్ఛారణ సరిగ్గా లేదని అల్లాహ్ తిరస్కరిస్తారా?

ఇన్షా అల్లాహ్! అతని వేడుకోలును అల్లాహ్ స్వీకరిస్తారు.

మనం కావాలని తప్పుగా ఉచ్ఛరించడం లేదు. అల్లాహ్ నేర్పిన స్థాయిలో మనం పఠిస్తాము. మన ఉచ్ఛారణ ఇంకా బావుండేలా మన ఇమామ్ గారి దగ్గర శిక్షణ తీసుకోవచ్చు.

స్వయంగా మనమే దు'ఆలు చదివితే, షైతాన్ రివర్స్ అయి మనపై దాడిచేస్తుందని, అటువంటి విషయాలలో అనుభవం ఉండాలని రకరకాల కల్పిత కథలు ప్రచారం చేశారు.

ఖుర్'ఆన్ ఆయత్‌లు, దు'ఆలు చదివితే షైతాన్‌లు దూరం అవుతారు గాని దాడి చేస్తారా? **వారి మాటలను ఎలా నమ్మగలుగు తున్నారు?** ఆయతుల్ కుర్సీ అనే ఓ ఖుర్'ఆన్ ఆయత్ చదివితే షైతాన్ నుండి రక్షణ ఏర్పాటు జరుగుతుంది అనేది తెలిసిన విషయమే!

శాంతిబాటలో ఇచ్చే దు'ఆలను మరియు ఆయత్‌లను కంఠస్థం చేసుకోండి. అల్లాహ్‌కు తప్ప వేటికీ భయపడకండి. మన విశ్వాసమే మనకు రక్ష. ఉమర్(రజి)వారు ఒక మార్గం గుండా రావడం షైతాన్ చూస్తే, వాడు ఆ మార్గంలో కాకుండా మరో మార్గం గుండా పోతాడని, స్వయంగా ముహమ్మద్(స)వారే చెప్పారు. ఉమర్(రజి)వారికి అల్లాహ్ అంటే అంత భయం. అల్లాహ్ పట్ల భయం గలవారిని చూస్తే షైతాన్ కూడా భయపడతాడు.

నేడు మన సమాజంలో ధర్మం పేరు చెప్పుకుని ఎన్నో రకాల వ్యాపారాలు జరుగుతున్నాయి. వాటిలో కొన్ని - వివిధ నిర్మాణాలు మరియు వాటి నిర్వహణల కొరకై విరాళాలు సేకరించడం మరియు వాటి నుండి భారీ స్థాయిలో తీసుకునే కమీషన్లు, దాయీలకు వేతనాలు, విరాళాలు, దావా ప్రోగ్రాములు, చేతబడి ... ఇలా ఎన్నో రకాల వ్యాపారాలున్నాయి.

ఇటువంటి వ్యాపారాల గురించి సగటు ముస్లిమ్‌కి వాస్తవాలు తెలిపి, అల్లాహ్ చూపిన మార్గం నుండి అతడు తప్పిపోకుండా ప్రయత్నించా లనేదే మా సంకల్పం.

**వాస్తవానికి ఈ వ్యాపారాలు చేసేవారిలో ఏ ఒక్కరూ కూడా మాకు శత్రువు కాదు. ప్రత్యర్థి అంతకంటే కాదు.**

**(మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో అందిస్తాము)**

---

- జిన్న్ అంటే అరబీలో రహస్యంగా కంటికి కనిపించకుండా ఉండేది.
- జిన్న్ అల్-లైల్ అంటే రాత్రి యొక్క చీకటి.
- అల్-మిజన్నా అంటే ఎక్కువ జిన్నులుండే ప్రదేశం.
- అల్-జిన్న్‌కు బహువచనం అల్-జాన్

**అరబీ భాషా విద్వాంసుల ప్రకారం, జిన్నులకు సంబంధించి చాలా కేటగిరులున్నాయి.**

1. సాధారణ పదం 'జిన్ని'.
2. ఏదైనా జిన్న్ ఓ ఇంటిలో నివశించే కుటుంబంతో పాటు ఉంటే, దానిని 'ఆమిర్ (dweller) అంటారు. దానికి బహువచనం 'ఉమ్మార్.
3. పిల్లలతో ఇంటరాక్ట్ అయ్యే జిన్న్‌లను అర్వా (spirits) అంటారు.
4. జిన్న్ పాపి అయితే వానిని షైతాన్ అంటారు.
5. షైతాన్‌కన్నా చెడ్డ అయితే మారిద్ అంటారు.
6. అంతకంటే చెడ్డగా ఉండి మరియు బలంగా ఉంటే, 'ఇఫ్రీత్' అంటారు. ఇఫ్రీత్‌కి బహువచనం 'అఫారీత్.




**ప్రతీ స్త్రీ లేదా పురుషునికి తొలి బడి అమ్మ ఒడి. గొప్ప గొప్ప జ్ఞానులు, మేధావుల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంటుంది. తొలి గురువులు తల్లిదండ్రులే. ఆ తరువాతనే, పాఠశాలలో చేరిన దగ్గరనుండి, మిగిలిన గురువులు పరిచయమౌతారు. వీరందరినీ మీరు గౌరవించాలి. అయితే వీరందరికీ జ్ఞానాన్ని ఇచ్చిన సృష్టికర్త విశ్వమంతటికీ గురువు - ఆయనే 'అల్లాహ్'. ఏ గురువు చెప్పినా అర్థం కాకపోయినా లేక మరేదైనా చెప్పుకోలేని సమస్య మీకొస్తే డైరెక్టుగా అల్లాహ్‌నే అడగండి. ఆయన వింటాడు. మీకు జవాబు కూడా వస్తుంది. ఆరాధ్యుడిని అర్థం చేసుకుంటే మీరే టాప్ రేంకర్స్.**

## అల్లాహ్ యొక్క ప్రవక్త హూద్(అ)

గత కొన్ని సంచికల నుండి ఒక్కొక్కరిగా అల్లాహ్ పంపిన ప్రవక్తల జీవితచరిత్రను అందించడం ప్రారంభించాము.

**గమనిక :** ఈ వ్యాసం పిల్లలకు అర్థమయ్యే విధంగా ఉండాలని సులభతరం చేసి అందిస్తున్నాము.

(డిశంబర్, 2011 సంచిక తరువాయి భాగం)

### ఆద్ జాతి ఏవిధంగా నాశనమైంది?

ఈ జాతి ప్రచండమైన గాలి ద్వారా నాశనమైందని ఖుర్'ఆన్ ద్వారా తెలుస్తుంది. ఖుర్'ఆన్ ఆయత్‌లో ప్రస్తావించిన దానిని బట్టి ఆ ప్రచండమైన గాలి 7 రాత్రులు మరియు 8 పగళ్ళు వీచింది. ఆద్ జాతిని సమూలంగా నాశనం చేసింది.

**నిశ్చయంగా, మేము పూర్తిగా దురదృష్టమైన ఒక రోజున తీవ్రమైన ఎడతెగని తుఫానుగాలిని పంపాము. అది ప్రజలను, వేళ్ళతో పెళ్ళగింప బడిన ఖర్జూరపు చెట్లవలె పెళ్ళగించి వేసింది.** (ఖుర్'ఆన్ 54:18-20)

**మరియు 'ఆద్ జాతివారేమో అతి తీవ్రమైన తుఫాను గాలి ద్వారా నాశనం చేయబడ్డారు. ఆయన (అల్లాహ్), దానిని వారి మీద ఏడు రాత్రులు మరియు ఎనిమిది పగళ్ళ వరకు ఎడతెగకుండా ఆవరింప జేశాడు. దాని వలన వారు వేళ్ళతో పెళ్ళగించబడిన ఖర్జూరపు బోదెల వలే పాడైపోవడం, నీవు చూస్తావు!** (ఖుర్'ఆన్ 69:6-7)

ముందుగా వారించి నప్పటికీ, ప్రజలు ఆ హెచ్చరికలను లెక్క పెట్టేవారు కాదు. మరియు వారి సందేశహరులను నిత్యం తిరస్కరిస్తూనే ఉన్నారు. వారు ఎటువంటి భ్రమలో ఉన్నారంటే వినాశనం దగ్గర కావడాన్ని వారు చూసినప్పుడు ఏమి జరుగుతుందో సైతం వారు అర్థం చేసుకోలేకపోయారు మరియు వారు తమ తిరస్కారాన్ని కొనసాగించారు.

**ఆ తరువాత వారు ఒక దట్టమైన మేఘాన్ని వారి లోయల వైపునకు రావడం చూసి ఇలా అన్నారు : "ఈ మేఘం మాకు వర్షం ఇస్తుంది!" (హూద్ అన్నాడు) : "కాదు కాదు, మీరు దేనికైతే తొందరపెడు తున్నారో అది (ఆ శిక్ష) ఇదే! ఒక తుఫాను గాలి, అందులో బాధాకరమైన శిక్ష ఉంది."** (ఖుర్'ఆన్ 46:24)

వారు దానిని వర్ష మేఘం అనుకున్నారు. అది మేఘం కాదు, ఇసుకతో వస్తున్న తుఫాను గాలి. దూరం నుండి అది ఆ విధంగా కనిపించింది.

ఆద్ జాతి ఒకప్పుడు నివశించిన ప్రదేశానికి మనం వెళితే ఆ ప్రాంతమంతా ఇసుకమేటలతో నిండిపోయి ఉండటాన్ని చూడవచ్చు.

ఈ ప్రాంతంలో కొన్ని సంవత్సరాల క్రితం చేపట్టిన పురావస్తు తవ్వకాల గురించి మరియు ఆ పరిశోధన ద్వారా ఇసుకలో కప్పబడి పోయిన ఉబర్ పట్టణం గురించి ముందరి వ్యాసాలలో ఇదివరకే చెప్పడం జరిగింది.

చారిత్రక మరియు పురావస్తు శాఖ పరిశోధనలను బట్టి ఆద్ మరియు ఉనికిలో ఉన్న ఇరమ్ పట్టణం ఖుర్'ఆన్‌లో వర్ణించబడినట్లే నాశనం అవడం జరిగిందని స్పష్టంగా తెలుస్తుంది. ఆ తరువాయి జరిగిన తవ్వకాలలో అప్పటివారి శిథిలాలు కూడా వెలికి తీశారు.

ఆద్ జాతి ప్రజల అహంకారం ఎలా ఉండేదో చూడండి :

**"..... బలంలో మమ్మల్ని మించినవాడు ఎవడున్నాడు?"
"ఏమీ? వారికి తెలియదా? నిశ్చయంగా, వారిని సృష్టించిన అల్లాహ్ బలంలో వారికంటే ఎంతో మించినవాడు? అయినా వారు మా ఆయత్ (సూచన)లను తిరస్కరిస్తూ ఉండేవారు!** (ఖుర్'ఆన్ 41:15)

విశ్వాన్ని మరియు అందులోని సమస్తాన్నీ సృష్టించింది అల్లాహ్‌యే!

ఈ సృష్టికి ముందు ఆయన ఉన్నారు. ఈ సృష్టి నాశనం చేయబడ్డాక ఆయన ఉంటారు. ఆయన సర్వశక్తివంతుడు. ఆద్ జాతి వారు తమ బలాన్ని చూసుకుని అహంకారానికి పోయారు. ఆ బలాన్ని వారికి ఇచ్చింది అల్లాహ్ అనే విషయం వారు తెలుసుకోలేక పోయారు. తమ శక్తిని చూసుకుని విర్రవీగే వారంతా నాశనమయ్యారు. **ఇది చారిత్రక సత్యం.** ఇది మనకు ఒక గుణపాఠం!


కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా కొన్ని నెలలుగా ఈ శీర్షికను అందించ లేకపోయాము. ఇన్షా అల్లాహ్! ఇక నుండి క్రమంగా అందిస్తాము.

## అల్లాహ్ యొక్క ప్రవక్త సాలిహ్ (అ)

సమూద్ జాతి ప్రజల దగ్గరకు అల్లాహ్ పంపిన ప్రవక్తగారి పేరు సాలిహ్ (అలైహిస్సలామ్).


ఆద్ జాతి నాశనం అయిన తరువాత శక్తిలో మరియు వైభవంలో వారి తరువాత వచ్చిన జాతి సమూద్. ఈ జాతి ప్రజలు కూడా విగ్రహారాధన వైపే మొగ్గుచూపారు. ఐశ్వర్యం పెరిగే కొద్దీ చెడు పెరిగి, మంచి తగ్గడం అనేది సర్వసాధారణం. వీరిలో కూడా అదే జరిగింది.

ఆద్ జాతి ప్రజల వలే, సమూద్ జాతివారు కూడా మైదానాలలో ఎత్తైన భవంతులు నిలబెట్టారు మరియు కొండలలో సుందరమైన ఇండ్లు తొలిచారు. ఈ పేజీలో ఉన్న ఫొటోలు చూడండి. ఈ భూభాగాన్ని దుర్మార్గులు పాలించడంతో అక్కడ నిరంకుశత్వం, అణిచివేత ప్రబలాయి.






The Nabataeans, which was an Arab tribe, had established a kingdom in the Rum Valley in Jordan. In this place, also called the Valley of Petra, it is possible to see the best examples of the stone-carving work of these people. Also in the Qur'an, Thamud are mentioned with their mastery of masonry. However, today, what is left of both of these communities are some remains that give us an idea of the art of that time. In the pictures, various examples of the stone-carving work in Petra Valley are seen.



**మరియు ఆయన, ఆద్ జాతివారి పిదప మిమ్మల్ని వారసులుగా చేసి మిమ్మల్ని భూమిపై స్థిరపరచిన విషయం జ్ఞాపకం చేసుకోండి. మీరు దాని మైదానాలలో కోటలను నిర్మించుకుంటున్నారు. మరియు కొండలను తొలిచి గృహాలు నిర్మించుకుంటున్నారు. కావున అల్లాహ్ అనుగ్రహాన్ని జ్ఞాపకం చేసుకోండి. మరియు భూమిపై అనర్థాన్ని, కల్లోలాన్ని రేకెత్తించ కండి!" అని అన్నాడు. (ఖుర్'ఆన్ 7:74)**


Petra Valley

**"ఇక సమూద్ జాతి వారి వద్దకు వారి సహెూదరుడు సాలిహ్‌ను పంపాము..."** (ఖుర్'ఆన్ 11:61)

ఆయన పూర్తి పేరు : **సాలిహ్** బిన్ ఉబైద్ బిన్ మసెహ్ బిన్ ఉబైద్ బిన్ హాజర్ బిన్ సమూద్ బిన్ అథెర్ బిన్ ఇరమ్ బిన్ **నూహ్**.

ఈయన తన ప్రజలను ఒకే ఆరాధ్యుడైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించమని మరియు ఆయనతో సహవాసులను నిలబెట్ట వద్దని బోధించారు. వారిలో కొందరు ఆయనను విశ్వసించారు. కాని అత్యధిక ప్రజలు ఆయన బోధనను తిరస్కరించారు. మరియు ఆయనను కష్టపెట్టారు మాటలతో మరియు చేతలతో.

సమూద్ ప్రజల నుద్దేశించి సాలిహ్(అ) ఇలా చెప్పారు :

**"... నా జాతి ప్రజలారా! అల్లాహ్‌నే ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక ఆరాధ్యుడు లేడు..."** (ఖుర్'ఆన్ 11:61)

సాలిహ్(అ)వారి స్వచ్ఛత గురించి, వివేకం గురించి మరియు మంచితనం గురించి ఆ ప్రజలకు బాగా తెలుసు. అందువలన ప్రజలు ఆయనను గౌరవించేవారు. కాని ఎప్పుడైతే అల్లాహుతాలా ఆయనపై దివ్య సందేశాన్ని అవతరింపజేశారో, మరియు బోధన ప్రారంభించారో అప్పుడు వారు వ్యతిరేకించారు.

**వారన్నారు : "ఓ సాలిహ్! ఇంతకు ముందు మేము నీపై ఆశలు పెట్టుకుని ఉన్నాము. ఏమీ? మా తండ్రితాతలు ఆరాధిస్తూ వచ్చిన వాటిని ఆరాధించకుండా, మమ్మల్ని ఆపదలచుకున్నావా? నీవు మాకు బోధించే విషయం గురించి వాస్తవంగా మాకు సందేహం ఉంది.** (ఖుర్'ఆన్ 11:62)

## సాలిహ్ ప్రజలు (సమూద్ జాతి ప్రజలు) ఓ అద్భుతం కోసం డిమాండ్ చేసారు :

వారు కేవలం తమ తాత ముత్తాతలు ఆరాధించిన వాటినే ఏ కారణం లేకుండా, ఏ ఆధారం లేకుండా, ఏ ఆలోచన లేకుండా ఆరాధించాలనుకుంటున్నారు. అంటే వారి తండ్రులు ఏమి చేశారో అదే వారు చేస్తున్నారు. సాలిహ్(అ)వారి సందేశం స్పష్టంగా ఉంది. అయినా సరే వారు వినలేదు. ఆయనపై మంత్ర ప్రభావం జరిగిందేమో, ఇలా వారికి ఎన్నో సందేహాలు. ఆయన తన బోధన ఆపివేయరని వారికి అర్థం అయింది.

మరి ఆయనను ఆ విధంగా వదిలేస్తే, ఆయనను అనుసరించే వారి సంఖ్య పెరిగిపోవచ్చు. ఆయన బోధనకు ముగింపు పెట్టాలని వారు ఓ పథకం పన్నారు.

ఓ అద్భుతాన్ని చూపడం ద్వారా ఆయన నిజంగా అల్లాహ్ యొక్క సందేశహరుడని ముందుగా ఋజువు చేసుకోమన్నారు. సాధ్యం కాని ఏదైనా చెప్పి ఆయనను ప్రవక్త కాదని ప్రకటించాలనే ఉద్దేశ్యంతో పర్వతాల నుండి ఓ అసాధారణమైన ఆడ ఒంటెను బయటకు వచ్చేలా చేయమన్నారు.

అది జరిగేపని కాదని వారికి పూర్తి విశ్వాసం ఉంది. అయితే వారికి ఎదురుదెబ్బే తగిలింది. అల్లాహ్ తన ప్రవక్త సాలిహ్(అ)వారిని అనుగ్రహించారు. అద్భుతం జరిగింది.

ఖుర్'ఆన్ తఫ్సీర్‌లు అందించిన వ్యాఖ్యాతలు చెప్పారు, సమూద్ జాతి ప్రజలందరూ ఒక నిర్ణీత రోజున ఒక చోట సమావేశమయ్యారు. మరియు ప్రవక్త సాలిహ్(అ) వచ్చారు మరియు ఆయన వారిని ఉద్దేశించి అల్లాహ్ వారిపై కురిపించిన అనుగ్రహాలను జ్ఞాపకం చేస్తూ అల్లాహ్‌పై విశ్వాసం ఉంచమని వారికి హితబోధ చేశారు.

తరువాత ఓ రాయిని చూపిస్తూ, వారు ఇలా డిమాండ్ చేశారు : "నీ ప్రభువును అడుగు, ఓ ఆడఒంటెను చేయమని, అది 10 నెలల గర్భం దాల్చి ఉండాలి, పొడవుగానూ మరియు ఆకర్షణీయంగానూ ఉండాలి, రాయి నుండి బయటకి రావాలి మా కోసం."

సాలిహ్(అ) సమాధానం ఇచ్చారు : "ఇప్పుడు చూడండి! ఏదైతే మీరు కోరారో దానిని అల్లాహ్ పంపితే, మీరు వర్ణించినట్లుగానే. మీరు విశ్వసిస్తారా దానిని దేనితో అయితే నేను మీ దగ్గరకు వచ్చానో, నేను ఏ సందేశంతో పంపబడ్డానో దాని యందు విశ్వాసం కలిగి ఉంటారా?"

వారు అన్నారు, "అలాగే"

కాబట్టి ఆయన వారి నుండి ఈ విషయంపై ప్రమాణం తీసుకున్నారు. తరువాత ఆయన వారి కోరికను అనుగ్రహించమని అల్లాహుతాలాను ప్రార్థించారు.

అల్లాహ్ ఆదేశించారు దూరంగా ఉన్న రాయిని బద్దలవమని, ఓ గొప్ప 10 నెలల గర్భం కలిగిన ఆడఒంటెను బయటకు తీసుకు రావడానికి. వారి కళ్ళు దానిపై పడగానే, వారు ఆశ్చర్యపోయారు.

**ఓ గొప్ప అద్భుతం కళ్ళముందు స్పష్టంగా కనిపించింది.**

ప్రజలలో చాలా మంది సాలిహ్(అ)వారిని విశ్వసించారు. అయితే అత్యధికులు తమ తిరస్కారాన్ని, మొండితనాన్నే కొనసాగించారు.

అల్లాహుతాలా చెప్పారు :

**"... మరియు మేము సమూద్ జాతి వారికి ప్రత్యక్ష నిదర్శనంగా ఒక ఆడ ఒంటెను పంపాము. కాని వారు దానిపట్ల క్రూరంగా ప్రవర్తించారు. మరియు మేము నిదర్శనాలను పంపుతున్నది కేవలం ప్రజలు వాటిని చూసి భయపడటానికే!"** (ఖుర్'ఆన్ 17:59)

మరియు

**"... వాస్తవానికి అల్-హిజ్ర్ వాసులు కూడా ప్రవక్తలను అసత్యవాదులు అన్నారు. మరియు వారికి కూడా మేము అద్భుత సూచనలను ఇచ్చి ఉన్నాము. కాని వారు వాటి నుండి విముఖులై ప్రవర్తించారు.** (ఖుర్'ఆన్ 15:80-81)

ఈ ఒంటె గురించి మరియు దాని యొక్క అద్భుత నేచర్ గురించి ప్రాచీన కథనాలు ఎన్నో ఉన్నాయి. అది ఎందుకు అద్భుతమో ఇదివరకే చెప్పుకున్నాము, రాయి పగిలి అందులో నుండి ఒంటె వచ్చింది.

ఇతర కథనాలను బట్టి అన్ని బావులలోని నీటిని ఆ ఒంటె ఒక రోజులో త్రాగేసేది. ఏ ఇతర జంతువూ ఆ నీటిని సమీపించలేక పోయేది. ఇంకనూ కొందరు చెప్పినదానిని బట్టి, ప్రజలకు ఏమీ మిగలకుండా నీటిని త్రాగిన అదే రోజు ప్రజలందరికీ త్రాగడానికి సరిపోయేటంత పాలు ఇచ్చింది.

మొట్టమొదట, సమూద్ ప్రజలు అత్యంత ఆశ్చర్యానికి లోనయ్యారు రాయి నుండి నిజంగా ఒంటె రావడాన్ని చూసి. అది అనుగ్రహాలు పొందిన ఒంటె మరియు దాని పాలు వేల సంఖ్యలోని పురుషులకు, స్త్రీలకు మరియు పిల్లలకు సరిపోయేవి.

అది ఒక చోట పడుకుంటే, ఆ చోటుని ఇతర జంతువులు వదిలి వెళ్ళిపోయేవి. ఎందుకంటే ఇది సాధారణ ఒంటె కాదు, అల్లాహ్ యొక్క సూచనలలో ఒకటి.

అది సాలిహ్ ప్రజల మధ్య నివశించేది. వారిలో కొందరు అల్లాహ్‌ను విశ్వసించారు. అయితే అత్యధికులు తమ మొండితనాన్ని మరియు తిరస్కారాన్నే కొనసాగించారు.

**ఒంటెపై ద్వేషం**

సాలిహ్ పట్ల వారికున్న ద్వేషం అనుగ్రహించబడిన ఆ ఆడ ఒంటె పైకి మరలింది మరియు వారి ద్వేషం దానిపైనే కేంద్రీకరించ బడింది.

దానిపై కుట్ర పన్నారు.

ఆ ఒంటెను వారు చంపవచ్చని సాలిహ్(అ)వారు భయపడి, వారిని హెచ్చరించారు :

**"మరియు నా జాతి ప్రజలారా! అల్లాహ్ యొక్క ఈ ఆడ ఒంటె మీ కొరకు ఒక అద్భుత సూచన! కావున దీనిని అల్లాహ్ భూమిలో స్వేచ్ఛగా మేయటానికి వదలిపెట్టండి. దానికి ఎలాంటి కీడు కలిగించకండి. లేదా త్వరలోనే మిమ్మల్ని శిక్ష పట్టుకోగలదు?"** (ఖుర్ఆన్ 11:64)

కొంతకాలం, సాలిహ్ ప్రజలు ఒంటెను స్వేచ్ఛగా మేసేందుకు మరియు త్రాగేందుకు వదలిపెట్టారు. కాని వారి హృదయాలలో దాని పట్ల ద్వేషమే ఉంది. అయితే, దాని అద్భుత అసాధారణ రూపం చాలామందిని సాలిహ్(అ)వారి అనుచరులుగా చేసింది మరియు వారు అల్లాహ్‌పై విశ్వాసానికి అంటిపెట్టుకుని ఉన్నారు.

**ఆడ ఒంటె గురించి కథలు :**

ఇబ్నె కసీర్(ర)వారు తన పుస్తకంలో వివరించారు.

సత్య తిరస్కారులు ఈ పెద్ద ఒంటె గురించి ఫిర్యాదులు చేయడం మొదలు పెట్టారు. ఈ ఒంటె లక్షణాలు అసాధారణమైనవి. మొత్తం నీరు త్రాగేస్తుంది మరియు తమ పశువులను భయపెడుతుంది.

దానిని చంపాలని వారు పన్నాగం పన్నారు మరియు వారు తమ స్త్రీలను సహకరించమని అడిగారు, తమ ఆదేశాల ప్రకారం చేసేలా పురుషులను ప్రలోభానికి గురి చేయమని.

ఉన్నత వంశానికి చెందిన ఓ ఐశ్వర్యవంతురాలు మస్‌రయ్ బిన్ మహ్‌రజ్ అనే యువకునికి స్వయంగా వివాహ ప్రతిపాదన చేసింది ఒక షరుతపై. అది ఏమిటంటే అతడు ఆ ఒంటె వెనుక కాలి యొక్క మోకాలి వెనుక నరాన్ని తెగ్గొట్టాలి.

అనిజ అనే ఓ ముసలామె, తన ఇద్దరి కుమార్తెలలో ఒకరిని ఖుదర్ బిన్ సలుఫ్ అనే యువకునికి ఇచ్చి వివాహం చేస్తానని చెప్పింది. దానికి బదులుగా అతడు ఒంటెను చంపాలి. సహజంగానే ఈ యువకులు ప్రలోభానికి గురి అయ్యారు మరియు మరో ఏడుగురిని తమతో కలుపుకున్నారు సహాయకులుగా.

వారు ఒంటె పూర్తి కదలికలను చాలా దగ్గరగా గమనించారు. ఆ ఒంటె బావి దగ్గరకు నీళ్ళు త్రాగడానికి రాగానే, మస్‌రయ్ దాని కాలుపై బాణం వేశాడు. అది తప్పించుకోవడానికి ప్రయత్నించింది. కాని బాణం దానికి అడ్డంకి అయింది. ఖుదర్ దాని మరో కాలిపై కత్తితో కొట్టాడు. అది నేలపై పడిపోగానే, వాడు దానిని కత్తితో చీల్చాడు.

ఆ హంతకులకు వీర స్వాగతం లభించింది. వారిని ప్రశంసిస్తూ పాటలు, కవితలతో కేరింతలు కొట్టారు. పొగరుతో వారు సాలిహ్(అ)వారిని వెక్కిరించారు. కాని ఆయన వారిని హెచ్చరించాడు: "అనుభవించండి జీవితాన్ని 3 రోజులు. తరువాత శిక్ష మీపై పడుతుంది."

ఈ మూడు రోజులలో వారు తమ పద్ధతులను మార్చుకుని పశ్చాత్తాప పడతారని ఆయన ఆశించారు. మూడు రోజుల వరకూ ఎందుకని, ఆ శిక్షను తీసుకురమ్మని తొందర పెట్టారు.

అల్లాహుతాలా ఈ కథను ఖుర్ఆన్‌లోని 27వ సూరహ్‌లో తెలిపారు :

"మరియు వాస్తవంగా! మేము సమూద్ జాతివారి వద్దకు వారి సోదరుడైన సాలిహ్‌ను, "మీరు అల్లాహ్‌నే ఆరాధించండి" అనే సందేశంతో పంపాము. కాని వారు రెండు వర్గాలుగా చీలిపోయి పరస్పరం కలహించుకో సాగారు. (సాలిహ్) అన్నాడు : "ఓ నా జాతి ప్రజలారా! మీరు సుస్థితికి ముందు దుస్థితి కొరకు ఎందుకు తొందర పెడుతున్నారు? మీరు అల్లాహ్‌ను మీ తప్పులను క్షమించమని ఎందుకు వేడుకోరు? బహుశా మీరు కరుణించ బడవచ్చు!"

వారన్నారు: "మేము నిన్ను మరియు నీ అనుచరులను అపశకునపు సూచనలుగా పరిగణిస్తున్నాము" (సాలిహ్) అన్నాడు : "మీ శకునం అల్లాహ్ వద్ద ఉంది. వాస్తవానికి మీరు పరీక్షించ బడుతున్నారు."

మరియు ఆ నగరంలో తొమ్మిదిమంది ఉండేవారు. వారు దేశంలో కల్లోలం రేకెత్తిస్తూ ఉండేవారు. మరియు ఎలాంటి సంస్కరణ చేసేవారు కాదు.

వారు పరస్పరం ఇలా అనుకున్నారు : "అల్లాహ్‌పై ప్రమాణం చేసి ఇలా ప్రతిజ్ఞ చేయండి. మనం అతనిపై మరియు అతనితో పాటు ఉన్నవారిపై రాత్రివేళ దాడి చేద్దాము. తరువాత అతని వారసులతో : "మీ సంబంధీకులను వధించింది మేము చూడనే లేదు. మేము నిశ్చయంగా, సత్యం పలుకుతున్నాము." అని అందాము.

మరియు ఈ విధంగా, వారు పన్నాగం పన్నారు మరియు మేము కూడా ఒక పన్నాగం పన్నాము. కాని అది వారికి తెలియదు.

ఇక చూడండి! వారి పన్నాగపు పర్యవసానం ఏమయిందో! వాస్తవానికి మేము వారిని మరియు వారి వంశం వారినందరినీ సర్వనాశనం చేశాము.

అవిగో వారి గృహాలు! వారు చేసిన దుర్మార్గాలకు అవి ఎలా పాడుపడి పోయాయో చూడండి. నిశ్చయంగా ఇందులో తెలుసుకునే వారికి గొప్ప సూచన ఉంది.

మరియు విశ్వసించి, తఖ్వా (అల్లాహ్ పట్ల భీతి) కలిగి ఉన్న వారిని మేము కాపాడాము. (ఖుర్'ఆన్ 27:45-53)

అల్లాహుతాలా సాలిహ్(అ)వారిని మరియు ఆయన అనుచరులను వారి దుర్మార్గపు పన్నాగాల నుండి కాపాడారు. భారమైన హృదయంతో, వారు దుర్మార్గులను వదిలి మరో ప్రాంతానికి వెళ్ళిపోయారు. సాలిహ్(అ)వారు హెచ్చరించిన 3 రోజుల తరువాత గాలి ఉరుములతో నిండిపోయింది.

తరువాత తీవ్రమైన భూకంపాలు మొత్తం జాతిని, వారి నివాస ప్రాంతాన్ని నాశనం చేసాయి. ఆ భూమి చాలా తీవ్రంగా కంపించింది. దానిలోని సమస్త జీవులు నాశనమయ్యాయి. ఓ భయంకరమైన అరుపు. ప్రజలంతా ఒకేసారి మరణించారు.

వారి బలమైన భవంతులుగాని లేక రాళ్ళను తొలుచుకుని నిర్మించు కున్న వారి ఇండ్లుగాని వారిని కాపాడలేకపోయాయి.

అల్లాహ్ చెప్పారు :

ఇక సమూద్ జాతి వారి వద్దకు వారి సోదరుడైన సాలిహ్‌ను పంపాము. అతను వారితో : "నా జాతి ప్రజలారా! అల్లాహ్‌నే ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక ఆరాధ్యుడు లేడు. వాస్తవానికి, మీ వద్దకు మీ ప్రభువు తరపునుండి ఒక స్పష్టమైన సూచన వచ్చింది. ఇది అల్లాహ్ మీకు అద్భుత సూచనగా పంపిన ఆడ ఒంటె కావున దీనిని అల్లాహ్ భూమిపై మేయటానికి వదలి పెట్టండి. మరియు హాని కలిగించే ఉద్దేశ్యంతో దీనిని ముట్టుకోకండి. అలా చేస్తే మిమ్మల్ని బాధాకరమైన శిక్ష పట్టుకుంటుంది.

మరియు ఆయన, ఆద్ జాతివారి పిదప మిమ్మల్ని వారసులుగా చేసి మిమ్మల్ని భూమిపై స్థిరపరచిన విషయం జ్ఞాపకం చేసుకోండి. మీరు దాని మైదానాలలో కోటలను నిర్మించుకుంటున్నారు. మరియు కొండలను తొలిచి గృహాలు నిర్మించుకుంటున్నారు. కావున అల్లాహ్ అనుగ్రహాన్ని జ్ఞాపకం చేసుకోండి. మరియు భూమిపై అనర్థాన్ని, కల్లోలాన్ని రేకెత్తించకండి!" అని అన్నాడు.

(సాలిహ్)జాతివారిలోని అహంకారులైన నాయకులు విశ్వసించిన బలహీన వర్గం వారితో అన్నారు : 'సాలిహ్ తన ప్రభువు పంపిన ప్రవక్త అని మీకు నిశ్చయంగా తెలుసా?" దానికి వారు : "మేము నిశ్చయంగా, అతని ద్వారా పంపబడిన సందేశాన్ని విశ్వసిస్తున్నాము." అని జవాబిచ్చారు.

ఆ అహంకారులు అన్నారు : "మీరు విశ్వసించిన దానిని మేము నిశ్చయంగా తిరస్కరిస్తున్నాము"

ఆ తరువాత వారు ఆ ఆడ ఒంటె వెనుక కాలి మోకాలి పెద్ద నరం కోసి (చంపి), తన ప్రభువు ఆజ్ఞను ఉల్లంఘించి, అతనితో అన్నారు : ఓ సాలిహ్! నీవు నిజంగానే సందేశహరుడివి అయితే నీవు మమ్మల్ని బెదిరించే ఆ శిక్షను తీసుకురా!"

అప్పుడు అతను(సాలిహ్) వారి నుండి మరలిపోతూ అన్నాడు : "ఓ నా జాతి ప్రజలారా! వాస్తవంగా, నేను నా ప్రభువు సందేశాన్ని మీకు అంద జేశాను. మరియు మీకు మంచి సలహాలను ఇచ్చాను, కాని మీరు మంచి సలహాలు ఇచ్చేవారంటే ఇష్టపడలేదు!" (ఖుర్'ఆన్ 7:73-79)

ఏమి జరుగుతుందో అర్థం చేసుకునే లోపు అందరూ నాశనం అయ్యారు.

సాలిహ్(అ)వారు తీసుకువచ్చిన సందేశాన్ని విశ్వసించినవారు ఆ ప్రాంతాన్ని వదిలి వెళ్ళడం వలన రక్షింపబడ్డారు.

**అల్లాహ్ విశ్వాసులైన తన దాసులను సురక్షితంగా ఉంచుతారు.**


హిజ్రీ శకం 9లో ముహమ్మద్(స)వారు సైన్యంతో దండయాత్రకు బయలు దేరారు. మార్గ మధ్యంలో అల్-హిజ్ర్ అనే ప్రాంతాన్ని దాటవలసి వచ్చింది. అది సమూద్ జాతివారు నివశించిన ప్రాంతం. నేడు ఆ ప్రాంతాన్నే అల్-ఖుర లోయ అని అంటారు. 'మదాయిన్ సాలిహ్'

ఆ ప్రాంతంలోని బావి నుండి ప్రవక్త(స)వారి అనుచరులు నీరు తోడారు మరియు పిండి కలిపారు. అయితే ముహమ్మద్(స)వారు ఆ నీటిని త్రాగవద్దని మరియు దానితో వుజూ కూడా చేసుకోవద్దని ఆదేశించారు. ఆ నీటితో కలిపిన పిండిని ఒంటెలకు పెట్టేయమన్నారు. దాని నుండి ఏదీ తినవద్దని ఆయన వారిని నిరోధించారు.

ఆ నీటికి బదులుగా, సాలిహ్(అ)వారి ఆడ ఒంటె నీటిని త్రాగడానికి ఉపయోగించే బావి నుండి నీరు తీసుకోమన్నారు. మరియు ఇలా చెప్పారు :

**"ప్రవేశించకండి వారి ఇండ్లను ఎవరైతే తమకు తాము అన్యాయం చేసుకున్నారో వారికి సంభవించిందే మీపై పడవచ్చు. కాని మీరు అది చేయవలసి వస్తే అది దు:ఖంతో కానివ్వండి."**

తరువాత ఆ లోయను చాలా వేగంగా దాటారు.




ఖుర్ఆన్ నుండి అర్థమయ్యేది ఏమిటంటే, సమూద్ జాతి వారు ఆద్ జాతి వారి వారసులని. పురావస్తు త్రవ్వకాలలో బయటపడిన విషయాలను బట్టి అదే విషయం తెలుస్తుంది. అరేబియా ఉత్తర భాగాన నివశించిన సమూద్ వారి మూలాలు ధక్షిణ భాగానికి వెళుతున్నాయి. అక్కడ ఒకప్పుడు ఆద్ జాతి వారు నివశించారు.

## ఇతరుల పట్ల మనం ఎలా ప్రవర్తించాలి?

ప్రజలు పొగరుగా, అబద్ధాలు చెబుతూ, ఇతరులను వెక్కిరిస్తూ ఉండటాన్ని మరియు అహంకారంతో ఉండటాన్ని ఇస్లామ్ వ్యతిరేకిస్తుంది. మన సృష్టికర్త 'అల్లాహ్'ను ప్రసన్నం చేసుకోవడానికి మనకు ఉండవలసిన ముఖ్య గుణాలు నిజాయితీ మరియు వినయ విధేయతలు.

ప్రజలపై తమ చుట్టూ ఉండేవారి ప్రభావం పడుతుంది. తమ స్నేహితులు చెడ్డవారైతే, చెడు ప్రభావం పడే అవకాశం ఉంది.

అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఆదేశించినట్లు, ముహమ్మద్(స)వారు బోధించి నట్లు మన నడవడికను సరిచేసుకుంటే మనపట్ల అందరూ ప్రేమగా వ్యవహరిస్తారు. ఈ ఆదేశాలను పాటించడంలో స్థిరంగా నిలబడాలి.

అల్లాహ్ ఆ విధంగా స్థిరంగా ఉండే వారిని ప్రేమిస్తారు. అన్ని రకాల పరిస్థితులలో కూడా మన స్థిరంగా ఉండాలి.

ఖుర్ఆన్ మూడవ సూరహ్‌లో 200వ ఆయత్‌లో మనం విజయ వంతులం కావాలంటే ఏమీ చేయాలో అల్లాహుతాలా చెప్పారు :

"ఓ విశ్వాసులారా! సహనం వహించండి మరియు స్థైర్యాన్ని చూపండి మరియు స్థిరంగా ఉండండి మరియు అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉండండి. అప్పుడే మీరు సాఫల్యం పొందగలరని ఆశించవచ్చు." (ఖుర్ఆన్ 3:200)

ప్రదర్శనా భీతితో అహంకారాన్ని కలిగిన ప్రజలను అల్లాహ్ ప్రేమించరు.

ఈ ప్రపంచంలో ప్రతీ ఒక్కరూ ఒకే రకమైన భౌతిక సుఖాలు అనుభవించడం లేదు. కొందరికి అందమైన ఇళ్ళు మరియు ఖరీదైన కార్లు ఉంటే, మరికొందరికి ఏదీ ఉండదు. వాటికి తగినట్లుగానే అల్లాహ్ బాధ్యతల భారాన్ని కూడా ఉంచారు. ఏదీ లేనివాడిపై బాధ్యతల బరువు చాలా తేలికగా ఉంటుంది.

ఒకరు వేసుకున్న అందమైన బట్టలను చూసిగాని, వారి యొక్క ఆకారాలను చూసిగాని విలువ ఇవ్వడం ఇస్లామ్‌లో లేదు. ఇస్లామ్‌లో ఒక వ్యక్తికి లభించే గౌరవం, అతని 'ఈమాన్' (విశ్వాసాన్ని) బట్టి ఉంటుంది. విశ్వాసంతో ధర్మంలో స్థిరంగా ఉన్నవారికి ఎక్కువ గౌరవం మరియు విలువ ఉంటాయి.

కాబట్టి ఒక వ్యక్తి యొక్క స్థాయి ఆ వ్యక్తికి అల్లాహ్ పట్ల ఉండే భీతిపై మరియు ప్రేమపై మరియు ఆయన ఆదేశాలను పాటిస్తూ అణుకువతో జీవించే విధానంపై ఆధారపడి ఉంటుంది.

మనల్ని మంచిగా ప్రవర్తించమని చెప్పారు. అయితే ఈ రోజుల్లో ఎక్కువ మందికి అల్లాహ్ ఏమి చెప్పారో కూడా తెలియదు. ఖుర్ఆన్‌లో ఏముందో కూడా తెలియదు. చదవడానికి ప్రయత్నించరు. అల్లాహ్ చూపిన గైడెన్స్‌ను వదిలి వేరొకరి గైడెన్స్ కొరకు ఆసక్తి చూపుతారు.

సినిమాలపై మరియు సంగీతాలపై మక్కువ పెంచుకుంటున్నారు. ఒక సినిమాలో హీరో హింసకు పాల్పడి, తప్పుడు పనులు చేస్తే, థియేటర్ నుండి బయటకి వచ్చాక, ఆ హీరోని అనుకరించడం చేస్తున్నారు.

కాని మనం అనుకరించ వలసిన అసలు హీరోలు వీరు కాదు. ప్రవక్తలు. వీరి ఆయుధం - సహనం. వీరి శక్తి - అల్లాహ్ పట్ల వారికున్న స్థిరమైన విశ్వాసం. ఎటువంటి కష్టాన్ని అయినా అల్లాహ్‌పై భరోసాతో ఎదుర్కొనేవారు. వీరి అడుగుజాడల్లో మనం నడవాలి.

మీరు కల్పితంతో కూడిన ఎన్నో ఎడ్వంచర్స్ గురించి చదివి ఉంటారు. కాని అసలైన ఎడ్వంచర్స్ ప్రవక్తలు చేశారు. వాటిని మీకు తెలియజేయడానికే అందుబాటులో ఉన్న ప్రవక్తల జీవితచరిత్రలు, ఇన్షా అల్లాహ్, ఒకటొకటిగా మీకు అందిస్తూనే ఉంటాము.

ప్రవక్తలను అల్లాహ్ అనుగ్రహించారు. **మనం ప్రవక్తలను ప్రేమించాలి.**

**(ఇన్షా అల్లాహ్ వచ్చే సంచిక నుండి బాలబాలికను ఆలోచింప జేసే ఎన్నో ఆసక్తికరమైన విషయాలను ఈ శీర్షిక ద్వారా అందిస్తాము.)**

# ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువుదాం - 30

فِعل ثلا ثي مَزِيد فِيه
ఫి'లె సులాసీ మజీద్ ఫీహి
[క్రియ యొక్క నాల్గవ రూపం]

**أَفْعَلَ** ప్రారంభంలో హమ్‌జా అదనంగా వచ్చినప్పుడు
(فعل ماضی میں پہلا حرف أ زیادہ ہو)

| | | | | | |
|---|---|---|---|---|---|
| జీవితం ఇచ్చుట<br>to give life زندگی دینا | إِحْيَاء (ఇహ్‌యాఅ) | مُحْيٍ (ముహ్‌యిన్) | أَحْيِ (అహ్‌యి) | يُحْيِي (యుహ్‌ఈ) | أَحْيَا (అహ్‌యా) |
| దాచుట<br>to conceal چُھپانا | దాపరికం إِخْفَاء (ఇఖ్‌ఫాఅ) | దాచినవాడు مُخْفٍ (ముఖ్‌ఫిన్) | దాచు أَخْفِ (అఖ్‌ఫి) | దాస్తాడు يُخْفِي (యుఖ్‌ఫీ) | దాచాడు أَخْفَى (అఖ్‌ఫా) |
| చూపుట<br>to show دِکھانا | إِرَاءَ ة (ఇరాఅత్) | (మురిన్) مُرٍ | (అరి) أَرِ | يُرِي (యురీ) | أَرَى (అరా) |
| అధికం చేయుట<br>to enrich کام آنا، غنی کرنا | إِغْنَاء (ఇఘ్‌నాఅ) | (ముఘ్‌నిన్) مُغْنٍ | (అఘ్‌ని) أَغْنِ | يُغْنِي (యుఘ్‌నీ) | (అఘ్‌నా) أَغْنَى |
| విసురుట, వేయుట<br>to throw; ڈالنا<br>to cast; to place | إِلْقَاء (ఇల్‌ఖాఅ) | (ముల్‌ఖిన్) مُلْقٍ | (అల్‌ఖి) أَلْقِ | يُلْقِي (యుల్‌ఖీ) | (అల్‌ఖా) أَلْقَى |
| రక్షించుట بچانا<br>to rescue;<br>to save; to deliver | إِنْجَاء (ఇన్‌జాఅ) | (మున్‌జిన్) مُنْجٍ | (అన్‌జి) أَنْجِ | يُنْجِي (యున్‌జీ) | (అన్‌జా) أَنْجَى |
| దివ్య సందేశాన్ని తెలియజేయుట<br>to reveal; وحی کرنا<br>to inspire | إِيُحَاء (ఈహాఅ) | (మూహిన్) مُوحٍ | (అవ్‌హి) أَوْحِ | يُوحِي (యూహీ) | (అవ్‌హా) أَوْحَى |
| పూర్తి చేయుట<br>to fulfil پورا کرنا | إِيفَاء (ఈఫాఅ) | مُوفٍ (మూఫిన్) | (అవ్‌ఫి) أَوْفِ | يُوفِي (యూఫీ) | (అవ్‌ఫా) أَوْفَى |
| విశ్వసించుట<br>to believe<br>ایمان لانا | إِيْمَان (ఈమాన్) | مُؤْمِن (ము'మిన్) | (ఆమిన్) آمِنْ | يُؤْمِنْ (యు'మిను) | (ఆమన) آمَنَ |
| ఇచ్చుట<br>to give دینا | إِيُتَاء (ఈతాఅ) | مُؤْتِي (ము'తీ) | (ఆతి) آتِ | يُؤْتِي (యు'తీ) | (ఆతా) آتَى |
| హానిచేయుట, బాధపెట్టుట<br>to give trouble; to harm;<br>to annoy دُکھ دینا | إِيُذَاء (ఈజాఅ) | مُؤْذِي (ము'జీ) | آذِ (ఆజి) | يُؤْذِي (యు'జీ) | آذَى (ఆజ) |

ఖుర్'ఆన్‌లో మొత్తం పదాల సంఖ్య = సుమారు 77,800.

*ఈ 30 నెలల్లో నేర్చుకున్న ఖుర్'ఆన్ పదాల శాతం : 81*

ఈ నెల నేర్చుకున్న పదాలు 1412 (అంటే ఈ పేజీలోని పదాలు ఖుర్'ఆన్‌లో 1412 చోట్ల చూడవచ్చు)

source: www.emuslim.com

# మంచిని బోధించడం మరియు చెడును నిరోధించే ప్రయత్నంలో 'శాంతిబాట'కు మూడున్నర సంవత్సరాలలో ఎదురైన అనుభవాలు

## మా లక్ష్యాలు

- ముస్లిమేతరుల చేత కలిమా చదివించే ఉద్దేశ్యంతో ఈ పత్రిక ప్రారంభించబడలేదు. ఎందరో దీని ద్వారా ఇస్లామ్ స్వీకరించేసారని ప్రకటించుకుని పేరు, డబ్బు సంపాదించే ఉద్దేశ్యం మాకు లేదు. ముస్లిముల దైన్య స్థితిని చూసి, ఇంట్లో గొప్ప ఖజానా ఉంచుకుని, దాని తాళం చెవి చేతిలో ఉంచుకుని కూడా, వీధిలో అడుక్కునే వ్యక్తుల మాదిరి, వారు జీవించడం చూసి ఇస్లామ్ ఔన్నత్యాన్ని వారికి చాటి చెప్పాలని మరియు వారు సంతోషంగా ఉండాలనే సంకల్పమే ఈ పత్రిక ఆరంభానికి ముఖ్య కారణం.
- నమాజ్, రోజా, హజ్జ్ మాత్రమే ఆరాధనగా భావించి, వాటిని పూర్తి చేసేస్తే స్వర్గం లభిస్తుందని ఊహించుకునే వారికి, వాస్తవ ఇస్లామీయ ఆరాధన అంటే ఏమిటో తెలియజెప్పి, కేవలం 'విశ్వాసులు' (మోమిన్లు) మాత్రమే స్వర్గంలో ప్రవేశిస్తారనే నిజాన్ని తెలియజేసి, ఇస్లామ్‌లో కేవలం నోటిమాట కాకుండా ఆచరణ ఎంత ముఖ్యమైనదో చెప్పడం.
- ముహమ్మద్(స)వారు జీవించిన కాలం నుండే మునాఫిక్‌లు (కపట విశ్వాసులు) ఉన్నారు. వారి వలన ఉపద్రవాలు వస్తాయి. వారు జమాత్‌లను చీలుస్తారు. వారి కార్యకలాపాలు, వారి నిజ స్వరూపం బయట పెట్టి ముస్లిమ్ సమాజాన్ని అప్రమత్తం చేయడం
- **ఐక్యత కోసం ప్రయత్నం** : అల్లాహ్‌ను విశ్వసించినవారు, ముహమ్మద్ (స)వారిని ప్రేమించిన వారు, ఖుర్ఆన్ తమ గ్రంథమని విశ్వసించిన వారంతా ఒకరికొకరు సోదరులే గాని, శతృవులు ఎంతమాత్రం కాదు. కాని నేడు జమాత్‌ల పేర్లు చెప్పుకుని, నిత్యం ఘర్షణ పడుతున్నారు. ఆ ఘర్షణలు ఆపి వివిధ జమాత్‌ల మధ్య స్నేహ వాతావరణాన్ని కల్పించాలి. అది కూడా ఖుర్ఆన్ మరియు సున్నత్ ప్రకారంగానే జరగాలి.
- ఒక మతధర్మంవారు వందల సంవత్సరాల నుండి ఇస్లామ్‌పై, ముహమ్మద్(స)వారిపై విషం కక్కుతూ లక్షల కోట్ల రూపాయలు అందుకొరకు ఖర్చుపెడుతూ, ఎన్నో తప్పుడు చారిత్రక మరియు ఇతర పుస్తకాలు ముద్రించి ప్రపంచమంతా వ్యాపింప జేస్తున్నారు. ఇస్లామ్‌ది పాజిటివ్ విధానం. ఎదుటి వాడు తిట్టాడని వాడిని తిట్టమని ఇస్లామ్ బోధించలేదు. తిట్టినందుకు వాడు పశ్చాత్తాప పడాలి. అటువంటి ఉన్నత ప్రమాణాలు కలిగిన జీవన విధానాన్ని వివరించడం.
- విద్యకు మరియు పరిశోధనకు ఇస్లామ్ ఇచ్చినంత ప్రాముఖ్యత మరియు ప్రాధాన్యత మరేదీ ఇవ్వలేదు. ఆధునిక సైన్స్‌కు పునాదులు వేసి, ఎన్నో శాస్త్ర విజ్ఞాన రంగాలకు ముస్లిములను పితామహులుగా చేసిన ధర్మం ఇస్లామ్. ముస్లిమ్ శాస్త్రవేత్తలు కనుగొన్న విషయాలను, వేరే వారికి కట్టబెట్టో లేక పేర్లు మార్చడం ద్వారానో ఈ వాస్తవాలు సగటు ముస్లిముకి చేరలేదు. చరిత్ర పుస్తకాలలో తప్పుడు వ్రాతలు వ్రాయించారు. ముస్లిములు తీవ్రవాదులు అనే దుష్ప్రచారం చేశారు. ఇటువంటి దుష్ప్రచారాలతో ముస్లిమ్ బాలబాలికలు స్కూళ్ళలో వివక్షకు మరియు అవమానాలకు గురి అవుతున్నారు. కొందరు వేదన చెందితే, మరికొందరు ఇస్లామ్ పట్ల అసంతృప్తి పెంచుకుంటున్నారు. ఈ భావి పౌరులకు సత్యాలు తెలియాలి. **ఇస్లామ్ ఔన్నత్యాన్ని గర్వంగా చెప్పగలిగే మానసిక స్థైర్యం వారిలో కలిగించడం.**
- విద్వాంసుల వలన సమాజానికి మేలు ఎంత జరుగుతుందో, ఆ విద్వాంసులే తప్పుడు మార్గంలో ఉంటే కీడు అంతకంటే ఎక్కువే జరుగుతుంది. ధర్మం పేరు చెప్పుకుని సోమరిపోతులు, స్వార్థపరులు ప్రజలకు మాయమాటలు చెప్పి, కడుపు నింపుకోవడమే కాకుండా, సమాజానికి చీడపురుగుల్లా తయారయ్యారు. అటువంటి వారి గురించి అప్రమత్తం చేయడం.
- అరబీ భాషా ఔన్నత్యం సగటు ముస్లిమ్ తెలుసుకోవాలి. అరబీ నుండి అనువాదాల జోరు పెరిగింది. మంచి జరుగుతుంది అని భావించే లోపు చెడు కూడా లోతుగా వ్రేళ్ళూనుకుంది. అల్లాహ్ పేరుని కూడా అనువదించేస్తున్నారు. మహోన్నతమైన 'అల్లాహ్' పదానికి అనువాదం లేదు. అనువాదకులకు ఖుర్ఆన్, హదీస్‌లు మరియు ఇస్లామీయ చరిత్రపై స్పష్టమైన అవగాహన ఉండాలి. అరబీ భాషపై కనీస అవగాహనమైనా ఉండాలి. అనువాద భాషపై మంచి పట్టు ఉండాలి. వీటన్నింకంటే ముందు తఖ్వా ఉండాలి. ఇవి లోపించడంతో పేరు ప్రఖ్యాతలు, డబ్బుపై ఉన్న మోజుతో చేస్తున్న అనువాదాలు పక్కదారి పట్టాయి. అనువాద ప్రక్రియ ప్రమాణాలు పెంచడానికి అంచెలంచెలుగా ఒక మేలైన విధానాన్ని పరిచయం చేయడం.
- వాస్తవాలను వెలికి తీయడానికి సహనం, పరిశోధన ఎంతో అవసరం. వాటి విలువ మాచే పబ్లిష్ కాబడిన 'సృష్టికర్త పేరు ఏమిటి?' మరియు 'ముహమ్మద్(స)వారిపై ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న దుష్ప్రచారం' పుస్తకాల ద్వారా ప్రజలకు అర్థమైంది. ఇదే తరహాలో ఎన్నో గొప్ప విషయాలను పుస్తకాల రూపంలో అందించాలని మా పరిశోధన కొనసాగిస్తున్నాము.
- ఎల్లప్పుడూ సంతోషంగా బ్రతకడానికి ఇస్లామ్ చూపిన సమగ్ర జీవన విధానాన్ని సులభమైన తెలుగులో అందిస్తున్నాము. విదేశాల్లో ఉద్యోగ రీత్యా ఉన్న తెలుగు చదవగలిగే ముస్లిముల కొరకు వెబ్‌సైట్ ఏర్పాటు చేశాము. ఈ సైట్‌నుండి ఇంటర్‌నెట్ సౌకర్యం కలిగిన ప్రతీ ఒక్కరూ ఉచితంగా శాంతిబాట చదువుకోవచ్చు.
- ఎడ్వర్‌టైజ్‌మెంట్స్ లేకుండా ఎవరి ముందూ చేయి చాచకుండా, ఉద్యోగులను గాని, ఇతర పనివారిని గాని నియమించుకోకుండా స్వచ్ఛందంగా కేవలం అల్లాహ్ కారుణ్యంతోనే నడపాలని. సత్యాన్ని చెప్పేటప్పుడు ఆటంకాలు ఎదురౌతాయి. శతృవులు పెరుగుతారు. సత్యాన్ని అందించే శాంతిబాట నిర్వహణ అల్లాహ్ అనుగ్రహానికే వదిలిపెట్టాం.

## సమాజంలో నెలకొన్ని ఉన్న సమస్యలు

**1. ఐక్యత :** ఐక్యత యొక్క ప్రాముఖ్యత గురించి ఎవరు చెప్పినా, చెప్పకపోయినా ప్రతీ రోజూ 5 సార్లు ఈ విషయాన్ని ఇస్లామ్ గుర్తు చేస్తుంది. అటువంటప్పుడు ఇస్లామ్‌లో ఐక్యత లోపించడం ఆశ్చర్యకర విషయం. అన్ని జమాత్‌లు సోదరభావంతో కలిసి ఉండగలవు. కాని స్వార్థపరులు, మునాఫిక్‌లు ఆ ఐక్యతను నాశనం చేస్తున్నారు. మునాఫిక్ వర్గం అన్ని జమాత్‌లలో తమ వారిని చొప్పించింది.

మునాఫిక్‌లు ఏ జమాత్‌లో చేరితే, ఆ జమాత్‌ను కాక ఇతర జమాత్‌లను ఓ పథకం ప్రకారం తిడుతున్నారు. వారికి ప్రతిస్పందనగా ఇతర జమాత్‌లో చేరిపోయిన వారి స్నేహితులు వీరికి వ్యతిరేకంగా తిడుతున్నారు. నిజానికి సామాన్య ముస్లిమ్ సమాజంలో ఎటువంటి విద్వేషాలు లేవు. ఈ మునాఫిక్‌లు వాటిని కల్పిస్తున్నారు.

వీరికి ఒక ముస్లిమేతర మతధర్మం వారి నుండి ఆర్థిక సహకారం పుష్కలంగా లభిస్తుంది. అంతేకాకుండా వీరి నిజ స్వరూపం తెలియక వీరి నటన చూసి ముస్లిములు కూడా వీరికి సహాయం చేస్తున్నారు.

ధర్మంలో బలవంతం లేదు అని అల్లాహుతాలాయే స్పష్టం చేశాక, శతృత్వానికి ఆస్కారం ఎక్కడుంది?

ఎంతటి బలవంతుడినైనా అనారోగ్యం మంచాన పడేస్తుంది. ముస్లిమ్ సమాజానికి తీవ్ర అనారోగ్యాన్ని కలిగించే క్రిములు - మునాఫిక్‌లు (కపట విశ్వాసులు) వీరు ముస్లిములుగా నటిస్తారు. ముస్లిమ్ సమాజాన్ని నాశనం చేయడమే వీరి ధ్యేయం. మునాఫిక్‌ల గుట్టు బయట పెట్టింది - శాంతిబాట. కాబట్టి 'శాంతిబాట'పై బలవంతంగా ఏదో ఒక జమాత్ ముద్రవేసి, ప్రజలకు పత్రికను దూరం చేయాలని మునాఫిక్‌లు చేయని ప్రయత్నం అంటూ ఏదీ లేదు.

**2. సాంఘిక సంక్షేమం :** ఇస్లామ్ యొక్క 5 మూల స్తంభాలలో ఒకటి జకాత్. ఇది సాంఘిక సంక్షేమానికి సంబంధించినది. ఇస్లామ్ ఖలీఫాలు సాంఘిక సంక్షేమానికి తొలి ప్రాధాన్యత నిచ్చారు.

మేము జకాత్ గురించి స్పష్టంగా హదీస్‌ల ద్వారా ఆధారాలు చూపిన తరువాత వేల కోట్ల రూపాయల కుంభకోణం గురించి ప్రజలకు తెలిసింది. శాంతిబాట ద్వారా నిజాలు తెలుసుకున్న విశ్వాసులు జకాత్‌ను కేవలం పేద ప్రజలకే అందిస్తున్నారు. సాంఘిక సంక్షేమ నిధులను పక్కదారి పట్టించారు.

మదరసాలకు జకాత్ తీసుకునే హక్కు లేదు. దాయీలుగా పిలవబడే బిద్'అతీలకు జకాత్ లేదు. (వాస్తవానికి బిద్'అతీలను సమాజానికి దూరంగా ఉంచాలి). ముహమ్మద్(స)వారు స్థాపించిన కేంద్రం - మస్జిద్. విజ్ఞాన మరియు రాజకీయ కేంద్రం - మస్జిద్. ఇక ప్రోగ్రామ్‌ల కోసం పెట్టే ఖర్చు - వృథా ఖర్చు. పేదప్రజల సొమ్మును ఆ విధంగా వృథా చేస్తున్నారు.

**3. ధర్మం పేరుతో మోసం :** ఇది ముఖ్యంగా మూడు రకాలుగా జరుగుతుంది. (.) ధార్మిక విద్య పేరుతో (.) దాయీలు, దావా ప్రోగ్రాముల పేరుతో (.) భూతవైద్యం పేరుతో

**మదరసాలు :** రెండు నాలుకల ధోరణిని బయట పెట్టడం జరిగింది. మదరసాలపై గొప్ప ప్రేమ ఉన్నట్లు నటిస్తున్నారు. అదే నిజమైతే ఆ మదరసా నుండి బయటకి వచ్చినవారికి ఎంత గౌరవం ఇస్తున్నారు? వారిని ముష్ఠివారిగా భావిస్తున్నారు.

సేకరించిన జకాత్‌లో అత్యధిక శాతం అంటే ప్రాథమిక అంచనా ప్రకారం 9000 కోట్ల రూపాయలు, మదరసాలకు వెళుతున్నట్లు అర్థమౌతుంది. వీటికి సంబంధించిన సమగ్ర సమాచారం లెక్కలతో సహా వివరించాము. (శాంతిబాట, మే-జూన్, 2012 చూడండి)

కాబట్టి ప్రతీ విద్యార్థిపై నెలకు 4,166 రు॥లు ఖర్చు చేస్తున్నట్లు అవుతుంది. నిజంగా ఒక మదరసా విద్యార్థిపై 4,166 రు॥లు నెలకు ఖర్చు చేస్తున్నారా?

పూర్తి సొమ్ము మదరసాలకు వెళ్ళదు. మధ్యలో ఎందరో దళారీలు ఉన్నారు. వారిలో నాయకులు, విద్వాంసులు కూడా ఉన్నారు. కాబట్టి గుట్టు చప్పుడు కాకుండా ఈ వేల కోట్ల వ్యాపారం జరుగుతుంది. శాంతిబాట ఆ అధర్మ వ్యాపారాన్ని మరియు వారు చేస్తున్న మోసాలను బయట పెట్టింది. శాంతిబాటను మూయించేయాలని రకరకాల ప్రయత్నాలు చేశారు. ఎలా మూయిస్తారు? వారి సహకారం కోసం మేమెన్నడూ చేయి చాచలేదు. అడిగి ఓ రూపాయి సహాయం తీసుకోలేదు.

మేము ఎల్లప్పుడూ 'శాంతిబాట' కేవలం అల్లాహ్ అనుగ్రహంతోనే నడుస్తుందని ప్రకటించాము. అదే నిజం. 'శాంతిబాట'లో సత్యాలు లేకపోతే వీరంతా శాంతిబాటను ఆదరించి ఉండేవారు. వీరు సత్యాన్ని సహించలేక పోతున్నారు.

**భూతవైద్యం :** చేతబడి పేరుతో వేలకు వేలు ప్రజల నుండి వసూలు చేస్తున్నారు. ప్రజలలో భయాందోళనలు కలిగిస్తున్నారు. ఖుర్ఆన్ మరియు సున్నత్‌ల ద్వారా ఈ భయాందోళనలను ప్రజల నుండి దూరం చేయాలి.

**ధర్మ సందేశం :** పేరుతో పేద ప్రజలకు వెళ్ళవలసిన సొమ్ము దోచు కుంటున్నారు. ఇంకా ఇటువంటివి ఎన్నో జరుగుతున్నాయి. దీని వలన అల్లాహ్ ఆదేశించిన సాంఘిక సంక్షేమాన్ని సమాజం మరచిపోయింది.

మన దేశంలో 25 కోట్ల మంది ముస్లిములు మరియు 100 కోట్ల మంది ముస్లిమేతరులు ఉన్నారు. ప్రతీ ముస్లిమ్‌కి ఇస్లామ్ పట్ల కనీస జ్ఞానాన్ని తమ మస్జిద్‌లో నేర్చుకునే అవకాశం కల్పించాలి. అలా జరిగితే ఒక్కొక్క ముస్లిమ్ 4 గురు ముస్లిమేతరులకు ఇస్లామ్ గురించి చెబితే మనదేశంలోని ప్రతీ ఒక్కరికి ఇస్లామ్ గురించి తెలుస్తుంది. ప్రతీ ముస్లిమ్‌పై సందేశాన్ని అందించే బాధ్యత అల్లాహుతాలా ఉంచారు.

ప్రతీ ముస్లిమ్ మస్జిద్‌కి వచ్చి నమాజ్ చేయాలని కోరుతున్నాం గాని, ఆ విధంగా వచ్చే ప్రతీ ముస్లిమ్‌కి దావా చేయమని ఎందుకు చెప్పలేక పోతున్నాము? ప్రతీ ఒక్కరూ అల్లాహ్ ఆదేశించినట్లు సందేశాన్ని అందిస్తే, దాయీలని పిలవబడేవారికి డబ్బు దొరకదు. వారు తప్పనిసరిగా కష్టపడి పనిచేసుకుని బ్రతకవలసి వస్తుంది.

**4. ధార్మిక జ్ఞానానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదు :** రాజ భవంతులు మాదిరి మస్జిద్‌లు నిర్మిస్తున్నారు. ఎన్నో సౌకర్యాలు కలుగ జేస్తున్నారు. కాని వాటిలో హదీస్ గ్రంథాలు ఉన్నాయా? వాటి కొరకు ఖర్చు చేయడానికి ఆసక్తి కలుగదు. అంతేకాదు గ్రంథాల రూపంలో సత్యం ప్రజలకు అందుబాటులో ఉంటే, అందరూ కాకపోయినా ఒక్కరైనా నిలదీసి అడుగుతారేమోననే భయమే దీనికి కారణమా?

## శాంతిబాట శీర్షికలు మరియు వాటిపై కొందరి స్పందనలు

సమాజంలో నెలకొని ఉన్న సమస్యలను ప్రజలకు వివరించి, వాటి పరిష్కారానికై ఖుర్ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనల ద్వారా వివరించడానికి కొన్ని శీర్షికలతో ప్రారంభించాము.

● "సత్యాన్ని ఇదే విధంగా తెలియజేయండి. ఎవరికీ భయపడవద్దు."

● ఖుర్ఆన్ తఫ్సీర్ చదివేవారి నుండి నిత్యం ప్రశంసలు అందుతూనే ఉన్నాయి. ముస్లిమేతరులు కూడా శాంతిబాటను ప్రశంసించారు. అల్-హమ్‌దులిల్లాహ్!

● 'హదీస్ విజ్ఞానం' శీర్షిక ద్వారా అందులో నిమిడి ఉన్న అద్భుతమైన రీసెర్చ్ విధానాన్ని చెప్పిన తరువాత, చాలామంది తమ అభిప్రాయాలు చెప్పారు, "ఎన్నో సంవత్సరాల నుండి దావా చేస్తున్నాము కాని, సహీహ్ అంటే ఏమిటో, దయీఫ్ అంటే ఏమిటో ఇప్పుడే అర్థం అయింది"

● హదీస్‌లను అందించడంలో ఉత్తమ ప్రమాణాలు పాటిస్తుంది - శాంతిబాట. దీనిలో హదీస్‌కూ ఆధారం దొరుకుతుంది ఏదైనా ఒక టాపిక్ గురించి చెప్పేటప్పుడు, దానికి సంబంధించి 6 హదీస్ గ్రంథాలలో ఉండే మొత్తం హదీస్‌లను అధ్యయనం చేసి అందించడం వలన ప్రజలకు సందేహం లేకుండా విషయాలు స్పష్టమౌతున్నాయి.

● అరబీ భాషపై ఆసక్తి పెరిగే విధంగా, ఆ భాష యొక్క గొప్పతనాన్ని వివరిస్తున్నాం. ఖుర్ఆన్ మరియు హదీస్‌లను చదవమని, సన్మార్గం పొందిన ఖలీఫాల జీవితాలు చదవమని, మరియు అవసరమైన చోట ఖుర్ఆన్ మరియు సున్నత్ వెలుగులో విశ్లేషణ చేసి అందిస్తున్నాము.

● కొత్తగా పెళ్ళయిన జంటలు ముస్లిమ్ మహిళ శీర్షికలోని వ్యాసాలు చదివి, అవి తమకు మేలు చేస్తున్నాయని తెలిపారు. నిజమే! ఖుర్ఆన్ మరియు సున్నత్‌ను పాటిస్తే మేలుగాక మరేమి జరుగుతుంది!

● **అల్లాహ్** : "ఇంతకు పూర్వం ఖుదా, దేవుడు అనేవారము. కాని శాంతిబాట చదివాక 'అల్లాహ్' అంటున్నాము" అని ఎందరో చెప్పారు. మరియు మాచే ప్రచురించ బడిన 'సృష్టికర్త పేరు ఏమిటి?' మరియు ముహమ్మద్(స)వారిపై ప్రపంచ వ్యాప్తంగా జరుగుచున్న దుష్ప్రచారం' పుస్తకాలు చదివిన వారు తమకు తెలియని ఎన్నో విషయాలు ఇప్పుడు తెలుసుకున్నామని చెప్పారు. అలా చెప్పిన వారిలో విద్వాంసులు కూడా ఉన్నారు. రెండు సంవత్సరాల పాటు అహర్నిశలూ పరిశోధన చేసి ఆ పుస్తకాలని తయారుచేయడం జరిగింది.

● తిరిగి గూటికి, టెర్రరిజమ్‌పై వాస్తవాలు, జ్ఞానం-అజ్ఞానం, ఇంటర్‌నెట్‌లో ఇస్లామ్ కబుర్లు మొదలైన వాటివలన ఎందరో పాఠకులు ప్రభావితం అయ్యారు.

● శాంతిబాట ఎడిటోరియల్స్ మరియు వ్యాసాలను చాలా ఊర్లలో ఖుత్బాకి ఉపయోగిస్తున్నారు. శుక్రవారం ఖుత్బాలలో శాంతిబాట పుస్తకాన్ని చేతిలో ఉంచుకుని, కొన్ని గ్రామాలలో చూసి చదువుతూ ప్రసంగించిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికీ ఎన్నో ప్రసంగాలు శాంతిబాట పత్రికలోని సమాచారం పైనే ఆధారపడ్డాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

● నాస్తికుని ప్రశ్నకు సమాధానం, తీవ్రవాదంపై ఆధారాలతో 2 సంవత్సరాలు కొనసాగిన సీరియల్, చరిత్రలో వక్రీకరించబడిన విషయాలపై వాస్తవాలను విశ్లేషించడం మొదలైన విషయాలు బాధ్యత గల సగటు ముస్లిములను ఆలోచింపజేశాయి.

● శాంతిబాటకు అందే ప్రశంసలు అసంఖ్యాకం. అల్-హమ్‌దులిల్లాహ్! అన్నింటని ప్రచురించడం లేదు. అల్లాహ్ అనుగ్రహంతో నడిచే పత్రికకు స్పందన రావడంలో ఆశ్చర్యం లేదు.

## జరుగుతున్న అవినీతిని బయట పెట్టినందుకు శాంతిబాటను విమర్శించ డానికి బదులు ముందుగా నాయకులు తమ నిజాయితీ నిరూపించుకోవాలి

రాజ భవంతులు నిర్మించడం, పేద ప్రజల సొమ్ముతో విమానాలలో, ఎ.సి. ట్రెయిన్లలో, బస్సుల్లో తిరగడం చేస్తున్నారు. అడిగితే తమను తాము ధర్మ పరాయణులుగా, త్యాగమూర్తులుగా వర్ణించుకుంటున్నారు. అదే నిజమైతే పారదర్శకంగా ఉండటానికి ఒక వెబ్‌సైట్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

సంవత్సరానికి కేవలం 5వేల రూపాయలు ఖర్చుపెడితే మంచి వెబ్‌సైట్‌ను నిర్వహించవచ్చు.

- **ప్రతీ జమాత్ ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయాలి.**

- వారికి చెందిన అన్ని మదరసాల వివరాలు వెబ్‌సైట్‌లో పొందు పరచాలి.

- ప్రతీ మదరసాకు సంబంధించి క్రింది వివరాలు పొందుపరచాలి :

**1.** టీచర్ల సంఖ్య **2.** విద్యార్థుల సంఖ్య **3.** సంవత్సరానికి అయ్యే ఖర్చు. **4.** ఫీజుల ద్వారా లభించే ఆదాయం **5.** గల్ఫ్ దేశాల ద్వారా అందే ఆర్థిక సహాయం **6.** లోకల్‌గా అందే సాయం - డబ్బు, బట్టలు,

ఇతర వస్తువులు వగైరా. **7.** లోటు ఎంత? **8.** పరిసర ప్రాంతాలలో ఎన్ని మస్జిద్‌లు ఉన్నాయి. ఒక్కొక్క మస్జిద్ నుండి ఎంత సేకరిస్తే సరిపోతుంది. **9.** అందే ఆర్థిక సహాయాన్ని మస్జిద్‌ల నుండి, వ్యక్తిగతంగా అందే ప్రతీ సమాచారాన్ని ఆయా ప్రాంతాల నాయకులు వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయలి. **10.** అందుకుగాను రాష్ట్ర, జిల్లా, గ్రామ నాయకులకు పాస్‌వర్డ్స్ ఏర్పాటు చేసి అప్‌డేట్ చేసే సౌకర్యాన్ని కల్పించాలి.

అలా జరిగితే వెబ్‌సైట్‌లో పొందుపరచిన వివరాలు సరియైనవో, కావో ఆ ఊరిలో ఉన్నవారు తనిఖీ చేయగలుగుతారు. ఉదాహరణకు అటువంటి మదరసా ఆ ప్రాంతాలోనే లేకపోవచ్చు, అప్పుడు ఆ విషయాలను వెంటనే వెబ్‌సైట్‌కి ఫిర్యాదు పంపించడానికి వీలు కల్పించాలి.

కొన్ని మస్జిద్‌లలో ఎ.సి. మెషీన్లు ఉన్నాయి. మరికొన్నింటిలో ఇన్వర్టర్స్ ఉన్నాయి. జనరేటర్ సౌకర్యం కలిగిన మస్జిద్‌లు కూడా ఉన్నాయి. లేటెస్ట్ టెక్నాలజీని వాడుకునే ఆసక్తి అందరికీ ఉంది.

ఇంత టెక్నాలజీ తెలిసినవారు, మదరసాల బ్యాంక్ ఎకౌంట్‌లో డబ్బు జమ చేయవచ్చని తెలుసుకోలేక పోయారా? కాశ్మీర్ నుండి మన రాష్ట్రంలోని ఓ మామూలు పట్టణానికి కూడా మదరసా చందా కోసం రావడమా? ఈ దారి ఖర్చులు వృథా, వారి సమయం వృథా. అసలు ఆ వచ్చిన వ్యక్తి మదరసా వ్యక్తి అవునో కాదో తెలియదు. మదరసా ప్రయోజనానికా? లేక వ్యక్తిగత ప్రయోజనానికా?

ఇదే విధంగా ఇతర ఫండ్స్ గురించి మరియు ఇతర ఖర్చుల గురించి వెబ్‌సైట్‌లో పొందుపరచండి. ప్రజలు ప్రభుత్వ అధికారులను నిలదీయ లేకపోవచ్చు. కనీసం మీ జమాత్ నాయకులను నిలదీయలేరా? అల్లాహ్ ఆదేశాలను పెడచెవిని పెట్టిన ప్రతీ జాతి నాశనం అయిపోయింది.

కాబట్టి జమాత్‌లు ఖర్చు పెట్టే ఖర్చులో 'వెబ్‌సైట్' కోసం చేసే ఖర్చు లెక్కలోకే రాదు. కూరలో కరివేపాకు అంత కూడా ఖర్చు కాదు.

ఎటువంటి ఆర్థిక వనరులు లేకపోయినా శాంతిబాట రెండు వెబ్‌సైట్లను నిర్వహిస్తుంది. టీమ్ వారే డిజైన్ చేసుకున్నారు. వారే ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నారు.

### మా వెబ్‌సైట్స్

**www.saanthibaata.net & www.saanthibaata.com**

శాంతిబాట కాపీలు పోస్ట్ కాగానే, వెబ్‌సైట్‌లో ఆ సంచికను అప్‌లోడ్ చేస్తున్నాము. ఉచితంగా చదువుకునే అవకాశాన్ని ఏర్పాటు చేశాము. ఈ విధంగా ఏ పత్రిక చేసింది?

## నచ్చితే స్వీకరించండి. బలవంతమేమీ లేదు

కూరలో రుచి కోసం వేసినది ఏదైనా నచ్చకపోతే, తినేటప్పుడు దానిని కంచం నుండి తీసేస్తారు. దాని గురించి మొత్తం కూరను నిషేధించుకోరు.

ప్రతీ న్యూస్ పేపర్లో రాజకీయాల గురించి, సినిమాల గురించి, ఫ్యాషన్ల గురించి, ఆర్థిక లావాదేవీల గురించి, స్పోర్ట్స్ మొదలైన వాటి గురించి సమాచారం ఉంటుంది. ప్రతీ ఒక్కరూ ప్రతీ సమాచారాన్ని చదవరు. అన్నింటిపై ఆసక్తి ఉండదు.

తనకి ఇష్టంకాని రంగం గురించి ఉంటే, ఆ పత్రికకు ఫోన్ చేసి ఆ రంగానికి సంబంధించి ప్రచురించకండి అని చెప్పరు. ఆ విధంగా అందరి అభిప్రాయాలు తీసుకుంటే ఏ రంగానికి చెందిన సమాచారం ఇవ్వనవసరం ఉండదు. చివరికి ఆ పేపర్ అవసరమే ఉండదు.

**ఒక వ్యక్తి కోసమే ఓ న్యూస్ పేపర్‌గాని, ఓ పత్రికగాని ప్రచురించ బడదు అనే ఇంగిత జ్ఞానం కొందరిలో లోపించింది.**

## సమాజ సంస్కరణ

మంచిని బోధించడం, చెడును నిరోధించడం ద్వారానే సమాజ సంస్కరణ సాధ్యమౌతుంది. ఆ విధంగా అల్లాహ్‌యే ప్రతీ ముస్లిమ్‌ని ఆదేశించారు. మాపై ఉన్న ఆ ఆదేశాన్ని అమలు చేయడంలో అల్లాహ్ మాకు సహాయం చేస్తున్నారు.

ఒకే జమాత్‌కి చెందిన ఇద్దరు ఆలిమ్‌లు ఒకరి తరువాత ఒకరు ఒకేచోట ఒకే విషయంపై రెండు విభిన్న అభిప్రాయాలు చెబితే విని ఊరుకుంటారు. వీరిని నాయకులు పట్టించుకోరు. కారణం ఇద్దరూ తమ వారే! అసత్యం పలికినా కూడా తమవారే కదా అని వదిలేయడం జరుగుతుంది.

- **అబద్ధం చెప్పవద్దంటే అబద్ధాలు చెప్పి బ్రతికేవాడికి కోపం**
- **నిజాయితీగా జీవించమంటే అవినీతిపరుడికి కోపం.**
- **షిర్క్ చేయవద్దంటే ముష్రిక్‌కు కోపం**
- **కష్టపడి బ్రతకమని హితబోధ చేస్తే దాయీకి కోపం**
- **బాధ్యతను సక్రమంగా నిర్వర్తించమంటే నాయకునికి కోపం**
- **ముస్లిములంతా ఐక్యంగా ఉండాలని కోరితే మునాఫిక్‌లకు కోపం**
- **ఖుర్'ఆన్ మరియు సున్నత్‌ల ప్రకారంగా సత్యాన్ని మాత్రమే చెబితే ఎందరికో కోపం**

**వీరి కోపాలను పట్టించుకుని మౌనంగా ఉంటే మనకు పాపం.**

శాంతిబాటను ఆదరించే వారికి మరియు వ్యతిరేకించే వారికి మా సంకల్పం ఏమిటో స్పష్టంగా అర్థమై ఉంటుందని భావిస్తున్నాము - శాంతిబాట టీమ్.

శాంతిబాట పాఠకులు సులభంగా ధర్మ సందేశాన్ని తన తోటివారికి అందించ గలుగుతున్నారు. వారు చెప్పలేకపోతే 'శాంతిబాట' కాపీ వారికిచ్చి చదవమని చెబుతున్నారు. ధర్మ సందేశ ప్రచారం సులువైంది.

ప్రతీ పాఠకుడు శాంతిబాట కోసం ఒక రోజుకి కేవలం 50 పైసలు ఖర్చు పెడుతున్నారు. ఓ పాఠ్య పుస్తకంలో సిలబస్ ప్రకారం పాఠాలు

అందించే విధంగా శాంతిబాటలో వ్యాసాలు అందిస్తున్నాము.

పాఠకుల ద్వారా అందే సంవత్సర చందా, పత్రిక ప్రచురణకు మరియు నిర్వహణకు సరిపోదు. సరిపోయే పరిస్థితి అల్లాహ్ కారుణ్యంతో ఏర్పడినప్పుడు, తక్కువ ఖరీదుకే అందించడానికి ప్రయత్నిస్తాము. సంవత్సరానికి అదనంగా మరో 200 రు॥లు ఖర్చు చేయగలిగే పాఠకులు, వీలైతే మరో కాపీ తీసుకుని మీ బంధువుల చేత లేదా స్నేహితుల చేత చదివించండి.

## ముఖ్య ప్రకటన

**ఖుర్‌ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనలను, ఖలీఫాలను అనుసరిస్తూ నిర్వహించబడే శాంతిబాటపై చర్య తీసుకునే అధికారం ఏ జమాత్‌కీ లేదు**

**శాంతిబాట ఖుర్‌ఆన్ పఠించేవారిది. ముహమ్మద్(స)వారిని ప్రేమించే వారిది. ప్రామాణిక హదీస్‌లను నిస్సందేహంగా స్వీకరించే వారిది. అంతేగాని ఇది ఏ జమాత్‌కు అనుకూలం గాని, వ్యతిరేకంగాని కాదు.**

**ఒకవేళ పొరపాటున ఇస్లామ్‌కి వ్యతిరేకంగా ఏదైనా విషయం ప్రచురించ బడితే దాని గురించి ఖుర్‌ఆన్ మరియు హదీస్‌ల వెలుగులో ఎవరైనా ఆ తప్పును మా దృష్టికి తీసుకురావచ్చు. మరియు మమ్మల్ని హెచ్చరించే నైతిక బాధ్యత కూడా వారికి ఉంది. అంతేగాని ఆధారాలు లేకుండా అరిచే ఏ అరుపుకి కూడా ఎటువంటి స్పందన కూడా మా వైపు నుండి లభించదు.**

**రాష్ట్రంలో సాక్షి, ఈనాడు, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి ఇలా ఎన్నో న్యూస్ పేపర్లు ఉన్నాయి. వాటిలో ఇస్లామ్‌కి వ్యతిరేకంగా ఎన్నో వార్తలు ప్రచురించ బడ్డాయి. అవి చదవవద్దని ఏ జమాత్ నాయకులు ఏనాడూ చెప్పలేదు. చెప్పే ధైర్యం కూడా వారికి లేదు.**

**మరి ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌ల ప్రకారంగా నడిచే శాంతిబాటను చదవ వద్దని ఎలా చెప్పగలుగు తున్నారు? (జ్ఞానం లేని) ఆలిమ్ దాయీల సమూహం కారులో ప్రతీ మస్‌జిద్‌కి వెళ్ళి చదవ వద్దని చెప్పారు. మునాఫిక్‌ల భాగోతాన్ని, ఇదే విధంగా వీరు అందరికీ ఎందుకు చెప్పలేదు? ఎందుకంటే వీరు కూడా ఆ జాతివారే కనుక.**

**ఏ జమాత్ వారికైనా ఇబ్బంది కలిగించే విషయాలు శాంతిబాటలో ఉండవు. కేవలం సత్యమే ఉంటుంది. అన్ని జమాత్‌లకు చెందిన సోదరసోదరీమణులు శాంతిబాటను ఆదరిస్తున్నారు.**

## ప్రకటన

**మా సొసైటీల పేర్లు చెప్పి మేము ప్రచురించిన పుస్తకాలు చూపి, సభ్యులమని చెప్పుకుని ఎవరైనా మస్‌జిద్‌ల కోసం గాని, మదరసాల కోసం గాని లేక ఇతరత్రా విరాళాల కోసం వస్తే, వారు మా సభ్యులు కాదని తెలుసుకోండి. మేము విరాళాల కోసం ఎవరినీ కోరలేదు. ఇన్షా అల్లాహ్ ఎవరినీ కోరము అల్లాహ్ నుండి తప్ప - శాంతిబాట టీమ్**

## శాంతిబాటను అభిమానిస్తారు ఇన్షా అల్లాహ్!

అల్లాహ్ పట్ల భీతి ఉన్నవారి చేత శాంతిబాట సంచికలన్నింటిని చదివించండి. వారు ఏ జమాత్‌వారైనా ఫర్వాలేదు. వారికి తెలుగు రాకపోతే, ఉర్దూలో అనువాదం చేసి వినిపించండి. తరువాత వారి అభిప్రాయాన్ని అడగండి. అందులో కనీసం ఒక్కరు కూడా శాంతిబాటను ఇన్షా అల్లాహ్ వ్యతిరేకించరనే విశ్వాసం మాకుంది.

'దావా'కు శాంతిబాట వ్యతిరేకం కాదు. దానిని వ్యాపారంగా మార్చి బిద్'అత్‌కు పాల్పడుతున్న దాయీలకు, కుహనా జ్ఞానులకు మాత్రమే వ్యతిరేకం. ప్రతీ ముస్లిమ్ దావా చేయాలి. అది ఫర్జ్.

'మదరసా'లకు శాంతిబాట వ్యతిరేకం కాదు. కేవలం మదరసాలలోనే తమ పిల్లలను చదివించాలని తల్లిదండ్రులు పోటీ పడేలా ఉన్నత ప్రమాణాలతో కలిగి ఉండేలా మదరసాలు అభివృద్ధి చెందాలనేది మా కోరిక.

## సవరణ :

గత సంచికలో పేజీ 30 లో 2వ కాలమ్‌లోని 5వ పేరాలో 'బాధ్యతను ఇమామ్‌పై ఉంచాలి' అని అచ్చు కావడానికి బదులు 'బాధ్యతను ఇస్లామ్‌పై ఉంచాలి' అని అచ్చయింది. దానిని సవరించుకోమని మనవి చేస్తున్నాము.

అబూబకర్ సిద్దీఖ్(రజి)వారు చెప్పారు : మీరు ఈ ఆయత్‌ను చదువుతారు, *"ఓ విశ్వాసులారా! మీ స్వయానికి మీరు బాధ్యత వహించండి. మీరు సన్మార్గంలో ఉంటే, మార్గభ్రష్టులైన వారు మీకు ఎలాంటి హాని చేయలేరు. మీరంతా అల్లాహ్ వైపునకే మరలిపోవలసి ఉంది. అప్పుడు ఆయన మీరేమి చేస్తూ ఉండేవారో మీకు తెలియజేస్తాడు."* అల్లాహ్ సందేశహరులు(స) చెబుతుండగా నేను విన్నాను, **"ఎప్పుడైతే ప్రజలు చెడు చేసేవానిని చూసి, వారు అతనిని చేతితో ఆపరో, త్వరలో అల్లాహ్ వారందరినీ తన శిక్షలో చుట్టివేస్తాడు"** **(తిర్మిదీ, సహీహ్ హదీస్ నెం. 2168, సంపుటి 4, 31-అల్‌ఫితన్, 8వ అధ్యాయం)**

---

హుదైఫా బిన్ యమన్ (రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స) చెప్పారు: **"నా ప్రాణం ఎవరి చేతిలో ఉందో ఆయన సాక్షి మీరు తప్పనిసరిగా మంచిని ఆదేశించాలి మరియు చెడును ఆపాలి లేకపోతే నిశ్చయంగా అల్లాహ్ మీపై తనవైపు నుండి శిక్ష పంపుతాడు. మరియు మీరు ప్రార్థిస్తారు కాని మీ వేడుకోలు ఆమోదించబడవు."** **(తిర్మిదీ, హసన్ హదీస్ నెం. 2169, సంపుటి 4, 31-అల్‌ఫితన్, 9వ అధ్యాయం)**

# మస్‌జిద్‌లు విజ్ఞాన కేంద్రాలు 4

మస్‌జిద్‌లో సలాత్ (నమాజ్) చేసేవారు, ఇమామ్ రుకూలోకి వెళ్ళిన తరువాత రుకూలోకి వెళతారు, ఆయన సజ్దాలోనికి వెళ్ళిన తరువాత సజ్దాలోకి వెళతారు. ఇమామ్ కంటే ముందుగా ఏదీ చేయరు. అలా చేయకూడదు. మస్‌జిద్‌లో హాజరైన జమాత్‌కి ఇమామ్ నాయకత్వం వహించి ఫర్జ్ సలాత్ చేయిస్తారు.

మదీనాలోని మస్‌జిదె నబవీ యొక్క తొలి ఇమామ్ ముహమ్మద్(స) వారు. రెండవ ఇమామ్ అబూ బక్ర్ సిద్దీఖ్(రజి)వారు.

ప్రతీ శుక్రవారం తప్పనిసరిగా మన పరిస్థితులను బట్టి, ఏయే అంశాలు ఖుత్బాలో చెప్పాలో, ఆ విధంగా చెప్పి మనల్ని సంస్కరించే బాధ్యత తీసుకోవలసిన వ్యక్తి ఇమామ్.

కాని ప్రస్తుత సమాజంలో ఆయనకు జీతమిచ్చే పెద్దలు గాని, మస్‌జిద్ కమిటీ వారు గాని ఎలా చెబితే 'అలాగే' నంటూ చేతులు కట్టుకుని తల ఊపవలసిన పరిస్థితి 'ఇమామ్'కి ఏర్పడింది.

అసలు ఇమామ్ యొక్క బాధ్యతలు ఏమిటి? ఆయన పట్ల మనం ఎలా వ్యవహరించాలి? అనే విషయాల గురించి ముందుగా మనం తెలుసుకోవాలి. ఇమామ్ బాధ్యతాయుతంగా ఖుర్'ఆన్ మరియు సున్నత్‌ల ప్రకారంగా వ్యవహరిస్తే అక్కడి పరిసరాలలో సంస్కరణకు, ఇన్షా అల్లాహ్, అవకాశం ఉంటుంది.

అంతేకాకుండా, ఆ పరిసరాలలో ఉండేవారు ఆయన ద్వారా ఇస్లామీయ విజ్ఞానాన్ని నేర్చుకుంటారు. ఆ విజ్ఞానంతో మరియు ఆ విజ్ఞానం ద్వారా సంస్కరించుకోబడిన తన ఆచరణతో అక్కడి ప్రతీ ముస్లిమ్ ఇస్లామ్ ధర్మ సందేశాన్ని మాటలు, చేతల ద్వారా తోటివారికి అందించ గలుగుతాడు.

ఈ మధ్య కొన్ని ప్రకటనలు మస్‌జిద్ గోడలపై దర్శనమిస్తున్నాయి. ఒక నెల దావా కోర్స్, రెండు వారాల దావా కోర్స్. లిమిటెడ్ సీట్స్. ఫీజు ఫలానా ఫలానా. ఏ స్థాయికి దిగజారడం జరిగిందో అర్థమౌతుంది.

ఆకలేసిన వాడికి ముందుగా అన్నం పెట్టాలి. అన్నం ఎన్ని రకాలుగా తినాలో ఆ టెక్నిక్స్ నేర్పడం కోసం ప్రత్యేక శిక్షణ అతనికి అవసరం లేదు. ముందుగా మనిషికి ధార్మిక విజ్ఞానం కావాలి. అది అందిన తరువాత ఎవరూ అతనికి ప్రత్యేక శిక్షణలు ఇవ్వనవసరం లేదు. ముహమ్మద్(స)వారు తన అనుచరులకు ఇచ్చిన శిక్షణ మరియు మనల్ని ఆదేశించి మనకు సూచించిన శిక్షణ ఆ విజ్ఞానంలో ఒక భాగమే.

ముస్లిములకు జ్ఞానాన్ని అందించే మస్‌జిద్ వ్యవస్థను కూల్చేశారు. తిరిగి దానిని నిలబెట్టాలి. అది మనపైనున్న బాధ్యత.

సరియైన ఇమామ్‌ను మస్‌జిద్‌కు నియమించుకుని, ఇస్లామ్ ప్రకారంగా అతని బాధ్యతలను నిజాయితీగా నిర్వహించుకునే విధంగా అతనికి స్వేచ్ఛనిస్తే, ఆ మస్‌జిద్‌కి వచ్చేవారిలో, ఆ మస్‌జిద్ పరిసరాలలో ఉండేవారిలో జ్ఞాన వెలుగు ఇన్షా అల్లాహ్ మొదలవుతుంది.

మస్‌జిద్‌లకు అవసరమైనంత మేరకే ఖర్చు పెట్టి, అనవసర ఖర్చులు తగ్గించుకుని, ప్రయోజనం లేని సమావేశాలకు, ప్రోగ్రామ్‌లకు మరియు దాయీలకు విరాళాలు మానుకుంటే, 'ఇమామ్'కి మంచి జీతం ఇవ్వగలుగుతాము.

## ఇమామ్ బాధ్యతలు

రోజూ 5 సార్లు నమాజ్ చేయించడం, వివాహాలు జరిపించడం, మరణించిన వారి జనాజా చేయించడం మాత్రమే ఇమామ్ బాధ్యత అయితే, ప్రత్యేకంగా ధార్మిక జ్ఞానమున్న వ్యక్తి అవసరం లేదు.

ఎవరో ఒక ముస్లిమ్‌కి 2 నెలలు శిక్షణ ఇస్తే సరిపోతుంది. కాని ఇమామ్ బాధ్యత కేవలం పైన చెప్పిన వాటికే పరిమితం కాదు. ఇమామ్‌పై ఇస్లామ్ ఉన్నతమైన మరియు గౌరవనీయమైన బాధ్యతను ఉంచింది.

ముందుగా ఇమామ్ ఎన్నిక గురించి చెప్పుకుందాం.

అబూ మస్'ఊద్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు: **"అల్లాహ్ గ్రంథంపై ఎక్కువ జ్ఞానం గల వ్యక్తిని ప్రజలకు ఇమామత్ చేయనివ్వండి. ఒకవేళ అందరూ అల్లాహ్ గ్రంథంపై జ్ఞానంలో సమానంగా ఉంటే అప్పుడు ఎవరైతే ముందుగా హిజ్రత్ చేసిన వ్యక్తిని చేయనివ్వండి.** (ఒకవేళ) **వారు హిజ్రత్ విషయంలో సమానమైతే, సున్నత్‌పై ఎక్కువ జ్ఞానమున్న వ్యక్తిని చేయనివ్వండి. వారు సున్నత్ జ్ఞానంలో సమానంగా ఉంటే వారిలో వయస్సులో పెద్దవారిని చేయనివ్వండి. ఒకరి అధికారం ఉన్న చోట అతనికి మరొకరు ఇమామత్ చేయకూడదు మరియు అతని గౌరవ స్థానంలో కూర్చోకూడదు, అతడు అనుమతి ఇస్తే తప్ప.**
(నసాయీ, సహీహ్, 781, పుస్తకం 10, అధ్యా.3, సంపుటి 1)

ఇమామ్ (ప్రార్థనకు నాయకత్వం వహించిన వ్యక్తి) తనను ప్రార్థనలో అనుసరించేవారి కంటే మేలైన వ్యక్తి అయివుండాలి. తొలి ప్రాధాన్యత ఖుర్'ఆన్‌పై జ్ఞానం. ఇక్కడ ఒక విషయం అర్థం చేసుకోవాలి. కేవలం ఖుర్'ఆన్ కంఠస్థం చేసేసి, ఆ గ్రంథంపై జ్ఞానం లేకపోతే, అతనికి ప్రాధాన్యత ఇవ్వబడదు. జ్ఞానం యొక్క మెరిట్ గొప్పది కేవలం పఠనం కంటే.

మస్‌జిద్‌కి ఇమామ్ కావాలంటే అతడు హాఫిజ్ లేదా ఆలిమ్ తప్పనిసరి కానవసరం లేదు. అంటే హాఫిజ్, ఆలిమ్‌లను ఇమామ్‌లుగా నియమించు కోవద్దని కాదు. వారు మాత్రమే ఇమామత్ చేయాలని నిబంధన లేదు. కాని ఇమామ్‌కి ఖుర్'ఆన్ మరియు సున్నత్ పట్ల జ్ఞానం అక్కడ ఉండేవారి కంటే ఎక్కువ ఉండాలి.

మస్జిద్ ఇమామ్‌గారు ఉండగా, మరొక చోట నుండి అతని కంటే ఎక్కువ జ్ఞానంగల వ్యక్తి వస్తే, అక్కడి ఇమామ్ అనుమతిస్తే తప్ప ఆ వచ్చిన వ్యక్తి ఇమామత్ చేయకూడదు.

ఖుర్‌ఆన్ జ్ఞానంతో పాటు సున్నత్‌పై జ్ఞానం కూడా కలిగి ఉండాలి. మనలో ఒకరిని ఇమామ్‌గా నియమించుకోమన్నారు. కాని ఖచ్చితంగా ఎక్కువ జ్ఞానం ఉన్నవారినెవరినైనా వేరే చోట నుండి తీసుకురావాలి అని నిబంధన పెట్టలేదు. జ్ఞానం ఫలానా స్థాయిలో ఉండాలని కూడా చెప్పలేదు.

ప్రతీ ముస్లిమ్‌కి ఖుర్‌ఆన్ మరియు సున్నత్ పట్ల 'జ్ఞానం' తప్పనిసరిగా ఉండాలి. ఎందుకంటే జ్ఞానానికి తఖ్వాకి సంబంధం ఉంది. క్రింది ఖుర్‌ఆన్ ఆయత్ చూడండి :

"నిశ్చయంగా, అల్లాహ్ యొక్క దాసులలో
**జ్ఞానం గలవారు మాత్రమే ఆయనకు భయపడతారు.**
నిశ్చయంగా అల్లాహ్ సర్వశక్తిమంతుడు, క్షమాశీలుడు"
(ఖుర్‌ఆన్ 35:28)

ఖుర్‌ఆన్‌లో మొదటి సూరహ్, 'అల్-ఫాతిహా' తరువాత చెప్పబడిన రెండు ఆయత్‌లు చూడండి.

**అలిఫ్-లామ్-మీమ్. ఇది (ఈ ఖుర్‌ఆన్) ఒక దివ్యగ్రంథం. ఇందులో ఏ మాత్రం సందేహం లేదు. అల్లాహ్ పట్ల భయంగలవారికి (ముత్తఖీన్‌లకు) ఇది మార్గ దర్శకత్వం.** (ఖుర్‌ఆన్ 2:1-2)

అల్లాహ్ పట్ల ఉండవలసిన భయం (తఖ్వా) కలగాలంటే జ్ఞానం తప్పనిసరిగా ఉండాలి.

జ్ఞానం పెరిగే కొద్దీ తఖ్వా పెరుగుతూ ఉంటుంది. తఖ్వా పెరిగే కొద్దీ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించే అవకాశం ఉంటుంది.

**ఈ జ్ఞానాన్ని ఎలా పొందాలి?** 'దగ్గరలో మదరసా కూడా లేదే!' అని విచారపడవలసిన అవసరం లేదు. ప్రతీ ఒక్కరూ మదరసాలోనే చదువుకునే జ్ఞానాన్ని పొందారా?

రెండవ ఇమామ్ అబూ బక్ర్ సిద్దీఖ్(రజి)వారు ఎక్కడ జ్ఞానాన్ని నేర్చుకున్నారు? తొలి ఇమామ్ - ముహమ్మద్(స)వారి దగ్గర నేర్చు కున్నారు. ఇమామ్‌గారి సహాయంతో గ్రంథాలు అధ్యయనం చేస్తూ ఉంటే జ్ఞానం లభిస్తుంది.

ఇమామ్‌ని సలాత్‌లో అనుసరిస్తున్నాము. ఆయన కంటే ముందు ఏదీ చేయకూడదని ప్రవక్త(స)వారు మనల్ని వారించారు. నాయకునికి స్థాయి కల్పించారు అల్లాహుతాలా. ఇస్లామ్‌లో ఇమామ్‌కి గౌరవస్థానం ఉంది. అంతేకాకుండా ఇమామ్‌పై అతి ముఖ్యమైన సమాజ సంస్కరణ బాధ్యత ఉంది.

## విద్వాంసుడు మరియు ఇమామ్

మదరసాలో టీచర్ అయినా లేదా మదీనా యూనివర్శిటీలో టీచర్ అయినా, ఆ టీచర్ నాలుగు గోడల మధ్య తమ విద్యార్థులకు పాఠాలు బోధిస్తారు. అది చాలా బాధ్యతాయుతమైనది. చాలా ముఖ్యం కూడా. అయితే సమాజ సంస్కరణ బాధ్యత విషయానికొస్తే, ఆ విషయంలో ముఖ్యమైన పాత్ర ఇమామ్‌దే.

ఇమామ్ నిత్యం ప్రజలతో మమేకమై ఉంటారు. వారితో సంభాషిస్తూ ఉంటారు. దాని వల్లనే వారిని సంస్కరించే అవకాశం కూడా ఇమామ్‌కే ఎక్కువగా ఉంటుంది. కొన్ని రోజులుగా ఎవరైనా మస్జిద్‌కి రాకపోతే ఆ విషయాన్ని సులభంగా గమనించ గలిగేది కూడా ఆయనే. అప్పుడు ఇమామ్‌గారు ఆ వ్యక్తి ఎందుకు రాలేదో వాకబు చేస్తారు లేదా అతని ఇంటికి వెళతారు. అతని సమస్య ఏదైనా ఉంటే తెలుసు కోగలుగుతారు. దానిని జమాత్‌లో వివరించి పరిష్కరించే అవకాశం ఉంటుంది.

కాబట్టి ఇమామ్‌కి ఆ ప్రాంతంలో నెలకొని ఉన్న సాంఘిక పరిస్థితుల గురించి ముందుగా తెలియాలి. కొందరు కొన్ని సాంఘిక దురాచారాలకు తెలియక అలవాటు పడినవారు ఉండవచ్చు. వాటిని దృష్టిలో ఉంచుకుని వారిని సంస్కరించే బాధ్యతను ఆయన స్వీకరించాలి.

తదనుగుణంగా శుక్రవారం ఖుత్బాలలో ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌ల ద్వారా ఆ దురాచారాలకు పరిష్కారాన్ని తెలియజేస్తూ, వారిని కనిపెట్టుకుని ఉండాలి. శుక్రవారం నాడు ఇమామ్ చేసే ప్రసంగం చాలా ముఖ్యమైనది. **కాని నేడు సమాజ సంస్కరణకు ప్రాధాన్యత నిస్తూ చేయవలసిన ఈ ప్రసంగాల రూపం మారిపోయింది.**

ఈ అవకాశాన్ని చాలా చోట్ల ఇమామ్‌లు దుర్వినియోగం చేసు కుంటున్నారు. కొన్ని కారణాల వలన ముస్లిమ్ సమాజం వివిధ జమాత్‌లుగా ఏనాడో చీలిపోయింది. జరిగిందేదో జరిగిపోయింది. కాని వారి మధ్య శాంతి సామరస్యాలు పెంచవలసిన బాధ్యత ఇప్పుడు ఇమామ్ తీసుకోవాలి. పూర్వం తండ్రి సంరక్షణలో కలిసి పెరిగిన ఇద్దరు అన్నదమ్ములు నేడు విడి విడిగా జీవిస్తున్నారనుకుందాం. విడివిడిగా జీవించినా వారు సోదరులే. శత్రువులు కాదు. వారి మధ్య బంధమూ మారిపోలేదు.

దురదృష్టవశాత్తు, కొన్ని చోట్ల ఈ జుమ్మా ప్రసంగాలు అగ్నిని రగిలించేలా తయారయ్యాయి. ఒక జమాత్ ఇమామ్ మరొక జమాత్ గురించి విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం అలవాటు చేసుకోవడం జరిగింది. దాని వలన ఏ నిర్మాణాత్మక బాధ్యత అయితే తనపై ఇస్లామ్ ఉంచిందో దానికి భిన్నంగా వినాశనానికే మార్గాన్ని సుగమం చేయడం జరుగుతుంది.

మనిషి జీవితంలో 'యవ్వన కాలం' యొక్క ప్రాముఖ్యతను తెలిపే హదీస్‌లెన్నో ఉన్నాయి. ఓ విశ్వాసి తన యవ్వన కాలాన్ని సద్వినియోగం చేసుకోవలసి ఉంది. కాబట్టి యువకుల బావోద్రేకాలను గమనిస్తూ,

ఇమామ్ తన ప్రసంగాలలో లేదా వారితో జరిపే సంభాషణలలో వారి నడవడిక ఇస్లామ్‌కు అనుగుణంగా ఏ విధంగా ఉండాలో ప్రస్తావించి, సమయాన్ని బట్టి మరియు సందర్భాన్ని బట్టి ప్రేమతో హితబోధ చేయాలి.

ఉదాహరణకు రమదాన్ నెల చివరి పదిరోజులలో ఖద్ర్ రాత్రి వస్తుంది. ఆ ఘనమైన రాత్రి ప్రార్థనలలో గడిపితే లభించే పుణ్యం గురించి చెబుతారు గాని, అదే రాత్రి ఎక్కువ మంది ప్రార్థనలలో ఉంటే కొందరు యువకులు రోడ్లపై ఇస్లామ్ నేర్పిన సంస్కారానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ, వీధి దీపాలు పగలగొట్టడం, బైక్‌లపై అరుచుకుంటూ మితిమీరిన వేగంతో షికార్లు చేయడం చేసుంటారు. ముస్లిమేతరుల ఇండ్లపై రాళ్ళు రువ్వడం చేసుంటారు. ఇంకా ఇటువంటి ఎన్నో పనులు చేస్తుంటారు. ఇటువంటి వాటిని ఆపి యువకులకు హితబోధ చేయవలసిన బాధ్యతను కూడా ఇమామ్‌గారు తీసుకోవాలి.

పాఠకులు ఈ సందర్భంగా ఓ విషయాన్ని గమనించాలి. సమాజ సంస్కరణ బాధ్యత ఇమామ్‌పై ఉంది అంటే, దానర్థం మనపై లేదని కాదు. ఇదే సంచికలో ముస్లిమ్ సమాజంలో నెలకొన్ని ఉన్న సమస్యల గురించి చెప్పడం జరిగింది. అటువంటి వాటిపై సరియైన అవగాహన ఇమామ్‌గారు కలిగి ఉండాలి.సాంఘిక సంక్షేమానికై ఇస్లామ్ ఇచ్చిన ఆదేశాలు సరిగ్గా అమలు అవుతున్నాయా? లేదా? అనే విషయంపై కూడా ఇమామ్‌గారు పర్యవేక్షించాలి.

అతి ముఖ్యంగా ఇమామ్ తెలుసుకోవలసిన విషయం ఏమిటంటే, మనం ఏ పరిపాలనలో ఉన్నామో అక్కడి చట్టం గురించి స్పష్టంగా తెలుసుకోవాలి. ఒకే దేశంలో అన్ని చోట్ల ఒకే పరిస్థితి ఉండదు. పూర్తిగా ముస్లిములే నివశించే ప్రాంతంలో పరిస్థితి ఒక విధంగా ఉంటే, ఇతర ధర్మాల వారి మధ్య ముస్లిములు నివశించే టప్పుడు పరిస్థితి మరో విధంగా ఉంటుంది.

గుజరాత్‌లోని పరిస్థితులు మరియు ఆంధ్రప్రదేశ్‌లోని పరిస్థితులు ఒకే విధంగా ఉండవు, ఆ రెండు రాష్ట్రాలు ఒకే దేశంలో మరియు ఒకే చట్టం పరిధిలో ఉన్నప్పటికీ.

అటువంటి భిన్న పరిస్థితులలో ఇమామ్ ఏ విధంగా వ్యవహరించాలి?

ఇటువంటి పరిస్థితులలో సరియైన విధంగా వ్యవహరించడానికి ఇమామ్‌కు సీరత్‌పై మంచి అవగాహన ఉండాలి. ముహమ్మద్(స)వారి జీవిత చరిత్ర మరియు సన్మార్గం పొందిన నలుగురు ఖలీఫాల జీవిత చరిత్రలు క్షుణ్ణంగా చదవాలి. వారి పాలనలో ఎదురైన పరిస్థితులను వారు ఎలా చక్కబెట్ట గలిగారో తెలుసుకోవాలి.

మక్కా నగరంలో ముహమ్మద్(స)వారు ముస్లిములకు నాయకత్వం వహించినపుడు, వారు చాలా తక్కువ మంది ఉన్నారు. కాని వారిని హింసించే ముష్రిక్‌లు అత్యధికంగా ఉన్నారు. అటువంటి పరిస్థితులలో ముహమ్మద్(స)వారు తన అనుచరులకు ఎటువంటి శిక్షణ ఇచ్చారో గుర్తు చేసుకోవాలి.

మదీనా నగరంలో ఎదురైన పరిస్థితులు దీనికి భిన్నమైనవి.

పరిస్థితులకు అనుగుణంగా ఇస్లామీయ ఆదేశాలను ప్రశాంతంగా ప్రజలు పాటించగలిగేలా సూచనలు ఇస్తూ ఉండాలి.

ఒకప్పుడు మన దేశంలో సరియైన విధానంలో ఇస్లామీయ వ్యవస్థ ఉండిందో లేదో స్పష్టంగా చెప్పలేము. కాని ఇప్పటికంటే మేలైనదిగా ఉండి ఉంటుంది అని చెప్పడంలో సందేహం లేదు. అయితే దానిని కూడా ఇటీవల కాలంలో కూల్చివేశారు.

కూలిపోయిన ఇంటిని తిరిగి నిర్మించేందుకు పని ప్రారంభినట్లే, కూలిన మన ఇస్లామ్ వ్యవస్థను తిరిగి నిలబెట్టుకోవాలి. అల్లాహ్ అనుగ్రహాలు వర్షించ బడతాయి ఇన్షా అల్లాహ్! ప్రతీ ముస్లిమ్ ఈ ప్రయత్నంలో భాగస్వామి కాకపోయినా, కనీసం స్థిరమైన విశ్వాసం కలిగిన ముస్లిములైనా భాగస్వాముల కావాలి. అందుకొరకు మరలా ప్రత్యేకమైన సంస్థల అవసరం లేదు. ప్రత్యేక బానర్లు, ప్రత్యేక జమాత్‌లు, అసోసియేషన్లు అవసరం ఎంత మాత్రం లేదు.

ఎవరికి వారు తమ స్వంత బాధ్యతగా తీసుకుని అల్లాహ్ కోసం ఈ పని తాను ఉండే చోట ప్రారంభించాలి. దీని కొరకు ఆర్థిక వనరుల అవసరం ఎంత మాత్రం లేదు.

ఇమామ్‌కి మాత్రమే బాధ్యతలున్నాయా?

**ముస్లిములకు ఆయన పట్ల బాధ్యతలు లేవా?**

ముస్లిమ్ సమాజ సంస్కరణ కోసం ఆయన బాధ్యత తీసుకుని, తన సమయాన్ని దాని కొరకు కేటాయించినప్పుడు, ఆయన మరియు ఆయన కుటుంబ అవసరాలు తీరడానికి, సరియైన జీతభత్యాలు ఏర్పాటు చేయడం మన బాధ్యత.

నేడు కొన్ని మస్జిద్‌లలో రెండు వేలు లేదా మూడువేల రూపాయల జీతానికి ఇమామత్ చేసేవారున్నారు. కొందరి ఇమామ్‌లకైతే నేరుగా జీతం అందడం లేదు. అంతేకాదు ఆ ఏరియాలో ఇండ్లకి వెళ్ళి ఒకొక్క ఇంటిలో కొంత చొప్పున వెళ్ళి తీసుకోవాలి. నాయకునిగా గౌరవ స్థానంలో కూర్చోబెట్టవలసిన వ్యక్తిని బిచ్చగాడిగా నిలబెట్టడం మనకు భావ్యం కాదు.

అతనికి మంచి జీతం ఏర్పాటు చేయడమే కాకుండా, సత్యాన్ని నిర్భయంగా చెప్పడానికి అతనికి స్వేచ్ఛ కల్పించాలి. మరియు ఆయన ఖుర్‌ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే నిలదీసి అడగాలి.

పరస్పరం ఒకరిపై మరొకరు బాధ్యత కలిగి ఉండాలి.

ప్రస్తుత వ్యవస్థను తిరిగి ఇస్లామీయ ఆదేశాలకు అనుగుణంగా మార్చడానికి ఖుర్‌ఆన్ మరియు సున్నత్ వెలుగులో మనమేమీ చేయాలో, ఆ వివరాలను **ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో అందిస్తాము.**

# పాఠకుల అభిప్రాయాలు

### ఎడిటోరియల్

అక్బరుద్దీన్, తొగాడియా వ్యాఖ్యల నేపథ్యంలో అందించిన ఎడిటోరియల్ బాగుందన్నారు. జమాత్ నాయకులు గాని, ధర్మ సందేశం ప్రచారం కోసం పనిచేస్తున్నామని చెప్పేవారుగాని, ముస్లిమ్ లాయర్లుగాని కేసులు పెడతారని ఆశించాము. ఎవరూ ధైర్యం చేయలేక పోయారు. అల్లాహ్ పట్ల భయం ఉంటే, న్యాయం కోసం పనిచేయడానికి భయం ఎందుకు?

### హదీస్ విజ్ఞానం

హదీస్‌ల విషయమై మాకు కొన్ని సందేహాలు అందాయి. అయితే అవి హదీస్ విజ్ఞానం శీర్షికలో అందించిన వ్యాసాలలో వివరంగా చెప్పడం జరిగింది. కాబట్టి మరోసారి ఆ వ్యాసాలను చదివితే వారి సందేహాలకు జవాబు లభిస్తుంది.

### పత్రిక నిర్ణీత సమయానికే పంపబడుతుంది ...

ప్రతీ నెలా 15వ తారీఖున శాంతిబాట పోస్ట్ చేయవలసి ఉంది. ఒకొక్కసారి రెండు మూడు రోజులు ఆలస్యంగా పోస్ట్ చేయవలసిన పరిస్థితి ఏర్పడవచ్చు. ఆలస్యంగా చేరడానికి కారణం మేము కాదు. గవర్నమెంట్ పోస్ట్‌లో పంపబడినవి కొందరికి ఒకొక్కసారి చేరడానికి 20 రోజులు లేదా 30 రోజులు పడుతుంది.

### ఖుర్ఆన్ తఫ్సీర్ ...

తెలుగులో తఫ్సీర్ కాపీ కోసం అడుగుతున్నారు. ప్రతీ నెలా వ్యాసానికి అవసరమైనంత మేర తెలుగులో అనువదించి అందిస్తున్నాము. పూర్తి తఫ్సీర్ తెలుగులో అనువాదం చేయలేదు.

### అల్లాహ్ పేరు ...

కొత్తగా చేరిన పాఠకులు పాత సంచికలు చదవండి. ఇంతకు పూర్వమే అల్లాహ్ - ఖుర్ఆన్ - ముహమ్మద్(స) అనే ప్రత్యేక వ్యాసంలో కేవలం ఖుర్ఆన్ ఆయత్‌ల ద్వారా వివరించడం జరిగింది.

### ముస్లిముల ఐక్యత ...

ఐక్యత కోసం మొదటి నుండి అందరినీ కోరుతూనే ఉన్నాము. అయితే ఈ అంశంపై ప్రత్యేకంగా ఇంతవరకూ వ్యాసం ఏదీ అందివ్వలేదు. ఇన్షా అల్లాహ్ ఓ ప్రత్యేక శీర్షికలో ఈ అంశాన్ని ఖుర్ఆన్ మరియు సున్నత్ వెలుగులో పూర్తి వివరాలతో సహా అందిస్తాము.

### ఇతర శీర్షికలు ...

రాతియుగం, ముస్లిమ్ మహిళ, ఖుర్ఆన్ మరియు సైన్స్, ఇంటర్‌నెట్‌లో ఇస్లామ్ కబుర్లు, జ్ఞానం-అజ్ఞానం శీర్షికలను ఆపివేయ లేదు. కొన్ని వ్యాసాల ప్రాధాన్యత దృష్ట్యా లేక స్థలాభావం వలన అందించ లేకపోయాము. వీలును బట్టి వాటిని అందిస్తాము.

### వ్యాసాలు ...

కొన్ని అంశాలపై వ్యాసాలు అందించాలని కోరుతున్నారు. తప్పకుండా వాటని అందిస్తాము. అంశాలను ఒక క్రమంలో అందించడం మూలంగా అవి త్వరలో ప్రచరించబడవచ్చు. లేదా ఆలస్యం కావచ్చు.

### అరబీ భాషపై ...

భాషపై సందేహాలను ఈ 'పాఠకుల అభిప్రాయాలు' శీర్షికలో వివరించలేము. శాంతిబాటలో ప్రచురించబడిన వ్యాసాలపైనే మీ సందేహాలుగాని లేదా అభిప్రాయాలు గాని పంపండి.

**మన రాష్ట్రంలోగాని ఇతరచోట్లగాని శాంతిబాటకు అనుబంధ సంస్థలు ఏమీ లేవు.**

**ఏ జమాత్‌కు ఇది అనుకూలం గాని లేదా వ్యతిరేకం గాని కాదు.**

**ఒకవేళ ఎవరైనా ఆ విధంగా ప్రచారం చేస్తే, అటువంటి ప్రచారానికి మాకూ ఎటువంటి సంబంధం లేదు. కేవలం ఖుర్ఆన్ మరియు సున్నత్‌పైనే ఆధారపడి స్వచ్ఛందంగా కొందరు ముస్లిమ్ సోదరులు నడుపుతున్న పత్రిక ఇది మరియు ఇది ముస్లిమ్ ఉమ్మత్‌కి సంబంధించినది. సత్యాన్ని నిర్భయంగా ఏ ఒత్తిడి లేకుండా ప్రజలకు తెలియజేయాలని మేము ఎవరి దగ్గర నుండి ఆర్థిక సహకారాన్ని కోరలేదు.శాంతిబాటలో అరుదైన గ్రంథాల నుండి ఎంతో విలువైన ఇస్లామీయ సమాచారాన్ని ప్రామాణిక ఆధారాలతో అందిస్తున్నాము కేవలం అల్లాహ్‌పై నున్న భరోసాతో మాత్రమే.**

మీ అభిప్రాయాలను, విమర్శలను కార్డుపై వ్రాసి 'వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ' ఎడ్రస్‌కు గాని లేదా velugubaata@gmail.com కు పంపండి.

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** Saanthibaata Publishing House, 19-1-447, Hanuman Statue Center, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440, **Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650

## తొలి తెలుగు పరిశోధనాత్మక ఇస్లామీయ మాసపత్రిక

అల్లాహ్ అనుగ్రహంతో
4వ సంవత్సరం
విజయవంతంగా
నడపబడుతుంది.
అల్-హమ్‌దులిల్లాహ్!







సర్వమానవాళి సంతోషంగా
జీవించడానికి అల్లాహ్ చూపిన మార్గాన్ని
సులభమైన తెలుగులో అందరికీ
అందించాలనేది మా సంకల్పం

విదేశాలలో ఉండి తెలుగు చదవగలిగే వారి కోసం ప్రచురించబడిన వెంటనే పత్రికను
వెబ్‌సైట్‌లో ఉచితంగా అందుబాటులోకి తెస్తున్న ఏకైక తెలుగు ఇస్లామీయ మాసపత్రిక





అల్లాహ్‌ను మరియు ముహమ్మద్(స)వారిని ప్రేమించే వారిచే
ఆదరించ బడుతూ, ప్రామాణిక ఇస్లామీయ సమాచారాన్ని అందించే పత్రిక





***For Free Download of Our Magazine and Books visit***

**www. saanthibaata.net**
**www.saanthibaata.com**




ధర్మం పేరుతో పేదప్రజలకు అందవలసిన
సొమ్మును దోచుకుంటున్న అవినీతి విద్వాంసుల
మరియు ప్రచారకుల గుట్టు బయట పెట్టిన పత్రిక

శాంతిబాట
ప్రారంభానికి
ముందు
ప్రచురించబడిన
పరిశోధనాత్మక
పుస్తకం




శాంతిబాట
పాఠకులకు
తొలి సంవత్సరం
ఉచితంగా
అందించబడిన
పరిశోధనాత్మక
పుస్తకం




సత్యాన్ని ప్రేమించేవారికి
మా మనవి :
మీ బంధువులను, స్నేహితులను
చందాదారులుగా చేర్చి సత్యాన్ని
వ్యాపింపజేయమని కోరుతున్నాము.

**SAANTHIBAATA MONTHLY March, 2013** Samalkot-533440 (East Godavari Dist.)
**Registered with Registrar of News Papers for India RNI Reg. No. APTEL/2009/29650**
**Postal Concessional Registration No. AP/KD/140/2011-2013**

సృష్టికర్తయైన అల్లాహ్ పంపిన ప్రవక్త మరియు సందేశహరుడైన

# ముహమ్మద్(స)వారి బోధనల సారాంశం

ఏ ధర్మానికి చెందిన పొరుగువాడైనా సరే, ఆ పొరుగువానిని ప్రేమించడం మాత్రమే కాకుండా, అతడి అవసరాలను కూడా తెలుసుకోవాలి. అతడు ఆకలితో ఉంటే, అతనితో పాటు ఆహారాన్ని పంచుకోవాలి. అతడు పస్తులుండగా మనం కడుపు నిండా తింటే మనం విశ్వాసులం కాము.

కూలివాని చెమట బొట్టు ఆరకముందే అతని కూలి అతనికి ఇచ్చివెయ్యాలి.

బహుమతులుగాని మరేదైనా పంచవలసి వస్తే మన ఇంటికి ఏ పొరుగువాని గుమ్మం దగ్గరగా ఉందో వారికి ముందు ఇవ్వాలి, వారు ముస్లిములు కాకపోయినా సరే.

పొరుగువాని ప్రశాంతతకు భంగం కలిగించేవాడు విశ్వాసి కాడు.

భార్యను బాగా చూసుకునే వాడే ఉత్తముడు.

తల్లిదండ్రులను ప్రేమించాలి. వారికి సేవ చేయాలి. వారి కోసం అల్లాహ్‌ను ప్రార్థించాలి. వారు వృద్ధాప్యంలో ఉంటే, 'ఉఫ్' అని అసహనం కూడా వ్యక్తం చేయకూడదు.

పిల్లలను ప్రేమించాలి. వారు ఆడపిల్లలైనా మగపిల్లలైనా సరే వారిని విద్యావంతులుగా చేయాలి. ఉత్తమ లక్షణాలు వారికి అలవడేలా వారికి శిక్షణ నివ్వాలి.

వ్యభిచారానికి, మద్యపానానికి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.

స్త్రీలను గౌరవించాలి.

పరమత సహనం కలిగి ఉండాలి.

కుమార్తెలను బాగా చూసుకునే విశ్వాసులకు స్వర్గ శుభవార్తనిచ్చారు. కుమార్తెలను కలిగి ఉండడం విశ్వాసులకెంతో అదృష్టం.

మానవులంతా సమానమే. వారి రంగు, రూపు, జాతి, స్థితి మొదలైన వాటివలన వారికి ఎలాంటి ఆధిక్యత లేదు. అల్లాహ్ పట్ల భీతి (తఖ్వా) కలిగి, మంచిగా ఆచరించేవారే అందరికంటే అధికులు.

తన స్వహస్తాలతో కష్టపడి తినేతిండి ఉత్తమమైన ఆహారం. శక్తిని బట్టి కష్టపడి పనిచేసి సంపాదించాలి.

ఆధునిక సైన్స్‌కు పునాదులు వేయించి, సైన్స్‌లో వివిధ
రంగాలకు పితామహులను తయారుచేసిన
ఇస్లామ్ సర్వమానవులు ఆచరించదగిన ధర్మం.
ఎవరో కొందరు ముస్లిములను చూసి ఇస్లామ్‌ను
నిందించడం అనాగరికం మరియు హేయమైన పని.
కత్తితో ఇస్లామ్ వ్యాపించలేదు. మానవత్వంతో, ఉత్తమ
సంస్కారంతోనే వ్యాపించింది.

Visit
www.saanthibaata.net
23 దేశాలలోని తెలుగు పాఠకులచే వీక్షించబడుతున్న
తెలుగు ఇస్లామీయ వెబ్‌సైట్